


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

నేడు హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ
ధాన్యం కొనుగోలుకు రూ.20వేల కోట్లు
మోల్డోవా అధ్యక్షురాలుగా మయా సందు
లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 334 | మంగళవారం | 05-11-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## నేడు అమెరికా అధ్యక్ష ఎన్నిక

### కీలక రాష్ట్రాలలో కమలాహారిస్ పైచేయి పోల్‌సర్వేపై ట్రంప్ మండిపాటు

**సిడ్నీ :** ప్రపంచదేశాలు ప్రధానంగా ఆసియాదేశాలు నిశిత దృష్టి సారించిన అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ మంగళవారంనాడు జరుగుతుంది. కమలా హారిస్ గెలిస్తే ఈ ఎన్నికలు ట్రంప్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన ప్రజాతీర్పుగా మారుతుంది. ట్రంప్ గెలిస్తే పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని, జీవన వ్యయాలను ఆయన అడ్డుకోగలరని ప్రజలు విశ్వసించారని రుజువు అవుతుంది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. 78 మిలియన్ ఓటర్లు ఈ పోలింగ్‌లో పాల్గొంటారు. చివరి గంటల్లో ట్రంప్, హారిస్ ఇరువురూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రచారాన్ని, పరస్పర విమర్శలను ఉద్ధృతం చేశారు. ఓటర్లకు ఎవరి పద్ధతులలో వారు తుది సందేశాలు ఇచ్చారు. ఐతే ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా వివిధ పద్ధతులలో 6.7 కోట్ల మంది ఓటర్లు ముందుగానే ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. పోలింగ్‌రోజు రద్దీ తగ్గించేందుకు ప్రభుత్వ అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే చాలామంది వృద్ధులు ఓటింగ్ ప్రక్రియ పూర్తిచేశారు. కొద్ది గంటల్లో ఓటింగ్ ప్రారంభమవుతున్నదశలో ఎవరు తరువాయి 2లో

## 'డెడికేటెడ్ కమిషన్' చైర్మన్‌గా బుసాని వెంకటేశ్వరరావు

### రిటైర్డ్ ఐఎఎస్ అధికారి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
### బిసి రిజర్వేషన్లపై సమగ్ర సమాచారాన్ని అందించేందుకు నెలరోజులు గడువు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్లకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బుసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో 'డెడికేటెడ్ కమిషన్'ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌కు సంబంధించి, స్థానిక సంస్థల స్వభావం, సమస్యలు, సమకాలీన అంశాలను ఈ ప్రత్యేక కమిషన్ పరిశీలించనుంది. కమిషన్ సమగ్ర సమాచార నివేదికను అందజేసేందుకు ప్రభుత్వం ఒక నెల గడువు విధించింది. బిసి గురుకులాల సొసైటీ కార్యదర్శి బి.సైదులును కమిషన్ కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బిసి కమిషన్ సేకరించిన సమచారాన్ని కూడా పరిశీలిచేందుకు డెడికేటెడ్ కమిషన్‌కు ప్రభుత్వం అధికారాన్ని కల్పించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణుల సేవలను, సూచనలను, సలహాలను తీసుకునే వెసులుబాటును కూడా తరువాయి 2లో




సిపిఐ శతాబ్ది సంవత్సరం సందర్భంగా పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఆమోదించిన లోగో



## టెట్ నోటిఫికేషన్

### నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
### జనవరి 1 నుంచి 20 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజి టెట్–2024) నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరించనున్నారు. 2025, జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నారు. పూర్తి సమాచారం నిమిత్తం పాఠశాల విద్యా అధికారిక వెబ్ సైట్‌లో పొందవచ్చని ఇ.వి.నర్సింహారెడ్డి సూచించారు. గత ఏడాది మేలో టెట్ నోటిఫికేషన్ తరువాయి 2లో

## రెచ్చగొట్టే ప్రకటనలు నమ్మొద్దు



- గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన విద్యావ్యవస్థ
- సమూల మార్పులు తెస్తాం
- తెలంగాణ పునర్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంపుపై సిఎంకు విద్యార్థులు ధన్యవాదాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉన్నత చదువులు చదువుకుని, విద్యార్థులు తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలు నమ్మొద్దు అని అన్నారు. గత పదేళ్లలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తుందని హామీనిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో విద్యార్థులు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల ఎంఎల్‌ఎ ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసానికి తరువాయి 2లో

## సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

### అవసరమైన చర్యలు చేపట్టండి : సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా తరువాయి 2లో

## మార్చిలోపు పెండింగ్ బిల్లులు

### సర్పంచులకు మంత్రి పొన్నం హామీ

ప్రజాపక్షం / హైదరాబాద్



సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు మార్చిలోపు చెల్లిస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు చేస్తున్న ఆందోళనపై స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందరికీ తెలుసునని, సర్పంచ్‌లు ఓపిక పట్టాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పాపమే నేడు సర్పంచ్‌ల ఆందోళన అని, వారి ఆత్మహత్యలకు కారణం అయిన వారే నేడు వారికి తరువాయి 2లో

## అదుపుతప్పి లోయలోకి..

### 36 మంది దుర్మరణం, 24 మందికి గాయాలు

### ఉత్తరాఖండ్‌లో ఘోర బస్సు ప్రమాదం
### ఓవర్‌లోడ్ కారణంగానే ఘటన
### చోటుచేసుకున్నట్టు అధికారుల వెల్లడి



**మర్చుల :** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన ఓ బస్సు అదుపుతప్పి అల్మోరా జిల్లాలోని ఓ లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 36 మంది ప్రయాణికులు మృతి చెందారు. మరో 24 మందికి గాయాలయ్యాయి. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం సమయంలో బస్సులో 60 మంది ఉన్నారు. ప్రైవేటు గర్వాల్ మోటార్ ఓనర్ అసోసియేషన్ నడుపుతున్న 43 సీట్లుగల బస్సు సామర్థ్యానికి మించి ప్రయాణికులతో గర్వాల్ రీజియన్‌లోని పూరి నుంచి కుమాన్‌లోని రామ్‌నగర్‌కు వెళ్తుండగా సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైనట్లు జిల్లా మేజిస్ట్రేట్ అలోక్ కుమార్ తెలిపారు. బస్సు కిక్కిరిసి పోవడంతో రామ్‌నగర్‌కు 35 కిలోమీటర్ల దూరంలో అదుపుతప్పి 200 మీటర్ల లోయలో పడిపోయిందన్నారు. బస్సు బోల్తాపడి దొర్లుకుంటూ లోయలో పడిపోవడంతో నుజ్జునుజ్జు అయిన దృశ్యాలు తరువాయి 12లో



హైదరాబాద్, మగ్దూమ్ భవన్‌లో సోమవారం జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో పాల్గొన్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు సయ్యద్ అజీజ్ పాషా, డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సహాయ కార్యదర్శులు ఎన్. బాలమల్లేష్, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, విఎస్.బోస్, టి.శంకర్, భాగం హేమంత్ రావు, ఇటి.నరసింహ్మ, ఎం.బాలనరసింహ్మ.

మహాయుతిలో లుకలుకలు 05

ఝార్ఖండ్‌లో ఆదివాసీ ఓట్లకోసం బిజెపి మల్లగుల్లాలు 06

## డిగ్రీ విద్యార్థినిపై ప్రేమోన్మాది దాడి

### ఆరు నెలలుగా ప్రేమ పేరిట వేధింపులు
### తిరస్కరించడంతో కత్తితో దాడి
### విద్యార్థిని పరిస్థితి విషమం



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి

ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాసేందుకు కళాశాలకు వచ్చిన ఓ విద్యార్థినిపై ప్రేమోన్మాది దాడికి పాల్పడ్డాడు. గత ఆరు నెలలుగా ప్రేమ పేరిట వేధింపులకు గురి చేస్తుండగా, విద్యార్థిని తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో యువకుడు విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మెదక్ పట్టణం అవుసులపల్లికి చెందిన విద్యార్థిని సోమవారం తరువాయి 2లో

## మతోన్మాద శక్తుల దాడులకు వ్యతిరేకంగా ప్రచారం

### ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని వామపక్ష పార్టీల నిర్ణయం

ప్రజాపక్షం / హైదరాబాద్

మతోన్మాద శక్తుల దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీ నుంచి 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని పది వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, దుశ్చర్యలకు పాల్పడడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ప్రజల్లో భయాందోళనలను నివారించి, మత సామరస్యాన్ని కాపాడడానికి అన్ని జిల్లాల్లో వామపక్ష పార్టీలతో పాటు, ప్రజాసంఘాలు, అభ్యుదయవాదులతో సదస్సులు, సమావేశాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని తీర్మానించాయి. పది వామపక్ష పార్టీల తెలంగాణ రాష్ట్ర కమిటీల సమావేశం తరువాయి 2లో



## ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపుపై దృష్టి

### రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి సారించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సచివాలయంలో జరిగిన రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లుతో తరువాయి 12లో



# ఇలాగే ఉంటే గాజాలో ఇక దుర్భిక్షమే

## డబ్ల్యుఎఫ్‌పి హెచ్చరిక
## సిరియాపైనా దాడి చేస్తాం : ఐడిఎఫ్



**గాజా :** గాజాలో ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో మరో 33 మంది మరణించారు. 156 మంది గాయపడ్డారు. ఇటీవలి వారాల్లో ప్రతిరోజూ ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) వరుస దాడులు కొనసాగిస్తున్నది. యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజన్సీ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ)తో సంబంధాలు రద్దు చేసుకుంటున్నట్లు ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయెల్ అధికారికంగా తెలియజేశాక వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యుఎఫ్‌పి) తీవ్రంగా స్పందించింది. గాజాలో ఇప్పటివరకూ కొనసాగుతున్న మానవతా సంక్షోభం ఇకమీదట దుర్భిక్షంగా, కరువు కాటకంగా మారిపోయే ప్రమాదం ఉందని డబ్ల్యుఎఫ్‌పి బృందాల నాయకులు తీవ్ర హెచ్చరిక చేశారు. యుఎన్ఆర్‌డబ్ల్యుఎతో సంబంధాలు రద్దుచేసుకుంటూ ఇజ్రాయెల్ ఒక శాసనాన్ని గతనెలలోనే ఆమోదించింది. హమాస్ ఉగ్రవాద సంస్థతో యుఎన్ఆర్‌డబ్ల్యుఎకు సంబంధాలు ఉన్నాయని, హమాస్‌కు ఈ సంస్థ సహాయం చేస్తోందని ఇజ్రాయెల్ చాలాకాలంగా వాదిస్తోంది. ఈ వాదనకు బలంచేకూరేలా తాజాగా ఈ సంస్థతో సంబంధాలు రద్దుచేసుకుని దాని కదలికలను నియంత్రించింది. అదేవిధంగా ఇరాన్‌తో కలిసి పనిచేస్తోందని సిరియాపై ఆరోపణలు చేస్తూ సిరాయాపై కూడా తమ సేనలు భూతల దాడులు చేస్తాయని ఇజ్రాయెల్ మొదటిసారి ప్రకటించింది. గాజాలోకి ఆహార సరఫరా చేసేందుకు ఇజ్రాయెల్ సైన్యం అనేక ఆంక్షలు విధిస్తోందని, ఇది కరువుకాటకంగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గాజాలో పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయ వైమానిక సంస్థలు తమ సర్వీసులను నియంత్రించాయి. గాజాతోపాటు లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ తన యుద్ధాన్ని ఉద్ధృతం చేసింది. ఏడాదిపైగా జరుగుతున్న యుద్ధంలో ఇప్పటివరకూ 43,374 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 1,02,261మంది గాయపడ్డారు. లెబనాన్‌లో జరుగుతున్న యుద్ధంలో 2,900 మంది మరణించారు. మరో 13,402 మంది గాయపడ్డారు. గడచిన శుక్రవారం లెబనాన్‌లో ఐడిఎఫ్ చేసిన దాడుల్లో 52 మంది మరణించారు.

# కెనడా హిందూ ఆలయంలో ఖలిస్థానీ దాడి

## ముష్టిఘాతాలతో ఘర్షణ ః ట్రూడో ఖండన



**ఒట్టావా :** కెనడాలోని ఒక హిందూ ఆలయంలో జరిగిన ఘర్షణలను ఆ దేశ ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ఖండించారు. ఐతే ఈ ఘర్షణకు సంబంధించి ఇంతవరకూ ఎవరినీ అరెస్టు చేయలేదు. బ్రాంప్టన్‌లో ఖలిస్థాన్ పతాకాలు చేతపట్టుకుని వచ్చిన నిరసన ప్రదర్శకులు ఆదివారంనాడు హిందూ ఆలయంలోకి వెళ్ళి ఘర్షణ పడ్డారు.ట్రూడో ఈ ఘటనను ఖండిస్తూ కెనడాలో ఏ మతస్థులైనా తమ తమ తమ విధానాలను స్వేచ్ఛగా ఆచరించవచ్చునన్నారు. ఖలిస్థానీ నిరసన ప్రదర్శకులు, ఆలయంలో ఉన్న హిందువులమధ్య ముష్టిఘాతాలతో ఘర్షణ జరిగింది. బ్రాంప్టన్‌లోని హిందూ సభా ఆలయంలో ఈ ఘర్షణ జరిగినట్లు పీల్ రీజినల్ పోలీసులు తెలియజేశారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. ఐతే ట్రూడో ఈ విషయంలో సకాలంలో స్పందించిన స్థానిక అధికారులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విధమైన ఘర్షణలు సమ్మతం కాదన్నారు. ఇదిలా ఉండగా ఒట్టావాలో ఉన్న భారత హై కమిషన్ కూడా సోమవారంనాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. హిందూ వ్యతిరేకశక్తులు ఈ దాడికి పాల్పడ్డాయని విమర్శించింది. ఈ వీడియోలు తాము చూశామని భారత వ్యతిరేక శక్తులే ఈ దాడి చేశాయని పేర్కొంది.

ప్రపంచం

# మోల్డోవా అధ్యక్షురాలుగా మయా సందు

## ఎన్నికల్లో తమ జోక్యం లేదని రష్యా ప్రకటన

**ఛిసినౌ :** తూర్పుయూరప్ దేశం మోల్డోవా రిపబ్లిక్ అధ్యక్ష ఎన్నికల్లో వరుసగా రెండోసారి కూడా మయా సందు (52) విజయం సాధించారు. యూరోపియన్ యూనియన్ అనుకూల వైఖరిగల మయాసందు, రష్యా అనుకూల ప్రతిపక్ష అభ్యర్థి అలెగ్జాండర్ స్టోయినోగ్లో మధ్య నువ్వా? నేనా? అనే రీతిలో ఉద్ధృతంగా ఎన్నికల పోరాటం జరిగింది. స్టోయినోగ్లోకు రష్యాలోని పార్టీ సోషలిస్ట్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తాను గెలిస్తే రష్యాతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తాననీ, దేశాన్ని ముందుకు నడిపిస్తాననీ స్టోయినోగ్లో ప్రజలకు వాగ్దానం చేశారు. 51 సంవత్సరాలపాటు మోల్డోవా సోవియట్ యూనియన్‌లో ఒక రిపబ్లిక్‌గా కొనసాగి తర్వాత స్వాతంత్ర్యం పొందింది. ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్లలో స్టోయినోగ్లో పైచేయి సాధించారు. ఐతే ఎన్నికల్లో (రనాఫ్) మయాసందు విజయం సాధించారని సెంట్రల్ ఎలక్టోరల్ కమిషన్ సోమవారం ప్రకటించింది. ఆమెకు 55.41 శాతం ఓట్లు లభించాయి. స్టోయినోగ్లోకు 44.59 శాతం ఓట్లు లభించాయి. కాగా దేశాధ్యక్షురాలి తరపున పనిచేసే జాతీయ భద్రతా సలహాదారు ఒక ప్రకటన చేస్తూ, మోల్డావా ఎన్నికల్లో రష్యా తీవ్ర జోక్యం చేసుకుందని, ఫలితాలను తారుమారుచేసేస్థాయిలో ఈ జోక్యం ఉందని ఆరోపించారు. దీంతో రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఎన్నికల ప్రక్రియలో తమ జోక్యం ఎంతమాత్రం లేదని తీవ్రంగా ఖండించింది. మరోవైపు దేశంలో తన అభిమానులతోపాటు తనను వ్యతిరేకించేవారితో సహా దేశమంతటికీ తాను దేశాధ్యక్షపదవిలో న్యాయం చేస్తానని మయా సందు ప్రకటించారు. అవినీతి నిర్మూలన, న్యాయ సంస్కరణలు చేపడతానని ఆమె ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. యూరోపియన్ యూనియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా ఓన్ డెర్ లేయన్ తోపాటు యూరోపియన్ యూనియన్ దౌత్యవేత్త జోసెఫ్ బోర్రెల్ ఒక సంయుక్త ప్రకటనలో అధ్యక్ష పదవికి ఎన్నికైన మయా సందుకు అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికలలో రష్యా జోక్యం చేసుకుందని ఆరోపించారు.







# ఇండోనేసియాలో అగ్ని లావాః పదిమంది మృతి

**జకర్తా :** తూర్పు ఇండోనేసియాలో అగ్నిపర్వతం బద్దలై లావా వెదజల్లడంతో సోమవారం తెల్లవారుజామున 10 మంది మరణించారు. తూర్పు నుసా టెంగ్గెరా రాష్ట్రం ఫ్లోరెస్‌లో ఉన్న మౌంట్ లెవొటొబీ లకీ–లకీ అందరూ నిద్రలో ఉన్న సమయంలో బద్దలై లావా వెదజల్లిందని ఇండోనేసియా సెంటర్ ఫర్ వోల్కనోలజీ అండ్ జియోలాజికల్ డిజాస్టర్ మిటిగేషన్ (పివిఎంజి) విభాగ అధికార ప్రతినిధి హది విజయ ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అగ్నిపర్వతం నుండి భగభగబమండే ఎర్రటి లావా ఉండలు దొర్లుకుంటూ గ్రామంలోకి వచ్చి గ్రామాలను ధ్వంసం చేశాయని చెప్పారు. ఈ లావా వల్ల ఏడు గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయని చెప్పారు. గ్రామస్తులను అగ్నిపర్వతానికి 20 కిలోమీటర్ల దూరానికి సోమవారం ఉదయం తరలించి, తదుపరి హెచ్చరికలు జారీ చేసినట్లు హది విజయ చెప్పారు.

## ప్రేమోన్మాది దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 8 గంటలకు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాసేందుకు వచ్చింది. ఈ క్రమంలో చేతన్ అలియాస్ కిరణ్ కాలేజీ గేటు ముందు ఆ విద్యార్థినితో వాగ్వాదానికి దిగాడు. కోపంతో ఆమె చేతిలోని సెల్ ఫోన్ గుంజుకొని నెలకేసి కొట్టాడు. ఆ తర్వాత యువకుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయగా, విద్యార్థిని ప్రతిఘటించింది. దీంతో విద్యార్థి చేతికి తీవ్ర గాయలయ్యాయి. తీవ్రంగా గాయపడి రక్తస్రావం అవుతున్న ఆమెను స్థానికులు ఆటోలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే చేతన్ అనే యువకుడు గత ఆరు నెలలుగా ప్రేమ పేరుతో వెంటబడుతున్నట్లు బాధిత విద్యార్థిని పోలీసులకు వాగ్మూలం ఇచ్చింది. అయితే దాడికి పాల్పడిన యువకుడు పరారీలో ఉన్నాడని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు చెప్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ఐఎఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సిఎం సూచించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్యను, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్‌వీ కర్ణన్‌ను, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్‌ను, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డాక్టర్ ఎ.శరత్‌ను, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు డి.దివ్యను, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవిని, వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణరెడ్డిని, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరిని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్‌ను నియమించిన విషయం తెలిసిందే.

## టెట్ నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. దీంతో పేపర్ 1లో 99,961 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇందులో 85,996 మంది పరీక్ష రాశారు. ఇందులో 57,725 మంది అర్హత సాధించారు. పేపర్ 2లో 1,86,428 మంది దరఖాస్తులు చేసుకోగా 1,50,491 మంది పరీక్షకు హాజరయ్యారు. 51,443 మంది అర్హత సాధించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ఒక ఏడాదిలోనే రెండోసారి టెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆగస్టులో జాబ్ క్యాలండర్ విడుదల చేసిన నేపథ్యంలో రెండవ టెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఆరు సార్లు టెట్ పరీక్షలు నిర్వహించగా తాజాగా ఏడవ సారి నోటిఫికేషన్‌ను జారీ చేశారు. టెట్ పేపర్1కు డిఇడి, పేపర్2కు బిఇడి పూర్తి చేసిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందేందుకు టెట్ అర్హత ఉండాలని చెబుతున్న నేపథ్యంలో వేలాదిమంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా పరీక్షకు హాజరుకానున్నారు.

## రెచ్చగొట్టే ప్రకటనలు నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)



విద్యార్థులు తరలివచ్చారు. ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన నేపథ్యంలో థాంక్యూ సిఎం సార్ అంటూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సొంత హాస్టల్ భవనాలు నిర్మించాలని విద్యార్థులు కోరారు. స్థానిక అధికారులతో స్థల సేకరణ చేయించిన అనంతరం స్వంత హాస్టల్ భవనం మంజూరు చేస్తామని సిఎం విద్యార్థులకు హామీనిచ్చారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఐటిఐలను ఏటిసిలుగా మారుస్తున్నామని చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. యువజన సంఘాలు బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించేలా చొరవ చూపాలని కోరారు. స్కూల్స్, కాలేజీల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించాలన్నారు. ఇది యువతరంపై ఉన్న అతి పెద్ద బాధ్యత అని, యువత విద్యాను నిర్లక్ష్యం చేయవద్దు అని సూచించారు. గంజాయి, డ్రగ్స్ అన్నింటికంటే పెద్ద ప్రమాదకరమన్నారు. అలాంటి వ్యసనాల బారిన పడొద్దు అని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధంకండి అన్నారు. విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమే అన్నారు. చదువుకున్న వారు ప్రయోజకులు అవుతారని, సామాజిక స్పృహతో సమాజానికి సేవచేసే వారు మాజంలో హీరోలు అవుతారన్నారు. పాఠశాలల్లో విద్యాతో పాటు సామాజిక అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు గ్రూప్ డిస్కషన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## బుసాని వెంకటేశ్వరరావు

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్‌కు కల్పించారు. వివిధ ప్రజా సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, కమిషన్లు, విశ్వ విద్యాలయాల నుంచి అవసరమైన సహాయన్ని తీసుకోవడంతో పాటు అవసరమైతే అధ్యయనం చేసేందుకు కమిషన్‌కు అవకాశాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**కమిషన్ ఏర్పాటుపై సిఎంకు బిసి సంఘాల కృతజ్ఞతలు**

న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్లు అమలు జరిగేందుకు వీలుగా 'డెడికేటెడ్ కమిషన్'ను ఏర్పాటు చేసినందుకుగాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిసి సంఘాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి ఆర్.కృష్ణయ్య, ఎంఎల్‌ఎ దానం నాగేందర్, ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణ మోహన్‌రావు, బిసి సంఘాలకు చెందిన పలువురు నేతలు జూబ్లీహిల్స్ నివాసంలో సోమవారం ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆర్.కృష్ణయ్య, బిసి సంఘం నేతలు సిఎంను అభినందించారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని, ఆ ప్రక్రియలో భాగంగానే డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయం కులగణన సర్వే ఈ నెల 6 నుంచి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ సచివాలయంలో కులగణనపై సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు చాంబర్‌లో జరిగిన ఈ కులగణన సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపి.ఆర్ కృష్ణయ్య, ఎంఎల్‌ఎ దానం నాగేందర్, షాద్‌నగర్ వి.శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కులగణన విధివిధానాలపై చర్చలు జరిపినట్లు సమాచారం. మాజీ ఎంపి ఆర్ కృష్ణయ్య కులగణనపై సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా మంత్రి శ్రీధర్‌బాబు, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ తదితురులకు ఆర్.కృష్ణయ్య ఈ సందర్భంగా శాలువ కప్పి సత్కరించారు.

## దాడులకు వ్యతిరేకంగా ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం మాకినేని బసవపున్నయ్య భవన్‌లో జరిగింది. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి.చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డి.జి.నరసింహారావు, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, కె.జి.రాంచందర్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, నాయకులు వనం సుధాకర్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు తేజ, సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకిరాములు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న పాల్గొన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, భజరంగ్‌దళ్ శక్తులు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మైనారిటీలపై దాడులను ప్రోత్సహిస్తున్నాయని, మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలను వేధింపులకు, భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు ఉసిగొల్పుతున్నాయని, ఈ మతోన్మాద దుశ్చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని ప్రజలకు వామపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ ఏరియాలో కొత్త పోలీస్ చట్టం సెక్షన్ 163 ద్వారా బహిరంగ ప్రచార కార్యక్రమాలు చేయరాదనే నిషేదాజ్ఞలను సమావేశం తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తక్షణమే నిషేదాజ్ఞలను ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.

## అధ్యక్ష ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

గెలుస్తారన్న విషయంపై గతంకంటే ఎంతో ఆసక్తికరమైన పద్ధతుల్లో ఊహాగానాలు కొనసాగుతున్నాయి. కీలకరాష్ట్రాలు పెన్సిల్వేనియా, మిచిగన్, విస్కాన్సిన్, నెవాడా, అరిజోనా, జార్జియా, నార్త్ కరోలినాలలో భారీ ప్రచారాలు కొనసాగుతున్నాయి. ఈ కీలక రాష్ట్రాలలో కమలా హారిస్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నారన్న తాజా సర్వేలపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూయార్క్ టైమ్స్ కూడా తుది విడత సర్వేలో కమలా హారిస్ రేజర్ ఎడ్జ్ ఆధిపత్యంలో ఉన్నట్లు పేర్కొంది. ఐతే అరిజోనాలో మాత్రం ట్రంప్ లీడ్‌లో ఉన్నారని పేర్కొంది. ట్రంప్ 2020 నుండీ ఇంతవరకూ ఎన్నికల్లో 50 శాతం మేరకు ఓటర్లలో సానుకూల అభిప్రాయాన్ని కూడగట్టుకోలేకపోయారు. ప్రైమరీస్‌లో ట్రంప్ పార్టీపరంగా ఎంతోమందిని దాటుకుని ముందుకు వెళ్ళారు. ఐక్యరాజ్యసమితి మాజీ దౌత్యవేత్త నిక్కీహేలీ, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీశాంటిస్‌లను ఆయన వెనక్కునెట్టారు. ఆర్థికవ్యవస్థ పరంగా దేశం తప్పుడు మార్గంలో ఉందని ఎక్కువమంది ఓటర్లు భావిస్తున్న తరుణంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. 60 నుండి 70 శాతం ఓటర్లు ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు మీడియా పేర్కొంది. ఐనప్పటికీ కమలా హారిస్‌కు పరిస్థితి అనుకూలంగా ఉందని తాజా సర్వే పేర్కొంది. పెరిగిన జీవన వ్యయాలు, హౌస్‌హోల్డ్ బడ్జెట్ ఒత్తిడులు, భవిష్యత్ ఆర్థిక భద్రత విషయంలో ఓటర్లు ఆందోళనతో ఉన్నారు. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఆహార వస్తువుల ధరలు, పెట్రోలు ధరలు, బీమా వ్యయాలు పెరిగాయి. కాగా 2015 నుండీ మరో అతి పెద్ద సమస్యగా అక్రమ వలసలు ఎన్నికల్లో తెరమీదకు వచ్చాయి. ట్రంప్ పదే పదే ఇదే విషయంపై రాద్ధాంతం చేస్తున్నారు. పునరుత్పత్తి హక్కులు, ఆరోగ్య సేవలు కూడా ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మూడు ప్రాంతాలలో ఎడతెగని యుద్ధాలు, ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ధరలు, చమురు ధరల ఆధిపత్యం, నౌకా రవాణా వంటి అనేక సమస్యలతో అమెరికా ఎన్నికలు ముడిపడి ఉండటంతో అన్ని దేశాలూ అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపైనే దృష్టి పెట్టాయి. పాలస్తీనా–ఇజ్రాయెల్ సమస్య పరిష్కరిస్తామని అటు ట్రంప్, ఇటు కమలా హారిస్ వాగ్దానాలు చేశారు. కమలాహారిస్‌కే రేజర్ ఎడ్జ్ లీడింగ్ ఉందని పలు పోల్ సర్వేలు ప్రకటించాయి. ఐతే ట్రంప్ దీంతో సంబంధం లేకుండా పూర్తి గెలుపు విశ్వాసంతో ఉన్నారు. పోల్ సర్వేలో కమలాహారిస్ గెలుస్తుందని పేర్కొనడంతో ఎన్నికల ర్యాలీలో ట్రంప్ ఆ పోల్‌స్టర్‌పై విరుచుకుపడ్డారు. ''డెస్ మోయినెస్ రిజిస్టర్ అండ్ మీడియా కామ్'' సర్వే ప్రకారం ఓటర్ల మద్దతు కమలా హారిస్‌కు 47 శాతం, ట్రంప్‌కు 44 శాతం ఉంది. దీనిని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఐతే ఎంతో గౌరవప్రదమైన, విశ్వసనీయమైన ఎన్నికల సర్వే నిపుణురాలు జె.ఆన్ సెల్జర్‌పై ట్రంప్ విమర్శలు చేయడాన్ని మీడియా సంస్థలు చర్చకు పెట్టాయి. పెన్సిల్వేనియాలో జరిగే ఓటింగ్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతాయని ట్రంప్ ప్రచారం చేయడాన్ని కూడా చర్చించాయి. కాగా 2024 అధ్యక్ష ఎన్నికలలో ఎలాన్‌మస్క్ ఒక పెద్ద సెలబ్రిటీగా తెరమీదకు వచ్చారు. ఆయన బాహాటంగా డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతు తెలియజేశారు. ఐతే తప్పుతోవ పట్టించే ప్రచారాల ద్వారా ఎలాన్‌మస్క్ ఎక్స్ వేదికలో వందలకోట్లమంది వీక్షకులను కూడగట్టుకున్నారని ఒక ప్రముఖ అమెరికా ఛానల్ విమర్శలు గుప్పించింది. ఎన్నికల ఫలితాలపై భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాలకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఎవరు గెలిచినా దక్షిణాసియాతో సంబంధాలలో ఎలాంటి మార్పులూ ఉండబోవని దక్షిణాసియా–వాషింగ్టన్ సంబంధాల నిపుణుడు మైఖేల్ కుగెల్మన్ వ్యాఖ్యానించారు. కానీ ట్రంప్ గెలిస్తే టెక్నాలజీ బదిలీపై తీవ్ర ఆంక్షలు అమలు చేసే అవకాశం ఉందని, ట్రేడ్ టారిఫ్ విధానం అమలులో భారత్‌పట్ల ఆయన అసంతృప్తితో ఉన్నారన్నారు. భారత్‌తో కూడా క్లీన్ ఎనర్జీ, వాతావరణమార్పులు, టెక్నాలజీ బదిలీ విషయంలో కొనసాగుతున్న బంధంలో మార్పులు వస్తాయని అంచనావేశారు. అధ్యక్ష పదవిలో ఎవరు ఉన్నా చైనాను ప్రతిఘటించేందుకు భారత్‌తో కలిసి అమెరికా తన ఉమ్మడి ప్రయోజనాలకోసం పోరాటం చేస్తుందని, మౌలికసదుపాయాల రంగాలలో పెట్టుబడులకు సరికొత్త మార్గాలను వైట్‌హౌస్ అన్వేషించే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన తన విశ్లేషణలో పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగంవైపు మొగ్గుచూపుతోందన్నారు. ఐతే ఎవరు గెలిచినా తాలిబాన్ ఉగ్రవాద ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరాలు ఉండవని ఆయన విశ్లేషించారు.

## పెండింగ్ బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా ధర్నాలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వంద ఎలుకలు తిన్న పిల్లి' మాదిరి బిఆర్‌ఎస్ నేతలు రాష్ట్రంలో సర్పంచుల గురించి మాట్లాడుతున్నారని మంత్రి ప్రభాకర్ ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీల ఉచ్చులో సర్పంచులు పడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

**కిషన్ రెడ్డి రక్తంలో తెలంగాణ డిఎన్‌ఎ లేదు:**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రక్తంలో తెలంగాణ డిఎన్‌ఎ లేదని, తెలంగాణ డిఎన్‌ఎ ఉంటే ఈ రాష్ట్రం కోసం ఏదైనా చేసేవారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వరద నష్టం నివేదికను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు నివేదిక ఇస్తే రూ.10 వేల కోట్ల నష్టానికి కేవలం రూ.400 వందల కోట్లు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాల కోసం ఏం చేశారో చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేసిద్కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చెప్పాలని, ఈ విషయాలపై అమరవీరుల స్థూపం వద్దకు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. మాజీ సిఎం కెసిఆర్ సలహాతోనే కిషన్‌రెడ్డి బిజెపి అధ్యక్షుడు అయ్యారని, కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి విమర్శలు చేస్తే ఊరుకోవాలా అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బిఆర్‌ఎస్ రెచ్చగొడుతున్నదని, ఈ రెచ్చగొట్టే కార్యక్రమం ముగిశాక న్యాయం చేయడానికి మేము వెళతామన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ కాంగ్రెస్ అయితే శవాల మీద పేలాలు ఏరుకునే పార్టీ బిఆర్‌ఎస్ అని విమర్శించారు.

### ఆశ్రమ, గురుకులాల విద్యార్థులను ..

# సొంత పిల్లలుగా చూసుకోవాలి

గత ప్రభుత్వ అప్పులకు గంటకు రూ.3కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం

అయినా ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులకు మేలు చేస్తున్నాం

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆశ్రమ, గురుకులాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత అధికారులకు సూచించారు. హాస్టల్ పిల్లలంటే చులకన భావం ఉంటుందని, తనది కూడా హాస్టల్ జీవితమేనని, చిన్నప్పుడు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానన్నారు. మనల్ని అవహేళన చేసే వారికి గుణపాఠం చెప్పేలా కసితో కష్టపడాలని, అప్పుడే ఎదుగుతామని తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవనంలో గిరిజన సంక్షేమంపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థుల కోసం రూపొందించిన హెల్త్ మానిటరింగ్ యాప్‌ను ప్రారంభించారు. అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సంపాదించిన పలువురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను బహూకరించారు.

**గత ప్రభుత్వం చేసిన అప్పులకు గంటకు రూ.3 కోట్ల వడ్డీ : మంత్రి సీతక్క**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పభుత్వం చేసిన అప్పులకు ఇప్పుడు గంటకు రూ.మూడు కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తుందని మంత్రి సీతక్క తెలిపారు. ఎన్నో ఆర్థిక సమస్యలు వున్నా.. ప్రభుత్వం ఉద్యోగులకు, విద్యార్థులకు మేలు చేస్తోందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉద్యోగులు, టీచర్లు వారధులని, టీచర్లు మనసుపెట్టి పనిచేయాలని, కష్టాన్ని ఇష్టంగా చేసుకుని పనిచేసినప్పుడు అప్పుడే పనిలో సంతృప్తి కలుగుతుందన్నారు.

**పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే సమావేశం లక్ష్యం కావాలి**

గిరిజన సంక్షేమ శాఖ మొత్తం సమావేశం కావటం అభినందనీయమని, ఇది పిల్లల భవిష్యత్తను తీర్చిదిద్దే లక్ష్యం కావాలన్నారు. తను ఏ శాఖలో ఉన్నా నా మనసు మాత్రం ఎప్పుడూ గిరిజన సంక్షేమం మీదే ఉంటుందని, నా ప్రాణం ఆదివాసి, గిరిజనులు, చెంచుల కోసమే కొట్టుకుంటుందని తెలిపారు. గుడాలు, తండాలు, పెంటల నుంచి వచ్చిన పిల్లలు జాతీయ, అంతర్జాతీయ క్రీడ పోటీల్లో పథకాలు సాధిస్తుండడం అభినందనీయమని వీరిని ప్రభుత్వ మరింత ప్రోత్సహిస్తుందన్నారు. బాగా పనిచేసే అధికారులను ఈ సమాజందేవుడు లాగా కొలుస్తుందని, ఎక్కడైతే విద్యా వ్యవస్థ సరిగ్గా లేదో అక్కడే అద్భుతాలు సృష్టించగలగలన్నారు. ప్రజలకు అవసరం ఉన్నచోట అధికారులు పనిచేయాలని, ఆ పని కూడా వేయిలో ఒకరిగా కాకుండా సమాజం గుర్తు పెట్టుకునేలా ఉండాలని అధికారులకు, ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. 16 ఏళ్ల తర్వాత కాస్మోటిక్ చార్జీలను మూడు రేట్లు , ఏడేళ్ల తర్వాత డైట్ చార్జీలను 40 శాతం ఈ ప్రభుత్వం పెంచిందని చెప్పారు. గతంలో నాసిరకం వస్తువులు కొనుగోలు చేశారని, వీటిపై పూర్తి విచారణ జరిపిస్తామని మంత్రి తెలిపారు. అదేవిధంగా హాస్టల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి చిన్న చిన్న సమస్యలు సృష్టించి బయట శక్తులు అపఖ్యాతి తెచ్చే కుట్రలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

### అటవీ ప్రాంతాల్లో

# రోడ్ల నిర్మాణాలకు అనుమతివ్వండి

తద్వారా మారుమూల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి

పెండింగ్ పనులకు అనుమతివ్వండి

అటవీశాఖ మంత్రి, కార్యదర్శికి మంత్రి తుమ్మల లేఖ



**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లాలోని తీవ్రవాద ప్రభావతి ప్రాంతాల్లో మంజూరైన రోడ్ల నిర్మాణాలకు అటవీ అనుమతులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖామంత్రి కొండా సురేఖ, ఆశాఖ కార్యదర్శికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ మంజూరు చేసిన ఎల్‌డబ్ల్యూఎస్ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సంబంధించి వివరాలు లేఖలో పొందుపరిచారు. పెండింగ్ రోడ్లకు, పనులకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అటవీ మనుమతులు మంజూరు చేస్తే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంపై పట్టుపట్టి ఈ నిధులు తీసుకొచ్చామని మంత్రి గుర్తుచేశారు. అభివృద్ధికి అనవాలుగా నిలిచే రోడ్లతోనే జీవనగమనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఎల్‌డబ్ల్యూఎస్ స్కీంలో భాగంగా 2018లో ఫేజ్ 1,2 కింద, 2002లో ఫేస్ 3 కింద రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధుల కింద నిర్మాణం చేపట్టిన రోడ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కొన్ని పనులు అటవీ అనుమతులు రాక పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిపై దృష్టి సారించాలని కోరారు. అభివృద్ధిని ఆకాంక్షించే మీరు శరవేగంగా క్లియరెన్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ రోడ్ల నిర్మాణంతో మారుమూల ప్రాంతాలలో రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని వివరించారు. దీనికి తోడు మారుమూలు ప్రాంతాలలో అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. నిర్మాణం వల్ల అత్యవసర పరిస్థితుల్లో సైతం ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. దీనికి తోడు ప్రకృతి సోయగాలు మధ్య ప్రకృతి ఆధారితాల మధ్య వినోదాన్ని ప్రోత్సహించేందుకు సులభతరం అవుతుందన్నారు. ప్రధానంగా రహదారుల నిర్మాణంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు పర్యాటకాన్ని ప్రకృతిని ఆస్వాదించేందుకు పెద్ద ఎత్తున ఈ ప్రాంతానికి తరలిస్తారని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందని, తద్వారా అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులకు అనేక అవకాశాలు మెరుగుపడతాయని, రోడ్ల నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు యుద్ధప్రాతిపదికన ఇవ్వాలని ఆలేఖలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో 68 రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో 28 రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని అన్నాయని, 18 రోడ్లు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. ఆరు రోడ్లు తిరస్కరణకు గురయ్యాయని, ఇంకా 8 రోడ్లకు అటవీశాఖ అనుమతి రావాల్సి ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి రోడ్ల ప్రాముఖ్యత, ఆవశ్యత ఎంతో ఉందని, తక్షణమే నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు మంజూరీ చేయాలని మంత్రి తుమ్మల ఆ లేఖలో కోరారు.

### రాష్ట్రంలో ఊపందుకున్న పత్తి కొనుగోళ్ళు

ఒక్క రోజే 1474 మంది రైతుల నుండి 3400 టన్నుల పత్తి కొనుగోలు

ప్రభుత్వ కేంద్రాలో గరిష్ట ధరకు అమ్ము కోవాలని రైతులను కోరిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో సిసిఐ అధికారులు 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసిన సిసిఐ సోమవారం ఒక్క రోజే 1474 మంది రైతుల నుండి 3400 టన్నుల పత్తి కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతకుముందు కేవలం 1472 మంది రైతుల నుండి 2724 టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో శనివారం సిసిఐ అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే నిర్దేశించిన లక్ష్యం మేరకు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు వేచి చూడకూడ పత్తి కొనుగోళ్లలో వేగం పెంచాలని అదేశించారు. దీంతో అప్రమత్తమైన సిసిఐ అధికారులు పత్తి కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయడంతపాటు అధికారులు దగ్గర నుండి పర్యవేక్షిస్తుండడంతో పత్తి కొనుళ్లు ఊపందుకుంది.

**ప్రభుత్వ కేంద్రాల్లో గరిష్ట ధరకు పత్తిని అమ్ముకోండి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

రైతులందరు తమ పత్తి పంటను ప్రైవేట్ సంస్థలకు తక్కువ ధరలకు అమ్మి నష్ట పోవద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. పత్తి రైతుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో అన్ని కొనుగోలు కేంద్రాల వివరాలు ఉన్నాయని, ఇందులో దగ్గర్లో ఉన్న కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి గరిష్ట మద్దతు ధరకు పత్తిని అమ్ముకోవాలని సూచించారు.

## పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌ల నిరసనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు నిరసనలు చేపట్టారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి వివిధ స్టేషన్‌లకు తరలించారు. అప్పులు తెచ్చి గ్రామాల్లో శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు వంటి అనేక అభివృద్ధి పనులు చేసినట్లు సర్పంచ్‌లు తెలిపారు. ఆయా పనులకు సంబంధించి 2019నుంచి 2024వరకు బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో బిల్లులు చెల్లించాలని సిఎం, గవర్నర్ సహా అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం సరికాదన్నారు.

**మాజీ సర్పంచుల పరిస్థితి దారుణం :**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం : టి.హరీశ్ రావు**

మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంఎల్‌ఎ హరీశ్ రావు అన్నారు. సిఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా ? అని ప్రశ్నించారు. మాజీ సర్పంచులు అంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టి పనులు చేపట్టారన్నారు. ప్రజాపాలన అంటే గ్రామానికి సేవ చేసిన వారిని అరెస్టు చేయడమేనా? అని ప్రశ్నించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

కెటి రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క మాటను కూడా నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఆరోపించారు. పరిమిత ఉచిత బస్సు మినహా ఒక్క గ్యారంటినీ అమలు చేయలేని అసమర్థత అని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవెర్చకుండా, సబ్బండ వర్గాలను మోసం చేసినందుకు, అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అవినీతి రాష్ట్రంగా మార్చినందుకు యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. ఎఐసిసి అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీకి కెటిఆర్ సోమవారం బహిరంగ లేఖ రాశారు. ఆరు గ్యారంటీలు అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్, మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలు చేయడం చేతకాక చేతులేత్తేశారన్నారు. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తనదే అని చెప్పిన రాహుల్ గాంధీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటు వైపు చూడలేదని కెటిఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు.

## అంతులేని హామీలతో ప్రజలను దగా చేస్తున్న కాంగ్రెస్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతులేని, అమలు కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దగా చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి పట్టిన శని అని అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. తెలంగాణ రాష్ట్రమైతే ఆర్థికంగా దివాళా తీసిందని, రాబోయే రోజుల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా గగనమైయ్యే పరిస్థితి రాబోతోందని ఆరోపించారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీస్తే అంతిమంగా నష్టపోయేది పేదలేనని దీనిని ప్రజలంతా గమనించాలని కోరారు. 6 గ్యారంటీల పేరుతో ఇచ్చిన 400 హామీలను ఎప్పుడు లోగా అమలు చేస్తారు ? ఏ విధంగా అమలు చేయబోనున్నారని నేడు రాష్ట్రానికీ రానున్న ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేయాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ తెలంగాణను పాతాళంలోకి నెట్టింది. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను 10 ఏళ్లు పాలించిన బిఆర్ఎస్ పాతాళంలోకి నెట్టివేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటి అన్నదానితో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన 10 నెలలలోనే లక్ష కోట్లు అప్పు చేసిందన్నారు. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందన్నారు.

## డిసెంబర్ 19 నుంచి ‘హైదరాబాద్ బుక్ ఫెయిర్’



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను డిసెంబర్ 19 నుంచి 29 వరకు హైదరాబాద్ ఇందిరాపార్కు ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహిస్తామని బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకుబ్, కార్యదర్శి వాసు వెల్లడించారు. ప్రజల్లో, విద్యార్థుల్లో విస్తృత ప్రచారం చేసేందుకు ముందుగానే బుక్‌ఫెయిర్ నిర్వహణ తేదీలను ప్రకటిస్తున్నట్టు తెలిపారు. అన్ని రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బుక్ ఫెయిర్ నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే అక్టోబర్ 15 నుంచి ఈ నెల 15 వరకు ఆసక్తి ఉన్న నిర్వాహకుల నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ 37వ బుక్‌ఫెయిర్‌లో జాతీయ, అంతర్జాతీయ పుస్తకాలు లభిస్తాయని, సందర్శకుల కోసం ఈసారి ప్రత్యేక వసతులు కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ రచయితలకు, కవులకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ మంచి వేదిక అని పేర్కొన్నారు. 1987లో ఏర్పడిన హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ప్రగతి సాధిస్తూ పాఠకుల నుంచి మంచి గుర్తింపు పొందుతుండటం అభినందనీయమన్నారు. సమావేశంలో సీనియర్ సంపాదకులు రామచంద్రామూర్తి, బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, కోశాధికారి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.కోటి కోల్పోయిన బాధితులు

చాకచక్యంతో తిరిగి చెల్లించిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన కోటి రూపాయలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంతో నిందితుల నుంచి రికవరీ చేసి తిరిగి బాధితులకు చెల్లించినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసును చేధించిన సైబర్ క్రైమ్ పోలీసులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైయివేట్ ఉద్యోగి (52)కు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి వ్యాపారంలో పెట్టుబడుల సాకుతో గాలం వేసి కోటి రూపాయలను క్షణాల్లో దోచుకున్నారు. బాధితుడు తనకు జరిగిన మోసాన్ని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ డిసిపి కవిత ఆదేశాల మేరకు ఎసిపిలు శివమారుతి, చాంద్‌బాషాలతో పాటు ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రావులు రంగంలోకి దిగి సైబర్ నేరగాళ్ల బ్యాంక్ వివరాలు తెలుసుకుని బ్యాంక్ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. అప్పటికే అతని ఖాతాలో కోటికిపైగా రూపాయలు ఉన్నాయి. అనంతరం దర్యాప్తు చేసి నేరగాడి బ్యాంక్ ఖాతాలో ఉన్న బాధితుడి డబ్బును తిరిగి వెనక్కి రప్పించడంలో పోలీసులు సఫలికృతులయ్యారు. దీంతో బాధితుడు పోగోట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం అందించాలని సివి ఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ మోసంపై ధర్మ యుద్ధానికి సిద్ధం

* ఎస్‌సి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలు భర్తీ చేయొద్దు

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** ఎస్‌సి వర్గీకరణను అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి సర్కార్‌తో యుద్ధమే కొనసాగుతుందని, సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా దేశంలో మేమే మొదట వర్గీకరణ అమలు చేస్తామని, అన్ని నోటిఫికేషన్లకు వర్తించేలా ఆర్డినెన్స్ తెస్తామని, మోసపు మాటలు చెప్పిన ముఖ్యమంత్రి ఎస్‌సి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ నమ్మకద్రోహం చేస్తున్నాడని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని జెవిఎస్‌ఎం ఫంక్షన్ హాల్‌లో మాదిగల ధర్మయుద్ధ మహాసభను నిర్వహించారు. సభలో కృష్ణమాదిగ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నమ్మితే ఎంత మోసం చేస్తాడో టీచర్ల ఉద్యోగాల నియామకాలతో తెలిపోయిందని, 11 వేలకు పైగా ఉద్యోగాల్లో ఎస్‌సి వర్గీకరణ లేకపోవడం వలన మాదిగ, మాదిగ ఉప కులాలు తీవ్రంగా నష్టపోయాయని, మరలా గ్రూపు 1,2,3,4 ఉద్యోగాలు, వివిధ డిపార్ట్‌మెంట్ల ఉద్యోగాలను కూడా మనకు దక్కకుండా రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణను అమలు చేయడానికి నిర్లక్ష్యం ఎందుకని, తోటి పంజాబ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్‌సి వర్గీకరణ అమలు చేస్తుంటే దేశంలో నేనే మొదట అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, మాటలను నమ్మి మోసపోవడం కాదు తను ఆడే కమిషన్ నాటకాలు, మాటలతో మభ్యపెట్టడం కాదు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని అమలుపరచు అని హితవు పలికారు. ఎస్‌సి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేయడమంటే మాజాతుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమేనని ఆలస్యం చేయకుండా తక్షణమే ఎస్‌సి వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ మోసంపై ధర్మ యుద్ధానికి సిద్ధం కావాలని, మన జాతులకు చేస్తున్న మోసాన్ని, ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తూ యుద్ధానికి సిద్ధం చేయాలని అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో ధర్మ యుద్ధ సభలు జరుగుతున్నాయని, తర్వాత రథ యాత్రతో తెలంగాణలో ఉన్న అన్ని నియోజక వర్గాలు, మండలాలను చుట్టుముట్టి డిసెంబర్ 21న ఛలో హైదరాబాద్‌తో ధర్మయుద్ధ మహాప్రదర్శనతో రేవంత్ సర్కార్ తో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పిఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షత వహించగా కందుకూరి సోమన్న, గాదే రమేష్, జానకి రామయ్య చౌదరి, చిప్పలపల్లి సోమశేఖర్, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి మూడు జిల్లాల అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ, సూర్యాపేట, భువనగిరి యాదాద్రి సూర్యాపేట జిల్లాల అధ్యక్షులు యాతాకుల రాజయ్య, నల్ల చంద్రస్వామి, చింత వినయ్ కుమార్, రామకృష్ణ, మామిడి సైదులు, కొమ్ము హరి, కురుపాటి కమలమ్మ, కొమురు స్వామి ఆడపు నాగర్జున , మేడి శంకర్ మడుపు శ్రీనివాస్, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులు, మాదిగ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

మూసాపేట డివిజన్-23

NIT నెం. 20/GHMC/MPT/EE/2024-25, తేదీ: 04.11.2024

**పని పేరు:** ఛాట్ పూజ, **అంచనా విలువ / ఇసివి:** రూ.1.00 లక్షలు, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 05.11.2024న ఉ.10.30గం.ల నుండి 06.11.2024న ఉ.10.40 గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట సర్కిల్ - 23, సెల్: 9849906745. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట డివిజన్ - 23

DIPR R.O. No. : 6186-PP/CL/ADVT/1/2024-25 Date: 04-11-2024


# ‘ఖాకీ’కి గుడ్‌బై.. ఖద్దర్‌కు వెల్‌కమ్!

డిఎస్‌పికి రాజీనామా చేసిన గంగాధర్

ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో, వ్యవస్థలో మార్పు రావాలని కోరుకుంటూ కలలు కనడం కన్న ప్రత్యక్ష ప్రయత్నం మిన్న అని భావించిన డిఎస్‌పి మదనం గంగాధర్ తన పదవీ బాధ్యతలకు రాజీనామా చేశారు. త్వరలో జరిగే నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమెల్సీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు. పోలీసు శాఖలో తనకు అన్యాయం జరిగిందని భావించే ఈ నిర్ణయం తీసుకున్నానని ‘ప్రజాపక్షం’ ప్రతినిధితో గంగాధర్ వాపోయారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన గంగాధర్ 1998లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరిన గంగాధర్ నల్గొండ, సైబరాబాద్, హైదరాబాద్‌లలో విధులు నిర్వహించారు. 2010లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన వరుసగా 12 పోలీసు స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌ఒగా చేసే అవకాశం వచ్చింది. అనంతరం డిఎస్‌పిగా పదోన్నతి పొందిన గంగాధర్ ప్రస్తుతం డిజి కంట్రోల్‌లో పనిచేస్తున్నారు.

**చిరునామా లేని కుటుంబం**

భిక్షాటనే వృత్తిగా చేసుకొని బ్రతుకుతున్న సంచార జీవుల కుటుంబంలో రాజలింగం, గంగమ్మ దంపతులకు ఐదుగురు సంతానంలో గంగాధర్ మొదటివాడు. అతని బాల్య జీవితం అంతా కూడా కూలీ పనులు చేసుకుంటూ రాత్రిపూట విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. అలాగే ఉన్నత విద్యను కొనసాగించే క్రమంలో కుటుంబం మీద భారం పడకుండా ఉండాలని, ఉదయం పూట న్యూస్ పేపర్ బాయ్‌గా పని చేస్తూనే, ఐస్‌క్రీమ్, పెప్సీ ఇతర తినుబండార పదార్థాలాంటివి అమ్మడం, పెప్సీ కూల్‌డ్రింక్స్ ఫ్యాక్టరీలలో పనిచేస్తూ... పండగ పర్వదినాల జాతర్లలో బెలూన్లు, బొమ్మలు లాంటివి అమ్ముతూ కుటుంబ పోషణలో భాగస్వామి అయ్యాడు. సంచార జీవిగులుగా కూడు, గూడు, నీడ లేని, చిరునామా చెప్పలేని స్థితిని అనుభవించిన జీవితం అతనిది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో అన్యాయంగా తనను సస్పెన్షన్ చేశారని ఏకంగా సిఎంకు సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్‌రవీంద్రపై ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇది అతన్ని తీవ్రంగా కలిచివేసింది.

**రాజకీయాల్లో యువతను ప్రోత్సహిచేందుకే : డిఎస్‌పి గంగాధర్**

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, యువ నాయకత్వం ‘యువత’ రాజకీయ ప్రవేశం అనివార్యతను సూచిస్తుంది. కనుక తాను రాజకీయాలలో ఆదర్శవంతమైన న్యాయకత్వాన్ని అందించుటకు ఆ దిశగా యువతను ప్రోత్సహించుటకు ఆసన్నమైందిగా భావిస్తున్నాను. నేనొక పోలీస్ అధికారిగా 26 సంవత్సరాల పాటు కలిగిన అనుభవం, వృత్తి నైపుణ్యం, లోతైన విశ్లేషణతో ప్రజా సమస్యల పరిష్కారం లాంటి గుణాలతో ప్రభుత్వానికి, ప్రజలకు అవసరమైనపుడల్లా ఉపయోగించుటకు కృతనిశ్చయంతో ఉన్నాను. నా విద్యాభ్యాసంలో భాగంగా 1994—1997లో నిజామాబాద్ డిజి కాలేజిలో డిగ్రీ, ఒయులో పిజి అడ్మిషన్ నా జీవితంలో గొప్ప మలుపు అయ్యింది. పోలీస్ వ్యవస్థ చాలా గొప్పగా రూపుదిద్దబడింది. కానీ, దానిని నడుపుతున్న వ్యక్తుల స్వభావం సరిగ్గా లేనప్పుడు అలాంటి వ్యవస్థ కలుషితం అవుతుంది. అందుకు ప్రజలు, ప్రభుత్వం ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలని సూచన. అందుకే వ్యవస్థలో, సమాజంలో మరియు వ్యక్తుల స్వభావంలో మార్పు కోరదలుచుకున్నాను. అందుకు నావతు కృషి ఉండాలని నిశ్చయించుకున్నాను.




గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్

టెండర్ నోటీసు నెం. Engg-10/GHMC/PTC-C-22/2024-25, తేది: 04.11.2024

NIT. No. Engg-10/GHMC/PTC-C-22/2024-25, తేది: 04.11.2024

**పని పేరు:** 1 నం. తాత్కాలిక ఛత్ పూజా చెరువును అందించడం. **అంచనా విలువ / ఇసివి:** రూ.4.80 లక్షలు, **డౌన్‌లోడ్‌కు ప్రారంభ తేది: 04.11.204న సా.4.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం:** 07.11.2024న సా.4.15గం.ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్ నెం.7995007417. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-22లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఎస్‌ఎల్‌పి జోన్: జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 6194-PP/CL/ADVT/1/2024-25, Date: 04-11-2024

దేవాదాయ-ధర్మాదాయ శాఖ

శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము

ఊరకొండపేట గ్రామం, ఊరకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా.

లేఖ నం.: 08/SAST/2024 బహిరంగ వేలము తేది: 02.11.2024

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి మరియు గ్రామస్తులకు తెలియజేయటం ఏమనగా శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రా, ఊరుకొండ మండలం, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణా రాష్ట్రం యొక్క ఈ దిగువ తెలిపిన వివిధ టెండర్స్ బహిరంగవేలము మరియు సీల్ టెండర్స్ ద్వార తేది. 20.11.2024 బుధవారము రోజు మధ్యాహ్నము 12.30 గం. లకు శ్రీయుత సహాయక కమిషనర్, దేవాదాయ ధర్మదాయశాఖ వారి కార్యాలయము, మహబూబునాగర్ నందు నిర్వహించుటకు నిర్ణయించుటమైనది ఈ బహిరంగవేలములో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరు వేలంపాటకు ముందు గా మధ్యాహ్నము 12.30 గం.ల లోపల నిర్ణహించిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయటమైనది. సీల్ టెండర్స్ నిర్ణహించిన డిపాజిట్ తో పాటు ముందుగా మధ్యాహ్నము 12.30 గం.ల లోపల సమర్పించగలరు. ఇతర వివరములకు ఫోన్ 9010901099 సంప్రదించగలరు.

| క్ర.సం. | పద్దుల వివరములు | కాల పరిమితి | డిపాజిట్ |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | 15.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 500000.00 |
| 2 | తలనీలాలు సేకరణ హక్కు | 01.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 200000.00 |
| 3 | పూజాసామాగ్రి అమ్ముకొను హక్కు | 06.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 200000.00 |
| 4 | కొబ్బరిముక్కలు సేకరణ హక్కు | 15.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 50000.00 |
| 5 | కిరాణా సామగ్రి సరఫర | 01.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 10000.00 |
| 6 | దేవస్థాన షాప్స్ (3 years ) | 01.01.2025 నుండి | రూ. 10000.00 |
| 7 | లడ్డు, పులిహోర అమ్ముకొను హక్కు | 15.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 500000.00 |

ఇతర వివరములకు ఫోన్ 9010901099 సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి

DIPR R.O. No. : 6160-PP/CL/ADVT/1/2024-25, Date: 04-11-2024

ఫోకస్

# యువత ఉపాధి

## పెరిగిన సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యం



గతంలో పోలిస్తే ఇప్పుడు సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యం పెరిగిది. ఉద్యోగం లేదా వ్యాపారం.. ఎక్కడైనా ఈ లక్షణాలు అవలచుకోకపోతే కెరీర్‌లో ఎదుగుదల ఉండదు. వ్యక్తిత లక్షణాలు అనే పదాన్ని తరచు వింటునే ఉన్నాం. ఆశావాదం, ఇంగితజ్ఞానం, బాధ్యత, సమయస్ఫూర్తి, హాస్యోక్తులు వంటి అనేకానేక లక్షణాల మేళవింపునే సాఫ్ట్ స్కిల్స్ సమగ్ర రూపంగా పేర్కొంటారు. వీటితోపాటు పనిలో శ్రద్ధ, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతర కృషి, వాక్చాతుర్యం, మర్యాద, రాజీ ధోరణి, కలివిడితనం, బోధించే గుణం కూడా ఉండాలి. పొందిన పట్టాలు... తీసుకున్న శిక్షణ ఉద్యోగాలకు అర్హతను మాత్రమే అందిస్తాయి. సాఫ్ట్ స్కిల్స్ ఆ ఉద్యోగాలు అందేలా చేస్తాయి. సూక్ష్మంగా చెప్పాలంటే సాఫ్ట్ స్కిల్స్ లేకపోతే, ఉద్యోగం సంపాదించడం అసాధ్యం కాకపోయినా, సులభం మాత్రం కాదు. ఈ సాఫ్ట్ స్కిల్స్ అనేవి అక్కడా ఇక్కడా అనే తేడా లేకుండా ఎక్కడైనా, ఎవరికైనా ఉపయోగపడతాయి. సాఫ్ట్‌స్కిల్స్ పాఠ్యాంశాలు పరిశీలిస్తే, వాటిలోని చాలా అంశాలు దైనందిన జీవితంలో ఉపయోగపడేవిగానే ఉంటాయి. ఏదైనా క్యూలో వేచి ఉండడం నుంచి సమయ నిర్వహణ వరకూ అడుగడుగునా ఈ లక్షణాలు అవసరమని స్పష్టమవుతుంది. ముఖాముఖి మాట్లాడే సమయంలోనేకాదు...ఫోన్లో సంభాషిస్తున్నప్పుడు కూడా పదాలను ఆచితూచి వాడాలి. మృధువుగా మాట్లాడాలి. ఏదైనా పత్రికా సమావేశంలో పాల్గొన్నప్పుడు, ఒకొక్కరూ ఒక్కో రకంగా ప్రశ్నిస్తారు. ఎదుటివారి ఓర్పు నశించే రీతిలో ప్రశ్నలు అడగడం పాత్రికేయుల లక్షణం. అపారమైన ఓర్పు ఉంటేనే అలాంటి సందర్భాల నుంచి బయటపడగలుగుతారు. దీర్ఘకాలం ఉపయోగపడే నైపుణ్యాలను పెంపొందించుకొని, వాటిని ప్రదర్శించడానికి సాఫ్ట్ స్కిల్స్ ఉపయోగపడతాయి. నిజమైన నాయకుడు తన జట్టు సహచరులకు అన్ని విధాలా పూర్తి భరోసా ఇస్తాడు. అతని మాట తీరు నుంచి వ్యవహార శైలి వరకూ అన్నీ నాయకుడిగా మంచి మార్కులు సంపాదించుకునేవిగానే ఉంటాయి. సాఫ్ట్ స్కిల్స్‌తోనే ఈ లక్షణాలు అబ్బుతాయన్నది వాస్తవం. అమెరికాలోని స్మిత్ కౌంటీ ఇండస్ట్రీ కౌన్సిల్ ఇటీవల నిర్వహించిన సర్వేలో పలు అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. కేవలం విద్యార్హతలను మాత్రమే ప్రామాణికంగా తీసుకొని ఉద్యోగాలు ఇవ్వడానికి ఉత్పత్తి, వ్యాపార కంపెనీలు, సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేయడం లేదని ఈ సర్వేలో వెల్లడైంది. రొటీన్ ఉద్యోగార్థులను ఉచి భిన్నంగా ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. పని నియామం పట్ల సానుకూలత, మంచి వైఖరి, కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఆసక్తి, అవసరమైన శిక్షణ తీసుకోవడానికి సంసిద్ధత వంటి అంశాలే సాఫ్ట్ స్కిల్స్‌గా చెప్పుకోవచ్చు.ఈ లక్షణాలను సంపాదించుకున్న వారికే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, కేవలం విద్యార్హతలతోనే ఉద్యోగాలు, ప్రమోషన్లు, ఉన్నత స్థానాలు దక్కుతాయనుకుంటే పొరపాటే.

## ఉద్యోగార్థుల్లో యజమానులు కోరుకునే అంశాలు..



నిజాయితీ, భద్రత, నమ్మకం,త్వరితగతిన లెక్కలు చేసే సామర్థ్యం. జాలి, విశ్వసనీయత, టీమ్ నైపుణ్యాలు, నిర్భీతి, రుజువర్తన, సహకారం, సహనం, స్వయం దర్శకం, మంచి వైఖరి, రాయడంలో నైపుణ్యాలు, విశ్వసనీయత, ఆధునిక గణితం, స్వయం పర్యవేక్షణ, ఉత్తమ సూచనలు ఇచ్చే లక్షణం, మత్తు పదార్థాలు వాడకపవడం, గైర్హాజరు కాకుండా నిజాయితీగా పని చేయడం, సమయపాలన, విధి నిర్వహణలో నిబంధనలు పాటించడం, ప్రేరణ నైపుణ్యాలు, ఏదైనా పనికి విలువ కట్టడం, ఏ పనికైనా సిద్ధమనే రీతిలో వ్యవహరించడం, కంప్యూటర్లు లేదా కాలిక్యులేటర్లు వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండడం, విషయ పరిజ్ఞానం, అవగాహన, అభిరుచి, పనికి సంబంధించిన వివరాలను పై అధికారులకు ఎప్పటికప్పుడు ఇవ్వడం, మంచి వ్యక్తిత్వం, సామర్థ్యం, బాధ్యతలు స్వీకరించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం, ఏదైనా ఒక బాధ్యత అప్పగిస్తే దానిని పూర్తి చేసే వరకూ ఉద్యోగాన్ని వీడకపోవడం, వ్యాపారంపై కనీస అవగాహన, ఉత్పత్తి పరిజ్ఞానం, సూచనలను సమర్థంగా అమలు పరిచే గుణం, ఎలాంటి షిఫ్టుల్లోనైనా పని చేయడానికి సంసిద్ధత, పని చేస్తున్న కంపెనీ లేదా సంస్థపై అవగాహన, సహ ఉద్యోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించడం తదితరాలు.

## పోటీ కోసం జీకె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- మంగ కర్త ఏ సంవత్సరంలో సంతకం చేయాలి?
  1215
- ఆహారాన్ని చల్లబరచడానికి మరియు గడ్డకట్టడానికి ఉపయోగించే రసాయన మూలకం ఏది?
  నైట్రోజన్
- పిరమిడ్లు మరియు సింహికకు ప్రసిద్ధి చెందిన దేశం ఏది?
  ఈజిప్ట్
- భూమిపై జీవం యొక్క గతాన్ని అధ్యయనం చేసే సైన్స్ పేరు?
  పాలియోంటాలజీఖగోళ శాస్త్రం
- రక్తంలో ఆక్సిజన్ రవాణాకు కారణమయ్యే హిమోగ్లోబిన్ కారకాలకు ఏ రసాయన మూలకం ఆధారం? ఇనుము
- లీగ్ ఆఫ్ నేషన్స్ ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
  1919
- సౌర వ్యవస్థలోని ఏ గ్రహం అత్యంత వైవిధ్యమైన వాతావరణం మరియు వాతావరణాన్ని కలిగి ఉందా?
  భూమి
- బెర్లిన్ గోడ ఏ సంవత్సరంలో పడిపోయింది?
  1989
- ఆసియా మరియు ఆఫ్రికా మధ్య ఏ సముద్రం ఉందా?
  మధ్యధరా
- మానవ శరీరంలోని ఏ అవయవం ఇన్సులిన్ స్రవించే బాధ్యత వహిస్తుంది?
  కాలేయం
- జున్ను, టమోటో కాకుండా, హవాయి పిజ్జాలో సాధారణంగా ఏ ఇతర టాపింగ్స్ ఉంటాయి?
  పైనాపిల్, హామ్
- ఫాల్చియన్ ఎలాంటి ఆయుధం?
  కత్తి
- 'లెక్సికాన్'కి మరో పదం ఏమిటి?
  నిఘంటువు
- హిమాలయ గసగసాల రంగు ఏది?
  నీలం
- ఫుట్‌బాల్ (సాకర్)లో 'ది డివైన్ పోనీటైల్' అని ఎవరిని పిలుస్తారు?
  రాబర్టో బాగియో
- '1984' నవల ఎవరు రాశారు?
  జార్జ్ ఆర్వెల్
- నోబెల్ బహుమతిని ఎవరు స్థాపించారు?
  ఆల్ఫ్రెడ నోబెల్
- ఫేస్‌బుక్ ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
  2004
- యుఎస్ జెండాపై ఎన్ని నక్షత్రాలు, చారలు ఉన్నాయి?
  50 నక్షత్రాలు, 13 చారలు
- ఒక క్యూబ్‌కి ఎన్ని సరళ అంచులు ఉంటాయి?
  12
- భూమి యొక్క ఏ పొర టెక్టోనిక్ ప్లేట్‌లతో రూపొందించబడింది?
  క్రస్ట్
- ఉష్ణప్రసరణ, ఫ్రంటల్ , రిలీఫ్ అనేవి మూడు ప్రధాన రకాలైన మేఘాలు, వర్షపాతం లేదా గాలులు?
  వర్షపాతం
- షాంపైన్‌ను కనిపెట్టిన పురాణ బెనెడిక్టైన్ సన్యాసి పేరు చెప్పగలరా?
  డోమ్ పెరిగ్నాన్
- అత్యధిక ఆస్కార్ అవార్డులను గెలుచుకున్న నటి ఏది?

## ఉన్నత విద్య కోసం భారీ ఖర్చులు



మనదేశంలో విద్యార్థులు ఉన్నత విద్య కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. మిగతా దేశాలతో పోలిస్తే, మన దేశంలోనే ఉన్నత విద్యావ్యయాలు అధికంగా ఉన్నాయి. విద్యాప్రమాణాల విషయంలో భారత్ ప్రస్తుతం 28శాతం పాయింట్లు మాత్రమే సంపాదించింది. 1970 దశకాలలోకేవలం 10 శాతంగా ఉన్న దక్షిణ కొరియా విద్యా ప్రమాణాలు ఇప్పుడు వంద శాతానికి చేరాయి. ఈ గణాంకాలు సహజంగానే వివిధ దేశాలకు చెందిన విద్యార్థులను కొరియా ఆకర్షిస్తున్నదని స్పష్టం చేస్తున్నాయి. అమెరికా,జర్మనీ, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడా ఇత్యాది దేశాలకు భారత్ నుంచి ఎక్కువ వాతం మంది విద్యార్థులు ఉన్నత చదువుకోసం వెళుతున్నారు. వారిలో చాలా మంది అక్కడే స్థిరపడడాన్ని చూస్తునే ఉన్నాం. దేశానికి అందాల్సిన ప్రతిభాపాటవాలు ఈ విధంగా ఇతర దేశాలకు దక్కుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థి రుణాలు లేవు. ఇప్పుడు చాలా వరకూ ఉన్నత విద్యా కోర్సులకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎడ్యుకేషన్ లోన్స్ ఇస్తున్నాయి. అయితే, చాలా మంది ఈ రుణాలను విదేశాల్లో చదువుల కోసమే తీసుకుంటున్నారన్నది చేదు నిజం. విద్యతోపాటు, ఉద్యోగాలు..శాశ్వత వలసలు పెరుగుతున్నాయి. ఇటీవల ఆర్‌బిఐ విడుదల చేసిన నివేదికను అనుసరించి వివిధ బ్యాంకుల వద్ద విద్యారుణాలు 1,23,066 కోట్లు కాగా, విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 13 మిలియన్లు. వివిధ దేశాల మాదిరి భారత్ విదేశీ విద్యార్థులను ఆకట్టుకోలేకపోతున్నది. దేశంలోని విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లకుండా ప్రయత్నించకపోవడం దారుణం. ఈ పరిస్థితి మేధాశక్తి వలసకు కారణమవుతున్నది. ప్రభుత్వాలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ తీరును మార్చుకొని, దేశీయ విద్యా విధానాన్ని మెరుగుపరచి, ఉన్నత విద్యా కోర్సులను సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

### పివి సింధు



'టీనేజ్ సంచలనం'గా పేరు తెచ్చుకున్న తెలుగు తేజం పివి సింధు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతోమందికి ఆమె రోల్‌మోడల్. ప్రపంచ బాడ్మింటన్‌లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని, గుర్తింపును సంపాదించుకున్న సింధు, బాడ్మింటన్‌లో చైనా, జపాన్, ఇండోనేషియా, మలేసియా ఆధిపత్యానికి గండికొట్టింది. భారత్ కూడా అంతర్జాతీయ వేదికలపై రాణించగలదని నిరూపించింది. 2016 రియో డి జనీరో సమ్మర్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని తృటిలో చేజార్చుకున్నప్పటికీ, ఆమె జరిపిన పోరాటం అందరినీ ఆకట్టుకుంది. ఆమె సాధించిన ఒలింపిక్ మహిళ సింగిల్స్ రజత పతకాన్ని స్వర్ణపతకంగా భావించి సంబరాలు చేసుకున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యాన్ని అందుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఒకసారి స్వర్ణం (2019), రెండు పర్యాయాలు రజతం (2017, 2018),మరో రెండుసార్లు కాంస్య (2013, 2014) పతకాలను అందుకుంది. కామన్వెల్త్ గేమ్స్‌లో ఒక స్వర్ణం, రెండు రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించింది. ఆసియా క్రీడలు, ఆసియా బాడ్మింటన్ చాంపియన్‌షిప్స్, దక్షిణాసియా క్రీడలు, కామన్వెల్త్ యూత్ గేమ్స్, ఆసియా జూనియన్ చాంపియన్‌షిప్స్‌లోనూ పతకాలు అందుకొని, యావత్ భారత దేశం గర్వించేలా అత్యున్నత శిఖరాలు అధిరోహించింది. యువతకు, ప్రత్యేకించి యువతులకు, మరీ ప్రత్యేకంగా క్రీడాకారిణులకు ఆమె స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

### మానుషి చిల్లర్



మిస్‌వరల్ 2017 పోటీలో మానుషి చిల్లార్ విజయం యువతకు స్ఫూర్తినిచ్చింది. ఆమె మే14, 1997న భారతదేశంలోని హర్యానాలో జన్మించింది. ప్రపంచ సుందరి పోటీలో మానుషి చిల్లర్ విజయం ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ను గెలుచుకున్న ఆరవ భారతీయ మహిళగా నిలిచింది. ఆమె ప్రాజెక్ట్ 'శక్తి'పై ఆమె దృష్టి కేంద్రీకరించడం వల్ల సమాజానికి అర్థవంతమైన సహకారంతో గ్లామర్‌ను సమతుల్యం చేసుకునేలా యువతకు స్ఫూర్తినిస్తున్నది. ప్రపంచ సుందరి కావడానికి ఆమె ప్రయాణంలో వివిధ రౌండ్లలో పోటీపడి, ప్రతిభాపాటవ ప్రదర్శించింది. అందంతోపాటు, తెలివితేటలు కూడా ఉంటేనే అంతర్జాతీయ వేదికలపై రాణించడానికి వీలుంటుంది. ఈ రెంటి మేలికలయిక మానుషి చిల్లర్. భారత దేశానికి గర్వకారణమైన ఆలే తాను ఏర్పాటు చేసుకున్న సోషల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎంతో మందికి మార్గదర్శకం చేస్తున్నది. వివిధ సామాజిక అంశాలు, సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నది. పలు సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటూ, సమాజానికి తనవంతు సేవలు అందిస్తున్నది.

## ఐఎఎల్ రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం

### ఐఎఎల్ జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్



ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి:హనుమకొండలో నవంబర్ 30,డిసెంబర్ 1న జరుగనున్న భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలనువిజయవంతం చేయాలని ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ కోరారు. హనుమకొండలో నిర్వహించ తలపెట్టిన ఐఏఎల్ రాష్ట్ర మహా సభలకు విజయవంతం చేసేందుకు సోమవారం సన్నాహక సమావేశం హనుమకొండ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ఐఏఎల్ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ముఖ్య కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయుటకు తగు సూచనలు, అభిప్రాయాలను తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, ఐఏఎల్ ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, విజయ భాస్కర్ రెడ్డి, బీమానాథ్ శ్రీనివాస్, గంజి గణేష్, బిల్లా ప్రభాకర్, మేరుగు సుభాష్, కొత్తపెల్లి చిరంజీవి ఉత్తమ్ కుమార్, సయ్యద్ వల్లి ఉల్లా ఖాద్రి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లను మినహాయింపు



ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ నెల 6 నుండి చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే నుంచి అంగన్వాడీ టీచర్లకు పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని ఏఐటియుసి అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం ఐసిడిఎస్ పిడి కృష్ణవేణి ని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు పూర్తిగా ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించుకోవాలని చెబుతున్నప్పటికీ కిందిస్థాయి అధికారులు మాత్రం కొంతమంది అంగన్వాడీ టీచర్లకు కూడా సర్వేలో పాల్గొనాల్సిందే అని ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఉపయోగించుకోవాల్సి వస్తే అంగన్వాడి టీచర్లు అందరిని ఉపయోగించుకోవాలని, కొంతమందిని సర్వేలో పాల్గొనాలి చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. రిటైర్మెంట్ అయిన అంగన్వాడి ఆయాలకు నేటి కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని తక్షణమే ప్రభుత్వం ప్రకటించిన బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. గతంలో అంగన్వాడిలహక్కులకోసం24రోజులు సమ్మె చేసిన సందర్భంగా నేటి ప్రభుత్వం సమ్మెకాలపు వేతనం చెల్లిస్తామని చెప్పినప్పటికీ నేటికి అమలు కాలేదని అన్నారు.

**నూతన పిడికి అభినందనలు**

జిల్లాకు ఇటీవల్ల నూతనంగా వచ్చిన పిడి కృష్ణవేణికి అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోసత్కరించారు. పిడి మాట్లాడుతూఅంగన్వాడీటీచర్స్‌సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఎఐటియుసి అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడమ సుమతమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతకుమారి,

## అసమానతలు లేని సమాజం కోసం పోరాటం

### భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : అసమానతలు, అణిచివేతలు లేని సమాజం కోసం నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. జనగామ జిల్లా సమాఖ్య కౌన్సిల్ సమావేశం సోమవారం జనగామ పార్టీ కార్యాలయంలో పండుగ నిర్మల అధ్యక్షతన జరిగింది. నేదునూరి జ్యోతి ముఖ్యఅతిధిగా మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామిక విలువలు, దృక్పథంతో పరిపాలన కొనసాగించినప్పుడు మాత్రమే అణివేతలు, అసమానతలు, అత్యాచారాలు, అవమానాలు, పీడిన, వివక్ష దోపిడి లేని సమసమాజం నిర్మాణంఅవుతుందని, అది నేటి పౌర సమాజం బాధ్యతగా గుర్తించాలన్నారు. తరతరాల నుండి ప్రాంతాలు, వ్యక్తుల మధ్య విభేదాలు సృష్టిస్తూ అసమానతలను పెంచిపోషించి ఐక్యతకు విఘాతం కలిగించడం వలన ప్రజాస్వామిక పోరాటాలు, ప్రతిఘటన పోరాటాలు రూపాంతరం చెందడం అనివార్యం అవుతుందన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు ప్రథమ స్థానం కల్పించినప్పుడే మహిళా సాధికారిత సాధ్యం అవుతుందన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలు కొత్తగా ఏర్పడిన మాల్స్‌లో డీమార్ట్‌లో స్పెన్సర్‌లో తక్కువ వేతనాలు ఇస్తూ ఎక్కువ శ్రమ దోపిడి చేస్తున్నారని, ఈ దోపిడి వ్యవస్థపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులు కనీస కార్మిక చట్టాలను సైతం అమలు చేయడం లేదని, సరియైన వేతనాలు, విరామ సమయం కూర్చొవడానికి కనీ సంస్టూల్స్ ఏర్పాటు చేయడం లేదన్నారు. అందుకే అసమానతలు, అణిచివేతలు లేని సమాజం కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సఖి గుగులోతు లీలా, వినోద, విమల, మంజుల, సువర్ణ, ఈరమ్మ, ఆది లక్ష్మి , నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రికవరీపై జాప్యమెందుకు?

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంజిల్లాలో కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) వ్యవహారంలో భారీ అవినీతి చోటు చేసుకుందని తప్పిదాలకు పాల్పడిన రైసు మిల్లు యజమానుల ఆస్తుల రికవరిలో ఎందుకు జాప్యం చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రశ్నించారు. గత మూడేళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సిఎంఆర్ రైస్ విషయంలో కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని కొందరు అధికారులు ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున లంచాలు పుచ్చుకున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయన్నారు. విజిలెన్స్ దాడుల తర్వాత కొణి జర్ల మండలంలోని ఓ రైస్ మిల్లుకు రూ. 81 కోట్లు చెల్లించాలని అధికారులుఆదేశించారని ఆ విషయంలో ఎందుకు గోప్యత ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. కొందరు అధికారులకు ప్రత్యక్ష భాగస్వామ్యం ఉన్నప్పటికీ బదిలీలతో సరి పెట్టారని, మరి కొందరిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. సిఎంఆర్ విషయంలో తప్పిదాలకు పాల్పడిన వారి ఆస్తులను జప్తు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా పలు రైస్ మిల్లుల యజమానులు తమ మిల్లుల సామర్థ్యానికి మించి సిఎంఆర్ రూపంలో ధాన్యాన్ని తీసుకున్నారని ఇంత వరకు తిరిగి ఇవ్వలేదని తెలిపారు. దీనికి సంబంధించి సిపిఐ ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని అవసరమైతే ఎగవేతకు పాల్పడిన రైస్ మిల్లుల వద్ద ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

## తేమశాతం పేరిట రైతులను ఇబ్బంది పెట్టొద్దు

### సిపిఐ జిల్లా కార్యదర్శి సత్యం



ప్రజాపక్షం/మునుగోడుః సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో పత్తి రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, షరతులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు వడ్ల కొనుగోలు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం దోపిడి రహిత సమాజ స్థాపన లక్ష్యంగా పెట్టుబడిదారి వ్యవస్థ నిర్మూలనకు పోరాడేది కమ్యూనిస్టులని, అందుకు ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు దేశాలు ఆవిర్భవించడమే అందుకు ఉదాహరణ అని అన్నారు. సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రైతులకు ఇచ్చిన వాగ్దానాలు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా పత్తి ,వడ్ల కొనుగోలు విషయంలో రైతుల్లో తీవ్ర నిరసన మొదలైందని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చే యాలని రేషన్ కార్డులు పెన్షన్లు హామీని అమలుపరచాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,మండల సహాయ కార్యదర్శి బండమీది యాదయ్య, మందుల పాండు,వనం వెంకన్న, దుబ్బ వెంకన్న, రేవెల్లి అంజయ్య,మాదగోని సత్తమ్మ, ఈదుల కంటి కైలాష్,అశోక్, పులకరం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములు కాపాడాలి



ప్రజాపక్షం/తుర్కపల్లి: మండలంలో దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న అక్రమార్కులను తొలగించి, పేద ప్రజలకు భూములు పంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ తుర్కపల్లి మండలం పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం తుర్కపల్లి మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గుంటుపల్లి సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు తిర్మలపూర్ గ్రామ చౌరస్తాలో సీపీఐ పార్టీ జెండాను జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ ఎగురవేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో పుట్టి డిసెంబర్ 25వ తేదీ నాటికి 100 సంవత్సరాలు అవుతున్నదని, స్వాతంత్రానికి పూర్వం పుట్టి దేశంలో ఉన్నటువంటి కార్మిక, కర్షక, విద్యార్థి యువత, మహిళల, అణగారిన ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ సాధించినటువంటి పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా వంద సంవత్సరాల ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో నిజాం రాచరిక వ్యవస్థ రద్దు కొరకు భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి, 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర సిపిఐకి ఉన్నదని తెలిపారు. తుర్కపల్లి మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుండి కాపాడాలని, అక్రమార్కులను తొలగించి పేద ప్రజలకు పంచాలని, లేనియెడల పేద ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు సీపీఐ పార్టీలో చేరారు.జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, మండల పార్టీ కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, మహిళా సమైక్య నాయకురాలు జిన్న రజిత, కలకుంట సత్యనారాయణ, పకీరా నాయక్, భానోత్ రాజేందర్, బొట్టు భూమయ్య భగవంతు చందపల్లి కాశయ్య, కశరబోయిన పోశయ్య, దాసరి బాలయ్య, ఐలమ్మ, సిలివేరు స్వరూప, వట్టిపల్లి అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పట్టవా?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధిః రాష్ట్రంలో నూతనజాతీయ విద్య విధానం అమలు చేయబోమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయివిడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడుకసిరెడ్డిమణికంఠరెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షత వహించగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా నిర్మాణ బాధ్యులు తాండ్ర సదానందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మణికంఠరెడ్డి, తాండ్ర సదానందం మాట్లాడారు. యువత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవచ్చు అనే భావనతో కాంగ్రెస్ గెలుపు కోసం పని చేసారని, కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గత పాలకుల వలె వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఆఫీస్ బేరర్స్ మాతంగి సాగర్, శివరామకృష్ణ, శ్రీ వర్ధన్,అభిరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక లోకానికి అండ

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః105 సంవత్సరాలుగా కార్మిక లోకానికి ఏఐటియుసి అంగడగా నిలిచిందని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లిలోని ఏఐటియుసి కార్యాలయంలో ఏఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలనుజరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూకార్మికుల పక్షాన యాజమాన్యాలతో కొట్లాడి వారికి సరైన వేతనం అందేలా కృషి చేశామన్నారు.సూర్యాపేట జిల్లాలో ఏఐటియుసిపోరాటాలకు ఆకర్షితులయి 2వ ఏఎన్‌ఎమ్‌లు, కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారన్నారు.జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, మండల అధ్యక్షులు బెజ్జం రమేష్, ఎడవెల్లి వెంకటేశ్వర్లు, అప్పాచారి, తిరపయ్య, శ్రీను,ఏడుకొండలు,వెంకటేశ్వర్లు, సురేష్, రవి, నాగయ్య, రమణమ్మ, ఆనందరావు పాల్గొన్నారు.

# మహాయుతిలో లుకలుకలు

## మహిమ్ బరిలో షిండే సేన

- అక్కడ రాజ్‌థాక్రే కుమారుడికి బిజెపి మద్దతు
- వచ్చేది బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం: రాజ్‌థాక్రే
- ఒకే నియోజకవర్గంలో మూడు 'సేన'ల పోటీ



**ముంబయి :** మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్‌ఎస్) ఛీఫ్ రాజ్ థాక్రే కుమారుడు అమిత్‌థాక్రేకి వ్యతిరేకంగా మాహిమ్ నియోజక వర్గం నుంచి పోటీలో ఉన్న శివసేన అభ్యర్థి దాదా సర్వాంకర్ బరి నుంచి తప్పుకోలేదు.దీంతో అధికార మహాయుతి కూటమిలో భాగ స్వాములుగా ఉన్న షిండే శివసేన, బిజెపిల మధ్య విభేధాలు తలె త్తాయి. సర్వాంకర్‌పై ఎంత ఒత్తిడి తీసుకువచ్చిన ఆయన నామినేషన్ ఉపసంహరించుకోకపోవడంతో కూటమిలో అంతర్గత సమస్యలు తలెత్తాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో రాజ్‌థాక్రే మహాయుతి కూటమికి బేషరతుగా మద్దతు ప్రకటించారు. ఆయన పార్టీ నుంచి ఎవరినీ పోటీ చేయించలేదు. శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ 137 స్థానాలలో పోటీ చేస్తోంది. మాహిమ్ శాసనసభ ఎన్నికల్లో ఆయన కుమారుడు అమిత్ థాక్రే రాజకీయ ఆరంగేట్రం చేస్తున్నారు. మహాయుతిలో ఎంఎన్‌ఎస్ భాగస్వామి కాదు. అయినప్పటికీ వ్యూహాత్మకంగా ముంబాయిలోని 36 స్థానాలలో కేవలం 10 స్థానాలలోనే రాజ్‌థాక్రే పోటీ చేస్తోంది. తద్వారా మహాయుతి కూటమి అభ్యర్థులకు పరోక్ష మద్దతు పలుకు తుంది. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలో రానున్నది బిజెపి ముఖ్య మంత్రి నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వమని, అందులో ఎంఎన్ ఎస్ భాగస్వామిగా ఉంటుందని రాజ్‌థాక్రే ఇటీవల ప్రకటించారు.

దీంతో బిజెపి నేత, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడనవీస్ మాహిమ్ నియోజకవర్గంలో ఎంఎన్‌ఎస్ అభ్యర్థికి బిజెపి మద్దతుని స్తోందని తెలిపారు. అయితే, అక్కడ నుంచి మూడుసార్లు ఎంఎల్ ఏగా గెలిచిన సర్వాంకర్‌కు ఇప్పటికే శివసేన అభ్యర్థిగా ముఖ్య మంత్రి ఏక్‌నాథ్ షిండే ఎ.బి, ఫామ్‌లు ఇచ్చారు. వచ్చేది బిజెపి ముఖ్యమంత్రిగా ఉండే మహాయుతి ప్రభుత్వమని రాజ్‌థాక్రే ప్రకట నపై ఆయన గుర్రుగా ఉన్నారు. దీంతో రాజ్‌థాక్రే కుమారుడు అమిత్ థాక్రేపై శివసేన అభ్యర్థి సర్వాంకర్ నామినేషన్ ఉపసంహరించుకో లేదు. దీంతో ఈ స్థానం నుంచి మూడు సేనలు పోటీలో ఉన్నాయి. ఒకటి ఉద్ధవ్ శివసేన, రెండవది రాజ్‌థాక్రే నవనిర్మాణ్ సేన, మూడ వది షిండే శివసేన. మాహిమ్ నియోజకవర్గంలోనే బాల్‌థాక్రే బంధు గణం పెద్ద సంఖ్యలో ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ఉపసంహరణ: కొల్లాపూర్ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ తరుపున నామినేషన్ వేసిన మధురిమా రాజే ఛత్రపతి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఆ పార్టీ దిగ్భ్రాంతికి గురైంది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బరిలో లేకపోవడంతో మహా వికాస్ ఆఘాడీ కూటమి నుంచి ఎవరు పోటీలో లేనట్లయింది. కొల్లాపూర్ నార్త్ నియోజకవర్గం నుంచి తొలుత మాజీ కార్పొరేటర్ రాజేశ్ లాత్కర్‌కు సీటు ఇచ్చారు. దీనిని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విధ్వంసం చేయడంతో ఆయనను మార్చి , ఛత్రపతి రాజవంశస్తురాలు, కొల్లాపూర్ ఎంపి సాహూ మహరాజ్ కోడలు మధురిమా రాజే ఛత్రపతికి టికెట్ ఇచ్చారు. లాత్కర్ అనుచరులు పెద్ద ఎత్తున ఆమెకు వ్యతిరేకంగా ప్రతికూల ప్రచారం చేయడంతో ఆవేదన చెంది పోటీ నుంచి తప్పుకున్నట్లు భావిస్తున్నారు. అయితే, ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్న రాజేశ్ లాత్కర్‌కు తప్పనిసరి పరిస్థి తుల్లో కాంగ్రెస్ మద్దతునిచ్చే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. కాగా, బొరివలి నియోజకవర్గం నుంచి నామినేషన్ వేసిన మాజీ ఎంపి గోపాల్ శెట్టి పోటీ నుంచి ఉపసంహరించుకోవడంతో బిజెపి ఊపిరి పీల్చుకుంది. ఆయన ముంబాయి నార్త్ లోక్‌సభ స్థానం నుంచి 2014,19లలో 4 లక్షల భారీ మెజారిటీతో గెలుపొందారు. 2024లో టికెట్ తిరస్కరించారు. శాసనసభ ఎన్నికల్లో కూడా టికెట్ దక్కకపోవడంతో శెట్టి రెబెల్‌గా నామినేషన్ వేసారు. చివరకు నాయ కత్వం మాట్లాడడంతో ఆయన పోటీ నుంచి తప్పుకుని బిజెపి టికె ట్‌పై పోటీ చేస్తున్న స్థానికేతరుడు సంజయ్ ఉపాధ్యాయ్‌కు మద్దతు ప్రకటించారు. అలాగే చించ్వాడా సీటులో బిజెపి రెబెల్ అభ్యర్థి నానా కటే పోటీ నుంచి తప్పుకున్నారు. పేత్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ రెబెల్ ముఖ్తార్ షేక్ కూడా తన నామినేషన్‌ను ఉపసంహ రించుకున్నారు.

## వాస్తవ సమస్యల గురించి మాట్లాడండి

### మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సవాల్



న్యూఢిల్లీ: ప్రతిపక్షాల గురించి అబ ద్ధాలు చెప్పే బదులు భవిష్యత్తు ఎన్ని కల సభల్లో సామాన్య ప్రజలు ఎదు ర్కొంటున్న వాస్తవ సమస్యల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడాలని ఎఐసిసి అధ్య క్షుడు మల్లిఖార్జున ఖర్గే సవాలు విసి రారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధా నాలతో భారత ఆర్థిక వ్యవస్థ క్షీణి స్తోందని విమర్శించారు. వాస్తవ సంక్షేమ పథకాలకు బూటకపు వృత్తాంతాలు ప్రత్యామ్నాయం కాబోవని అన్నారు. సామాన్యుల నుంచి చివరి పైసా వరకు లూటీ చేసి మీరు సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని పరిశీలించాలని, చివరకు పండుగ రోజు కూడా భారత ఆర్థిక వ్యవస్థ ఉత్సాహాన్ని కలిగించలేకపో యిందన్నారు. తక్కువ వినియోగం, పెరుగుతున్న అసమానతలు, ద్రవ్యోల్బణం, పడిపోయిన పెట్టు బడులు, వేతన స్థంభన వంటి అంశాలతో ఆర్థిక వ్యవస్థ మందగించిందని సోమవారం తన 'ఎక్స్' ఖాతాలో ఖర్గే పేర్కొన్నారు. పారిశ్రామిక రంగ ప్రముఖులు సైతం అదృశ్యమవుతున్న మధ్య తర గతి గురించి మాట్లాడాల్సి వస్తోందని, మోదీ విధా నాలతో పేద, మధ్యతరగతి వెన్ను విరిచే విధంగా ధరలు పెరిగాయని, మతిలేని పన్ను విధానంతో ఆదా చేసిన సొమ్మంతా ఊడ్చుకుపోతుందన్నారు. ఆహార ద్రవ్యోల్బణం 9.2 శాతానికి చేరుకుందని, కూరగాయల ద్రవ్యోల్బణం ఆగస్టులో 9.2 శాతం నుంచి సెప్టెంబర్‌లో 14 మాసాలలో రికార్డు స్థాయిలో 36 శాతానికి పెరిగిందని, ఎఫ్ఎంసిజి రంగంలో డిమాండ్ 10.1 శాతం నుంచి 2.8 శాతానికి ఏడాది కాలంలో వేగంగా తరిగిపోయిం దని, ఇవన్నీ కూడా ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ నెలవారీ నివేదికలలోనే ఉన్నాయని ఖర్గే వివ రించారు. కుటుంబ పొదుపు 50 ఏళ్ళలో లేనం తగా పడిపోయిందన్నారు. కార్మికుల వాస్తవ వేత నాలు 2014–2023 లో స్థంభించిపోయాయని, ఇంకా 2019–2024 మధ్యలో పడిపోయాయని లేబర్ బ్యూరో రేటు సూచిని ఉటంకించారు. 2014–15 నుంచి 2021–22లో ద్రవ్యోల్బణం ఆధారిత వేతనాలు ఒక్క శాతం లోపే పెరిగా యని, ఇవన్నీ కూడా ఐదు విస్మరించలేని వాస్త వాలు అని ఖర్గే అన్నారు. మోదీ వాస్తవాలను నమ్మబోరని, ఎందుకంటే ఆయన భూటకపు మాటల్లో నేర్పరి అని మండిపడ్డారు.

## ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించే తీర్మానంపై 'రసాభాస'

### పిడిపి ఎమ్మెల్యే వహీద్ పరా ప్రవేశపెట్టిన తీర్మానంపై నిరసనధ్వనులు
### తొలిరోజే సభ్యులు సభానిబంధనలు ఉల్లంఘించడంపై నూతన అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీమ్ అసహనం



**శ్రీనగర్ :** ఆరేళ్ల తర్వాత తిరిగి ప్రారంభమైన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ సమావేశాలలో తీవ్రస్థాయిలో రసాభాస చోటుచేసుకుంది. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పిలుపునిస్తూ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పి.డి.పి) ఎమ్మెల్యే వహీద్ పరా సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపె ట్టారు. దీంతో సభలో పెద్దపెద్ద అరుపులు, రణగొణధ్వనుల అల జడి దృశ్యాలు చోటుచేసుకున్నాయి. గతంలో ఏడుసార్లు శాసనస భ్యుడిగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే అబ్దుల్ రహీమ్ కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌కు తొలి స్పీకర్‌గా ఎన్నుకున్నారు. అనంతరం పుల్వామా ఎమ్మెల్యే వాహీద్ పరా ఒక తీర్మానాన్ని సభలో ప్రవేశ పెట్టారు.'జమ్ముకశ్మీర్ ప్రజల మనోభావాలను మనసులో ఉంచు కుని ఈ సభ జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దును వ్యతిరేకి స్తోంది' అని పరా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ప్రవేశ పెట్టిన మరుక్షణమే సభలో బిజెపి ఎమ్మెల్యేలు, ఎవరైతే వారికి మద్దతుదారులైన 28 మంది సభ్యులు అందరూ ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నిలబడటంతో నిరసనలు వెల్లువెత్తాయి. బిజెపి ఎమ్మెల్యే శ్యాంలాల్ శర్మ సభను ఉద్దేశించి మాట్లాడుతూ శాసన సభ నిబంధనలకు విరుద్ధంగా తీర్మానాన్ని తీసుకువచ్చిన పరాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ అబ్దుల్ రహీమ్ స్పందిస్తూ నిరసన తెలియజేస్తున్న సభ్యులు వారి వారి సీట్లలో కూర్చోవాలంటూ పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ పెడచెవిన పెట్ట డంతో ఆయన మండిపడ్డారు. తీర్మానం తన వద్దకు ఇంకా రాలే దని, అది రాగానే దానిని పరిశీలిస్తానని సర్దిచెప్పారు. అయితే శాంతించని బిజెపి సభ్యులు గొడవను కొనసాగిస్తూ సభా కార్యక లాపాలకు ఆటంకం కలిగించారు. ఈ ఆందోళనల నడుమ ఎన్‌సి ఎమ్మెల్యే షబీర్ కుల్లే వెల్ వద్దకు దూసుకువెళ్లారు. లెఫ్టినెంట్ గవ ర్నర్ సభను ఉద్దేశించి మాట్లాడతారని చెప్పడంతో బిజెపి సభ్యులు శాంతించారు. ముఖ్యమంత్రి ఒమర్‌అబ్దుల్లా మాట్లాడుతూ సభ్యుడు 'తీర్మానాన్ని తయారుచేసి తీసుకువస్తున్నారని మాకు తెలుసు. కానీ ఆయన స్పీకర్ ఎన్నిక తర్వాత అలా చేస్తారని మేము అనుకున్నాం. లెఫ్టినెంట్ గవర్నర్ కొన్ని సూచనలతో ప్రసంగం చేస్తారు. మేం దానిని సరైన పద్ధతిలోనే పరిష్కరిస్తాం ' అని సభకు తెలియజేశారు. తాను రాజకీయ ప్రసంగం చేయదలచుకోలేదని, సభ మొత్తం ఆశిస్తున్న ఆలోచనా దృక్పథంపై మాత్రమే మాట్లాడ తానని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఈ శాసనసభ జమ్ముకశ్మీర్ ప్రజల మనోభావాలను ప్రతిబింబించే విధంగా ఉండాలి. ఆగస్టు 5,2019 నిర్ణయాలను మాత్రం ప్రజలు అంగీకరించరన్నది నిజ మన్నారు. రానున్నరోజుల్లో మీతో (స్పీకర్) సంప్రదించి దీనిపై ఒక ప్రతిపాదన చేస్తామని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. లెఫ్టినెంట్ గవ ర్నర్ ప్రసంగించే సమయం వరకు ఈ సభను వాయిదా వేయాలని ముఖ్యమంత్రి అసెంబ్లీ స్పీకర్‌ను కోరారు. దీంతో మళ్లీ సభలో ఎన్‌సి, పిడిపి, పీపుల్స్ కాన్ఫరెన్స్ (పిసి), అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఎఐపి) సభ్యులు పెద్దయెత్తున అరుపుల దృశ్యాలు చోటుచేసుకు న్నాయి.మొదటి రోజే సభ నియమాలు, సంప్రదాయాలను సభ్యులు ఉల్లంఘించడం మర్యాదకాదని, తాను ఇంకా ఆ తీర్మా నాన్ని అంగీకరించకున్నా సభను ఆటంకపరచడం సరైన పద్ధతి కాదని నూతన స్పీకర్ అబ్దుల్ రహీమ్ అసహనం వ్యక్తం చేశారు. సభను 1130గంటలకు వాయిదా వేయడానికి ముందు వారికి పదే పదే విజ్ఞప్తి చేశారు.

## ఏకపక్షంగా జెపిసి చైర్మన్ కమిటీ నుంచి తప్పకుంటాం

### నేడు స్పీకర్‌కు ఫిర్యాదు చేయనున్న ప్రతిపక్ష ఎంపిలు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన జెపిసి చైర్మన్ జగ దాంబికాపాల్‌పై మంగళవారం నాడు స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేయాలని జెపిసిలో ప్రతిపక్ష ఎంపిలు భావిస్తున్నారు. చైర్మన్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుం టున్నారని, అధ్యయనానికి సరి పడ సమయం ఇవ్వకుండా సమావేశ కార్యకలాపా లను బలవంతంగా ముందుకు తీసుకుపోతున్నారని వారు ఆ రోపిస్తున్నారు. కమిటీ సమావేశాలలో తమను అడ్డుకుంటున్నా ని, కాబట్టి తాము జెపిసి నుంచి బలవంతంగా పక్కకు తప్పుకోవాల్సి వస్తుం దని ఓం బిర్లాకు చేసే ఫిర్యాదు లేఖలో రాసినట్లు సమాచారం. స్పీకర్ ఓం బిర్లాను కలిసి తమ ఇబ్బం దులను వివరించాలని ప్రతిపక్ష ఎంపిలు భావిస్తు న్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు స్పీక ర్‌కు ప్రతిపక్ష ఎంపిలు ఎ.రాజా(డిఎంకె), మహ మ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్ (కాంగ్రెస్), అసద్దు ద్దీన్ ఓవైసీ(ఎంఐఎం), సంజయ్ సింగ్(ఆప్), కల్యాణ్ బెనర్జీ (టిఎంసి) తదితరులు ఉమ్మడిగా లేఖను తయారు చేశారు. జెపిసి సమావేశ తేదీలను బిజెపి సీనియర్ ఎంపి, చైర్మన్ జగదాంబికా పాల్ ఏకపక్షంగా నిర్ణయిస్తున్నారని, ఒకోసారి వరుసగా మూడు రోజులు ఏక ధాటిగా పెడుతున్నారని, ఎవ రిని సాక్షులుగా పిలవాలో కూడా ఆయనే నిర్ణయిస్తున్నా రని లేఖలో పేర్కొన్నారు. అధ్య యనం చేయకుండా చర్చల్లో పాల్గొనడం సాధ్యం కాదని ఎంపిలు తెలిపారు. జెపిసి అనేది మినీ పార్ల మెంట్ లాంటిదని,దీనిని సరైన ప్రక్రియను అవలం భించకుండా ప్రభుత్వం అనుకున్నట్లుగా రూపొం దించిన బిల్లుపై కేవలం అసంతృప్తిని బైటికి పంపే చాంబర్‌లాగా భావించవద్దని అన్నారు. ప్రతిపక్షాల నిరసనల ఫలితంగా జెపిసి సమావేశం పలు మార్లు నిలిచిపోయాయి. ప్రతిపక్షాలు కావాలనే అడ్డుపడు తున్నాయని బిజెపి ఆరోపిస్తుండగా, కమిటీ ఏకప క్షంగా పోతుందని ప్రతిపక్ష సభ్యులు విమర్శిస్తు న్నారు. ఇదిలా ఉండగా, జెపిసి చైర్మన్ జగదాంబికా పాల్ మాత్రం ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వడం లేదని వచ్చిన ఆరోపణలను తిరస్కరించారు. ప్రతి ఒక్కరి అభిప్రాయాలు వింటున్నట్లు తెలిపారు.

## రాహుల్‌పై ఆశలు.. నీరుగారాయ్

- వయనాడ్ రాజకీయాల్లో మార్పే లక్ష్యం • ఈసారి గెలుపు ఎల్‌డిఎఫ్‌దే • పిటిఐ ఇంటర్వ్యూలో సిపిఐ అభ్యర్థి



**వయనాడ్:** సీపీఐ నాయకుడు, ఎల్‌డీఎఫ్ అభ్యర్థి సత్యన్ మొకెరి... వయనాడ్‌లో నిశ్శబ్ద చాలెంజ ర్‌గా ఉన్నారు. కేరళ రాష్ట్రంలలోని వయనాడ్ స్థానానికి జరగబోయే ఉప ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపుపై విశ్వాసం వ్యక్తంచేశారు. నియోజకవ ర్గంలో తమకు అనుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి రెండు సార్లు అవకాశం ఇచ్చి తప్పు చేశామన్న భావన వయనాడ్ ప్రజల్లో ఉన్నదని, ఈసారి మార్పు కోరుకుంటున్నారని, ఎల్‌డీఎఫ్ వైపు మొగ్గు చూపుతున్నారని పీటీఐకిచ్చిన ఇంట ర్వ్యూలో సత్యన్ మొకెరి తెలిపారు. ఎక్కడో దూరంగా కాదు నిత్యం తమ వెంట నిలిచే నాయ కుడిని వయనాడ్ కోరుకుంటోందని నొక్కిచె ప్పారు. వామపక్ష అభ్యర్థిగా వయనాడ్ రాజకీ యాల్లో మార్పు తెచ్చే ఉద్దేశంతో పోటీ చేస్తున్నాన న్నారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా చెప్పే వయనాడ్ నుంచి 2014లో పోటీ చేసి 20వేల ఓట్ల తేడాతో మొకెరి ఓడిపోయారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాపై పోటీకి సిద్ధమయ్యారు. వయనాడ్ ప్రజలు తనకు విజయాన్ని అందిస్తారన్న నమ్మ కంతో 71ఏళ్ల సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకెరి ఉన్నారు. గతంలో నాదాపురం స్థానం నుంచి మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక య్యారు. దశాబ్దాల రాజకీయ అనుభవంతో వయ నాడ్ సమస్యలపైనే తన ప్రచారాన్ని సాగిస్తు న్నారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. వయనాడ్ ప్రజల సమస్యలను విడ నాడి రాజకీయ వారసత్వంపై దృష్టి పెట్టిందని దుయ్యబట్టారు. వయనాడ్ ప్రజలు రాహుల్ గాంధీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు కానీ అవన్నీ నీరుగారిపోవడంతో మార్పు కోసం ఎల్‌డీఎఫ్‌కు ఓటేస్తారని ఆయన దీమాగా చెప్పారు. మొకెరి నిరాడంబర నాయకుడు. ఉత్తేజభరిత ప్రసంగాలు చేయడంలో దిట్ట. రైతులకు సి సేవతో తనకున్న రాజకీయ అనుభవాన్నే నమ్ముకున్నారు. అఖిలభా రత కిసాన్ సభ జాతీయ సంయుక్త కార్యదర్శి మొకెరి వయనాడ్ రాజకీయాలపై కచ్చితత్వంతో మాట్లాడతారు. స్థానిక సమస్యలను ఒక దాని తర్వాత ఒకటిగా ప్రస్తావిస్తారు.

వాయనాడ్ నుంచి రెండు సార్లు పార్లమెంటుకు ఎన్నికైనప్పటి రాహుల్ వారి సమస్యలను తీర్చలే దని మొకెరి విమర్శించారు. 'ఐదేళ్లు ఎంపీగా ఉండి వయనాడ్ కోసం రాహుల్ చేసినదేమిటి? వయనాడ్ సమస్యలను పార్లమెంటులో లేవనె త్తారా? రెండోసారి ఓట్లు అడిగారు. చేసిన తప్పు సరిదిద్దుకుంటారని వయనాడ్ ప్రజలు భావిం చారు. కానీ ఆయన వయనాడ్ నుంచి పారిపో యారు. వయనాడ్ కోసం వేరొక అభ్యర్థిని ప్రక టించి తప్పించుకున్నారు' అని మొకెరి వ్యాఖ్యానిం చారు. రాత్రి వేళల్లో ప్రయాణాలకు సంబంధించి కర్నాటకతో వయనాడ్‌కు ఉన్న సమస్యను కూడా రాహుల్ పరిష్కరించలేకపోయారన్నారు. కర్నాట కలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి... రాహుల్ ఎంపీగా ఉన్నాగానీ ఈ సమస్య పరిష్కారం కాలేదు. ఆయన అనుకుంటే దీనిని సులువుగా పరి ష్కరించివుండేవారని మొకెరి అన్నారు. జులై 30న సంభవించిన విపత్తు క్రమంలో ముండక్కయ్, చూరల్మాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేతనైన సాయం చేసింది కానీ వయనాడ్‌కు పార్లమెంటు ప్రతినిధి కనిపించలేదని వ్యాఖ్యానించారు.. రాహుల్ నేరుగా ప్రధాని వద్ద వయనాడ్ సమస్య లను ప్రస్తావించవచ్చు కానీ ఆయన కనీసం పార్ల మెంటులోనూ వయనాడ్ గళం వినిపించలేద న్నారు. ఇండియా ఐక్య సంఘటన ఏర్పాటు వెనుక రాజకీయ ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. ఫాసిస్టు శక్తులపై సమర్థ పోరునకు పెద్ద కూటమి కావాలని భావించి వామపక్ష పార్టీలు ఆ దిశగా తొలి అడుగులు వేశాయని మొకెరి గుర్తుచేశారు. 'కేరళలో ఫాసిస్టు శక్తులు ఉన్నాయా. అవి ఉన్నది ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో కాబట్టి ఆ ప్రాంతాల నుంచి రాహుల్, ప్రియాంక వంటి నేతలు పోటీ చేయాలే తప్ప వయనాడ్ నుంచి కాదు. ఏదో ఒక చోటు నుంచి పార్లమెంటుకు ఎన్నిక కావాలనుకోవడం తగదు. ఇది ఇండియా ఐక్య సంఘటన రాజకీయ లక్ష్యాల నుంచి తప్పించుకోవడమే అవుతుంది' అని మొకెరి వ్యాఖ్యానించారు. '2014లో 20వేల ఓట్లతో ఓడిపోయాను. వయనాడ్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎరానంద్ మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో ఎల్‌డీఎఫ్‌కే ఓటేశారు. స్థానిక ఎన్నికల్లోనూ ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ఫలి తాల్లో పెద్ద తేడా లేదు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. అక్టోబరు 19 నుంచి ప్రచారం చేస్తున్నా. ఈసారి వయనాడ్ ప్రజలు నాకు ఓటేస్తారు. ఎల్‌డీఎఫ్‌ను గెలిపిస్తారు' అని మొకెరి చెప్పారు. కాంగ్రెస్ ర్యాలీలకు తీసిపో కుండా మొకెరి ర్యాలీలు సాగుతున్నాయి. పార్టీ కార్యకర్తలు, సీనియర్ నేతలతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నారు. మొకెరి స్వయంగా వెళ్లి కంపెనీ ఉద్యోగులు, కార్మికులు, హరిత కర్మ సేనా కార్యకర్తలతో పాటు సామాన్యులను కలుస్తుండటంతో ఆయన ప్రచారం నిశ్శబ్దంగా సాగిపో తోంది. అందుకోసమే ఆయనను నిశ్శబ్ద చాలెంజర్ అంటున్నారు.

## ఢిల్లీ కాలుష్యంపై... వారం రోజుల్లో సమాధానం

### ఢిల్లీ ప్రభుత్వం, పోలీస్ కమిషనర్‌కు 'సుప్రీంకోర్టు' నోటీసులు జారీ
### బాణసంచా కాల్చడంపై నిషేధం ఎందుకు అమలు కాలేదని అసహనం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో దీపావళి పండుగ సందర్భంగా తీవ్రస్థాయిలో కాలుష్యం పెరిగిపోవడం, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉన్నప్పటికీ అమలు కాకపోవడంపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ఈ ఏడాది బాణాసంచాపై నిషేధం అమలు చేస్తూ ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని, ఢిల్లీ నగర పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీచేసింది.జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఆగస్టిన్ జార్జ్ మాసిహ్ ద్విసభ్య ధర్మాసనం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారంటూ వార్తాపత్రికలో వచ్చిన కథనాలను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ప్రస్తావించింది. ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ బాణాసంచాపై నిషేధం అమలు గురించి, ఉల్లంఘనదారుల పట్ల తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించింది. దీనిపై ఒక వారంలోపు నివేదికను దాఖలు చేయాలని కోరింది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ రిపోర్టును కూడా ఈ సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం ప్రస్తావిస్తూ ఢిల్లీలో 2024లో దీపావళి పండుగకు మునుపటి 2022, 2023సంవత్సరాలకంటే అత్యంత వేడిమిగా ఉన్నది అని తెలియజేసింది. హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో తమ స్పందనను వారం రోజుల్లో (నవంబరు 14) నాటికి తెలియజేయాలని బెంచ్ కోరింది. కాగా అక్టోబరులో గడచిన 10రోజుల సమయంలో పొలంలో మంటలు బాగా పెరిగిపోయాయని బెంచ్ తెలియజేసింది. ఢిల్లీలో బాణసంచాలపై నిషేధం అమలులో ఉన్నా వాటిని ఉల్లంఘించిన వారిపై కొన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ద్విసభ్య ధర్మాసనం గట్టిగా నొక్కిచెప్పింది.

## 'మహా' డిజిపిపై ఇసి బదిలీ వేటు

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘ (ఇసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్ర డిజిపి రష్మి శుక్లాపై ఇసి బదిలీ వేటు వేసింది. గత ప్రభుత్వ హయాంలో విపక్ష నేతల ఫోన్లు టాప్ చేశారంటూ ఆమెపై ప్రతిపక్షాలు ఇసికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం తాజా చర్యలు తీసుకుంది. విపక్షాల పట్ల డిజిపి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)లో కీలక భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇసికి వరుస ఫిర్యాదులు చేసింది. అక్రమ ఫోన్ టాపింగ్‌కు ఆమె పాల్పడ్డారంటూ గత నెలలో ఫిర్యాదు చేసింది. రాష్ట్ర పోలీస్ చీఫ్ బాధ్యతల నుంచి రేష్మి శుక్లాను తొలగించాలని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 24, అక్టోబర్ 4న కూడా ఇదే విషయమై లేఖలు రాసినట్టు అందులో తెలిపారు. పుణె పోలీసు అధికారిగా రేష్మి ఉన్నప్పుడు విపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశారని కూడా పటోలే ఆరోపించారు. విపక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించాలని సిపిలు, ఎస్‌పిలకు ఆమె ఆదేశిచ్చినట్టు కూడా తెలుస్తోందని రాజీవ్ కుమార్‌కు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో డిజిపిని తొలగిస్తూ ఇసి ఆదేశాలు జారీ చేసింది. ఆమె తదుపరి అర్హత కలిసిన ముగ్గురు ఐపిఎస్ అధికారుల పేర్లను పంపించాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీని ఇసి ఆదేశించారు. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 20న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో డిజిపిపై బదిలీ వేటు పడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 14 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు తేదీ మార్పు

**న్యూఢిల్లీ :** మూడు రాష్ట్రాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికల తేదీని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) మార్చింది. ఉత్తరప్ర దేశ్‌లోని 9 స్థానాలకు, పంజాబ్‌లో మూడు, కేరళలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీన ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈనెల 20వ తేదీకి మారుస్తూ ఇసిఐ ఒక ప్రకటనను విడుదల చేసింది. నవంబర్ 13వ తేదీన పలు సామాజిక, సాంస్కృతిక, మతపర మైన కార్యక్రమాలు ఉన్నందున ఆరోజు ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని, తేదీని మార్చాలని బిజెపి, కాంగ్రెస్, బిఎస్‌పి, ఆర్‌ఎల్‌డి సహా పలు రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థల ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చినట్టు ఇసిఐ తెలిపింది. వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికల పోలింగ్ తేదీని నవంబర్ 20వ తేదీకి మార్చినట్టు ప్రకటిం చింది. కాగా, కేరళలో పాలక్కాడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల తేదీను రీ షెడ్యూల్ చేయగా, చెలక్కర అసెంబ్లీ, వయనాడ్ లోక్‌స్థా నంలో మాత్రం ముందుగా ప్రకటించిన మేరకు ఈనెల 13వ తేదీనే ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా, వయనాడ్ పార్లమెంట్‌తో పాటు 47 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 13వ తేదీన ఉప ఎన్నికలు నిర్వ హించనున్నట్లు ఇసి షెడ్యూల్‌ను విడుదల చేసింది. నాందేడ్ లోక్‌సభ, కేదార్‌నాథ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఈనెల 20వ తేదీన పోలింగ్ జరగనుంది. నవంబర్ 13 నుంచి 20వ తేదీకి మారిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ పంజాబ్‌లోని దేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దఢ్‌బాహా, బర్నాలా, ఉత్తరప్రదేశ్‌లోని మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, ఖైర్ (ఎస్‌సి), కర్హాల్, సిసమౌ, ఫూల్‌పూర్, కతెహారి, మఝువా ఉన్నాయి.


**డాక్యుమెంట్స్ పోయినవి**

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ (మం), పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 85 భాగము మరియు 96 గల దానిలో 26వ నెంబర్ గల ఓపెన్ ప్లాట్ విస్తీర్ణము 300చ. గజములు గల ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ సేల్ డీడ్ నెంబర్: **15043/1985** ఆఫ్ బుక్ -1 No. 1922 పేజీలు 171 నుండి 178 ఎస్ఆర్ఓ, హైదరాబాద్ (తూర్పు) (1502).

పైన తెలిపిన డాక్యుమెంట్ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో అదనపు నకలు తీయించునపుడు తేదీ: 05-10-2024 నాడు పోయినది. దొరికిన వారు దయచేసి సెల్ నెం. 9441038399కు సమాచారము ఇవ్వగలరు.

ఇట్లు - **నల్లగంటి భద్రయ్య**
మంచి రేవుల, నార్సింగి,
రంగారెడ్డి జిల్లా.

**IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT NIZAMABAD**

**G.W.O.P.No. 14 of 2024**

Between:
**V.Sudha Rani** ...Petitioner
And
**Lakkampally Sanjeevan Rao and other** ...Renpondents

To
To whom so ever it may concern

Take notice that the petitioner presented an application to this court U/s 7 (1) R/W Sec.10 and 29 (a) of the Guardian and Words Act praying the Hon'ble court to accord permission to sell the property ie., **(1)** Open plot bearing Non.100 an per GPLP No.18/1996-97 lies in Sy.Nos. 46/P1, P2 arid P3 of Borgaon (P) village sivar admeasuring 200.00 Sq.Yards situated at Vinayaknagar Colony, Borgaon (P) village, Mogpal Mandal, Dist. Nizamabad, **(2)** Open plots bearing No.154 and 155 an per TLP No. 02/2021/NUDA and C.No. 2565/2021/H being part of land comprised in Sy.Nos. 164/P2/1, 164/P2/2, 164/P1/2 and 164/P1 of Pangra (B) village sivar admeasuring 488.88 Sq.Yards situated at Pangra (13) village of Nizamabad Rural. Mandel, Dist.Nizamabad. **(3)** Open plots bearing Nos.25,26,33 and 34 (total 4) plots as per Technical Layout Pattem No. 116/2014/HRO/H1 being part of land comprised in Sy.Nos.190, 190/P4/ 191/A, 191/AA, 191/U of Borgaon (P) village sivar admeasuring total area 813.98 Sq.Yards situated at Sai Ganganagar, Phase-IV, Block No.4, Borgaon (P) village, Mogpal Mandal, Dist. Nizamabad, **(4)** Open plot bearing No.158 as per TLP No. 02/2021/NUDA and C.No. 2565/2021/H being part of land comprised in Sy.Nos. 164/P2/1, 164/P2/2, 164/P1/2 and 164/P1 of Pangra (B) village sivar admeasuring 244.44 Sq.Yards situated at Pangra (B) village of Nizamahad Rural Mandal, Dist.Nizamabad. The total extent of the land comes 1,747.3 Sq.Yards and its approximate total Value of properties is Rs.47,17,710/-. Out of which the deceased share comes to 527.56 Sq.Yards in which minor share comes to 263.78 Sq.Yards and petitioner share comes to 263.78 Sq.Yards and the value of minor's share comes to Rs.7,12,206/- share of the minor namely **L.SHRESHTA RAO** and that the **20-11-2024** date has been fixed for the hearing of this application or to apply for the desire to oppose the said application applied for permission to sell the property of the minors, you must appear in the court on the said above said date **20-11-2024 at 10.30 A.M** in this court in person or by a pleader and be prepared to adduce any documentary evidence or oral evidence upon which you rely, and that in default of your appearance, the said application may be heard and determined in your absence. Any relation or friend of the said minors may appear and be heard upon the said application and may inspect and obtain a copy of the petition and it shall not be necessary to present any petition for this purpose.

Given under my hand and the seal of this court on this .......day of ..........2024.

// BY ORDER OF THE COURT//
**Sd/- P.ANAND REDDY, Advocate,**
Nizamabad. Cell No.9849160430

इंडियन बैंक Indian Bank ALLAHABAD

**జోనల్ ఆఫీసు- కరీంనగర్.**
రికవరీ డిపార్టుమెంట్, 3-1-860, సివిఆర్ఎస్ రోడ్, సిఎస్ఐ మిషన్ హాస్పిటల్ ఎదురుగా, కరీంనగర్-505 001,
ఇ-మెయిల్: zokarimnagar@indiabank.co.in

**అనుబంధం-4 (రూల్ 8(6)కు నియమాలను చూడండి)**
**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన**

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు (లు)కు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినది, దానిని ఇండియన్ బ్యాంక్, **పోతిరెడ్డిపల్లి × రోడ్** బ్రాంచి, సంగారెడ్డి **(సిబిఎస్ కోడ్ 6475)** యొక్క అధీకృత అధికారిచేత నిర్మాణాత్మక **(లాంఛనప్రాయ)/భౌతిక స్వాధీనంచేసుకోబడినది.** మరియు **రుణగ్రహీత/ తాకట్టుదారు: శ్రీ పడునూరి ఆకాశ్** తండ్రి పి. సత్యనారాయణ, **చిరునామా-1:** 3-5-36, వీరభద్రనగర్, సంగారెడ్డి, తెలంగాణ-502001. **చిరునామా-2:** ఫ్లాట్ నం. జి8&9, శ్రీసాయి కృష్ణ రెసిడెన్సీ, ఓల్డ్ ఎంప్లాయిమెంట్, కల్వకుంట, సంగారెడ్డి, తెలంగాణ-502001 వారి నుండి సెక్యూర్డ్ క్రెడిటర్ ఇండియన్ బ్యాంక్, **పోతిరెడ్డిపల్లి × రోడ్ శాఖ, సంగారెడ్డి (సిబిఎస్ కోడ్ 6475)** కు బకాయిగా **12.06.2024** నాటికి **రూ. 14,82,963/- (రూపాయలు పద్నాలుగు లక్షల ఎనభై రెండు వేల తొమ్మిది వందల అరవై మూడు మాత్రమే)** ల రికవరీచేయుట కొరకు **11.12.2024**న వాటిని "ఎక్కడ ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది" ప్రాతిపదికన విక్రయించబడుతుంది. ఇ-వేలం ద్వారా అమ్మకానికి పెట్టబడు అవసరమైన ఆస్తి యొక్క ప్రత్యేక వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

**ఆస్తి యొక్క వివరాలు**

**పడునూరి ఆకాశ్** కు చెందిన, సంగారెడ్డి టౌన్, మండలం & జిల్లా, తెలంగాణ రాష్ట్రం, రిజిస్ట్రేషన్ సబ్-డిస్ట్రిక్ట్, సంగారెడ్డి రిజిస్ట్రేషన్ జిల్లా యొక్క సిటీ మున్సిపల్ పరిధుల్లో సంగారెడ్డి, కొత్త బస్టాండ్ చుట్టుపక్కల్లో కల్వకుంట, వార్డు నం.5, బ్లాక్ నం.2 పద్దగల పూర్తి ప్లింత్ ఏరియా 1245చ.అ.ల్లో 80చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా మరియు ఉమ్మడి ఏరియా, బాల్కని, లిఫ్టులతో కలిపి 1165చ.అ.ల ప్లింత్ ఏరియాతో 650.00చ.గ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను 29.03చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని ల్యాండ్ భాగంతో "శ్రీ సాయి కృష్ణ రెసిడెన్సీ"గా పేరుగల సర్వే నం.228/1 & 2 లో కూర్చిన ఇ.నం.5-2-15 యొక్క ఒపెన్ స్థలంపై నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్‌లో నం.లు 8&9 (జి+3 అంతస్తులు)గల నివాస ఫ్లాట్ మొత్తం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నం.07, దక్షిణం: మెట్లు, కారిడార్ మరియు లిఫ్టు, తూర్పు: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై.

| | |
|---|---|
| ఆస్తిపై రుణభారాలు | నిల్ |
| రిజర్వు ధర (లక్షల్లో) | 31.46 Lacs |
| ధరావత్తు మొత్తం (లక్షల్లో) | 3.15 Lacs |
| బిడ్ పెంపుదల మొత్తాలు (లక్షల్లో) | 0.10 |
| ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ప్లాట్‌ఫారం https://www.ebkray.in వద్ద ఇ-వేలం తేదీ& సమయం | 11.12.2024 10.00 AM to 5.00 PM |
| ఆస్తి ఐడి నం. | IDIB0504661465280 |

ఆసక్తిగల బిడ్డరుదారులు/ కొనుగోలుదారులను కోరునది ఏమనగా, వారి మొబైల్ నంబరు మరియు ఇమెయిల్ ఐడి వినియోగించి ఆన్‌లైన్ పోర్టల్ **(https://www.ebkray.in (PSB Alliance Pvt. Ltd.)**తో రిజిస్టరుచేసుకోవలెను. తదుపరి, వారి కెవైసి పూర్తియైన తరువాత, ఆసక్తిగల బిడ్డరుదారులు/ కొనుగోలు దారులు ధరావత్తు మొత్తాన్ని **10.12.2024** నాటికి వారి ఇ-వ్యాలెట్‌లోకి బదిలీచేయవలెను. అనగా., పోర్టల్ లో ఇ-వేలం తేదీ& సమయంకు ముందు. ఐకెవైసి రిజిస్ట్రేషన్, మరియు ధరావత్తు బదిలీను వేలంకు ముందు తగినంత ముందుగా తప్పనిసరిగా పూర్తిచేయవలెను.

**రిమార్కులు:** దిగువ వీరికి మంజూరైన ఇతర రుణ ఖాతాల్లో మిగతా బ్యాలెన్స్ మొత్తాలతో సహైన అమ్మకపు ప్రక్రియలను బ్యాంకు చేపడుతుంది.

**ఎ స్క్వేర్ ఎంటర్‌ప్రైజెస్ (ప్రొప్రైటర్: పడునూరి ఆకాశ్)**
1. ఖాతా నం.: 50493460510, ఏకసీస్ టైప్: ఓసిసి-ముద్ర-తరుణ్ మంజూరు తేదీ: 06.07.2019, మంజూరైన మొత్తాలు: 6.00 లక్షలు, 13.06.2024 నాటికి పూర్తి బకాయి: రూ.6,20,313/- &
2. ఖాతా నం. 58000678327, ఏకసీస్ టైప్: ఎంఎస్ఎంఇ టియల్-ముద్ర ఇండ్ జిఇసిఎల్ఎస్19: మంజూరైన తేదీ: 20.06.2020, మంజూరైన మొత్తాలు: 1.20 లక్షలు, 13.06.2024 నాటికి పూర్తి బకాయి: రూ. 12,215/-

**మిస్ పడునూరి లలిత (పడునూరి ఆకాశ్ కూతురు)**
1. ఖాతా నం.: 50468306944, ఏకసీస్ టైప్: ఐబిఎల్-విబి విద్యా-ఐఐఎం-ఎంసిఎల్ఆర్: మంజూరైన తేదీ: 27.11.2018, మంజూరైన మొత్తాలు: 4.93 లక్షలు, 13.06.2024 నాటికి పూర్తి బకాయి: రూ. 6,21,433/-

తేది: 19.10.2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: కరీంనగర్ ఇండియన్ బ్యాంక్

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
మంగళవారం, నవంబరు 05

### కీలకమైన ఎన్నికల్లో ఇ.సి.చర్య

# మహారాష్ట్ర డిజిపి తొలగింపు

మహారాష్ట్ర విధానసభ ఎన్నికలకు నామినేషన్‌ల గడువు సోమవారం ముగిసింది. తిరుగుబాటు అభ్యర్థులను ఒప్పించి, మెప్పించి ఉపసంహరింపజేయటంలో పాలక 'మహాయుతి', ప్రతిపక్ష 'మహా వికాస్ అగాఢి'(ఎంవిఎ) కూటములు చాలా మేరకు సఫలమైనాయి. అదేరోజున ఎన్నికల కమిషన్ రాష్ట్ర డిజిపిని బదిలీచేస్తూ, కొత్త డిజిపి నియామకం నిమిత్తం మూడు పేర్లు మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటలోపు పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కాంగ్రెస్, శివసేన(యుబిటి) ఫిర్యాదుపై ఎన్నికల సంఘం ఈ చర్య తీసుకుంది. పాలక కూటమి పరిపాలన వ్యవహారాల్లో పక్షపాతంతోపాటు ప్రతిపక్షానికి వ్యతిరేకంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్టు అవి ఫిర్యాదు చేశాయి. ప్రస్తుత డిజిపి పోలీసు కమిషనర్‌గా, రాష్ట్ర ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్ కమిషనర్‌గా ఉండగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటాన్ని ప్రతిపక్షాలు ఉదహరించాయి. అధికారులు నిష్పక్షపాతంగా ఉండాలని, ఎన్నికల సమయంలో పక్షపాతరహితంగా కనిపించాలని ఎన్నికలకు సన్నాహకంగా జరిపిన సమీక్షా సమావేశాల్లో ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఇప్పుడు డిజిపిపై చర్య తీసుకున్నా ఎన్‌డిఎ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందనే ప్రతిపక్షం ఆందోళన చెందుతున్నది. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలుపు దానికి అంత కీలకం. పోలీసు వాహనాల ద్వారా బిజెపి తమ అభ్యర్థులకు డబ్బు చేరవేస్తోందని ఎన్‌సిపి నేత శరద్ పవార్ ఆరోపించటం ఈ సందర్భంగా గుర్తు చేసుకోదగింది. బిజెపి నేత, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావీస్ ఆ ఆరోపణను ఖండించినప్పటికీ ఆ ఆరోపణ పూర్తిగా అసత్యంకాబోదు. ఎందుకంటే, ఒక్క మహారాష్ట్ర అనే కాదు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోను పాలక పార్టీలు తమకు విశ్వాసపాత్రులైన అధికారులనే పోలీసు, ముఖ్యమైన పరిపాలనా విభాగాల్లో నియమించుకోవటం బహిరంగ రహస్యమే, వారూ అవినీతి, అక్రమాల్లో, ప్రతిపక్షాలను వేధించటంలో భాగస్వాములవుతున్నారు.

మహారాష్ట్ర గత ఐదేళ్లుగా రాజకీయంగా ఉద్రిక్తంగానే ఉంది. పర్యవసానంగా కొద్దిరోజుల పాటు రాష్ట్రపతిపాలనను, ముగ్గురు ముఖ్యమంత్రులను రాష్ట్రం చూచింది. 288 స్థానాలు కలిగిన రాష్ట్ర శాసనసభలో 2019 ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీకి లేదా కూటమికి మెజారిటీ లభించలేదు. దాంతో 11 రోజులపాటు రాష్ట్రపతిపాలన అమలులో ఉంది. అజిత్‌పవార్ ఎన్‌సిపి సహాయంతో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం 11రోజుల్లో కూలిపోయింది. శివసేన చకచకా పావులు కదిపి కాంగ్రెస్, ఎన్‌సిపిలతో మహావికాస్ అగాడీ ఏర్పాటు చేసి అధికారం చేబట్టింది. అది 2 సంవత్సరాల 214రోజులు అధికారంలో ఉంది. అధికార వియోగం భరించలేని బిజెపి శివసేన (షిండె)ను చీల్చి షిండె నాయకత్వాన మహాయుతి(ఎన్‌డిఎ) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎన్‌సిపిని చీల్చి అజిత్‌పవార్ గ్రూపును చేర్చుకుంది. శివసేన, ఎన్‌సిపి చీలిక భాగాలు అధికారిక పార్టీలుగా గుర్తింపు పొందాయి. ఇప్పుడు ఆ నాలుగు ముక్కలూ ప్రజల తీర్పును కోరుతున్నాయి. కాబట్టి ఈ ఎన్నికల్లో ప్రజలు ఏ కూటమికి అధికారం అప్పగిస్తారనే దానితోపాటు శివసేన(షిండె–ఉద్ధావ్‌థాక్రే), ఎన్‌సిపి (అజిత్ పవార్, శరద్ పవార్)ల్లో ఏవి అసలు –సిసలు, ఏవి తాలు – తప్పానో కూడా నిర్ణయిస్తారు.

మహారాష్ట్ర అత్యంత సంపన్న రాష్ట్రమే గాక, ముంబయి భారతదేశ ద్రవ్యపెట్టుబడి రాజధాని కూడా. రాజకీయ పార్టీల నిధులపై ఇక్కడి ఎన్నికల ఫలితాల ప్రభావం ఉంటుంది. అందువల్ల కేంద్రంలో అధికారంతో, బిజెపికి పుష్కలంగా ఉన్న నిధులతో మహారాష్ట్రను తమ ఖాతాలో వేసుకోవటానికి నరేంద్రమోదీ– అమిత్ షా ద్వయం సకల ప్రయత్నాలూ చేస్తారు. ఓడిపోతారనుకున్న హర్యానాలో బిజెపి అధికారం నిలబెట్టుకోవటంతో బిజెపిలో, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్‌లో మోదీ ప్రభావం పుంజుకుంది. మహారాష్ట్రను గెలుచుకుంటే 75 ఏళ్ల వయోపరిమితి దాటినా ఆయన అధికారాన్ని ప్రశ్నించటానికి ఎవరూ ధైర్యం చేయరు. లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతిని 17 సీట్లకు పరిమితం చేసి 30 సీట్లు గెలుచుకున్న ఎంవిఎ తన ఆధిక్యత నిలుపుకుంటుందా? ఆ ఎన్నికల్లో ఓటింగ్ ప్రకారం ఎన్‌డిఎ 128 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లో మెజారిటీ పొందగా, ఇండియా కూటమికి 151సీట్లలో మెజారిటీ ఓట్లు లభించాయి. అందువల్ల ఆరంభ అడ్వాన్‌టేజ్ ఎంవిఎకే ఉంది. పైచేయి ఎవరిదో ఈనెల 20న ఓటర్లు నిర్ణయిస్తారు. 23న లోకవిదితమవుతుంది.

# రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వే చారిత్రక అవసరం



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు అనేక ప్రాంతీయ పార్టీలు కూడా బిసిలతోపాటు ఒబిసిల కుల గణన అంశాన్ని తమ మేనిఫెస్టోలో చేర్చడంతో బిజెపిపై ఒత్తిడి తీవ్రమైంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి న కాంగ్రెస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లపై అధ్యయనం చేసేటందుకు బిసి కమిషన్ ఏర్పాటు చేసింది. సమగ్ర కుల గణాంకాల సేకరణకు విధి విధానాలను జారీ చేస్తూ జీవో 47 ను విడుదల చేసింది. అయితే దీనిపై బిసి రిజర్వేషన్లు అమలుకు ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది.

భారతదేశం వేలాది కులాలతో కూడి ఉన్నది. కులం అనే ప్రత్యేక సామాజిక శ్రేణి ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. వివిధ జాతులు, వర్ణాలతో కూడిన సమాజాలు ప్రపంచవ్యాప్తంగా మనకు కనిపిస్తాయి. బ్రిటీష్ పాలనలోనే జనగణన అనేది 1881 నుండి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి అనవాయతిగా కొనసాగుతూ వస్తుంది. వివిధ జాతులు వాటి భాష సంస్కృతిక ప్రత్యేకతలు, సామాజిక ఆర్థిక స్థితిగతులు సేకరణ జనగణనములో భాగంగా ఉంటుంది.1947 తర్వాత ప్రతి పదేళ్లకు ఒకేసారి జనగణన(జనాభా లెక్కల) జరుగుతుంది. గత జనగణన 2011లో జరిగింది. ఇప్పటికి ఆ జనగణన లెక్కలే అందుబాటులో ఉన్నాయి. తిరిగి 2021లో కరోనా నేపథ్యంలో జనగణన వాయిదా పడింది. తిరిగి 2025లో జనగణన చేపట్టుటకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. అయితే ఇప్పటి వరకు చేపట్టిన జనగణనలో కులాల (ముఖ్యంగా బిసి, ఒబిసి)వారి వివరాలు చేయుట లేదు. అందుబాటులో లేవు.



కుల జనగణన ఒక సామాజిక అవసరం. కులం ఒక సామాజిక పునాది నిర్మాణం. కులమే సామాజిక, ఆర్థిక స్థితితో పాటు విద్యా, రాజకీయ ఆస్తిత్వాన్ని నిర్దేశిస్తున్నది. ఈ కులం వల్లనే మనుషులందరికీ సమాన హక్కుల ప్రాతిపదికన దక్కాల్సిన అవకాశాలు, వనరుల్లో, సంపదలో వాటా దక్కడం లేదు. నూటికి 90 శాతం ఉన్న ఆయా సమూహాల అభ్యున్నతికి, సమ్మిళిత అభివృద్ధికి విధాన రూపకల్పన చేయడం కష్టమవుతుంది. ఇంత ఆధునిక విలువలతో, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం దూసుకుపోతున్నా కుల వివక్ష మాత్రం కొనసాగుతూనే ఉన్నది.

దీనివల్ల ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు సమగ్రంగా బిసి, ఒబిసిలకు అందుట లేదని, ఉద్యోగాల నియామకాల్లోను, రాజకీయ పదవులలో, స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని గత కొంతకాలంగా దేశవ్యాప్తంగాను, రాష్ట్రాలలో బిసి సంఘాలు ఆందోళనలు చేయుచున్న నేపథ్యంలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేస్తున్నప్పటికి అమలులో వైఫల్యం కనబడుతుంది.

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 1234 షెడ్యూల్ కాస్ట్ ఉప కులాలను, 698 షెడ్యూల్ తెగలను లెక్కించగా లేనిది, 4 వేల పైబడి ఉన్నాయని చెబుతున్న బిసి కులాల జన గణన చేయడం పెద్ద కష్టమేమీ కాదు. రిజర్వేషన్లు పెంపు డిమాండ్ వస్తుందని భయం ఉండటం అసంబద్ధం. అసలు అలాంటి డేటా ఏదీ లేకపోవడం వల్లే ఎవరు పడితే వాళ్లు ఆ డిమాండ్ చేయడం, రాష్ట్రాలు ఇష్టానుసారం చేస్తూ పోవడం, వాటిని కోర్టులు సమగ్రమైన డేటా లేకుండా చేశారని కొట్టివేయడం చూస్తున్నదే. మరాఠాల, జాట్ల, గుజ్జర్ల విషయంలో అదే జరిగింది.

**సామాజిక న్యాయం కొరకు ఏర్పడిన బిసి కమిషన్లు :**

మండల్ కమిటీ సిఫార్సుల ఆధారంగా విద్యావ్యవస్థల్లో, ప్రభుత్వరంగ ఉద్యోగాల్లో ఒబిసిలకు ఇస్తున్న రిజర్వేషన్లు 1931 కులాల జనాభా ఆధారంగానే ఇస్తున్నారనే విషయాన్ని ఇంద్రా సహాని కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాకా ఖాలేల్కర్ కమిషన్, 1990 ల లో మండల కమిషన్ కూడా కుల జనగణనను ప్రధానంగా ప్రస్తావించాయి. నిజానికి దేశంలో ఒబిసిల జనాభా 52% ఉండవచ్చు అని లెక్కను కూడా మండల కమిషన్ 1931 కుల జనగణన ఆధారంగా అంచనాకు వచ్చింది. అప్పుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు పరచడం మొదలుపెట్టారు. నేటికీ దీనిపై కొన్ని శక్తులు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి.

2006 లో సామాజిక న్యాయం పైన సుమిత్రా మహాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ ఒబిసి జనగణన సిఫార్సు చేసింది. 2008 లో ప్లానింగ్ కమిషన్ ఒబిసిల జన గణన అవసరాన్ని నొక్కి చెప్పింది. వీలైతే వెంటనే ఆ పనిని చేపట్టాలని, లేదంటే 2011 సాధారణ జన గణనలో భాగంగా చేయాలని సూచించింది. ఇవ్వాళ కుల జనగణనను తిరస్కరిస్తున్న బిజెపి 2010లో ఈ డిమాండ్ ను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బలంగా ముందుకు పెట్టింది. 2011 జనాభా లెక్కల్లో భాగంగా కులాల వారిగా జనగణనన వివరాలు, సామాజిక ఆర్థిక స్థితిగతుల సర్వే జరిగినప్పటికీ వాటి వివరాలు బయటకు రాలేదు.

సుప్రీంకోర్టు, అనేక రాష్ట్రాలు హైకోర్టులు కూడా కచ్చితమైన ఒబిసిల డేటా లేకుండా రిజర్వేషన్లు కల్పించడం ఏమిటని, ఆయా కులాల జన గణన ఒక చారిత్రక అవసరం అనే విషయాన్ని చెప్పినవి. సరిగ్గా బీహార్ ప్రభుత్వం చేసిన కులగణన లెక్కల సేకరణ అక్టోబర్ 2న బయట ప్రపంచానికి వెల్లడి చేయడంతో ఆ అనివార్యత కేంద్రానికి మరింతగా పెరిగింది. బీహార్ ప్రభుత్వం చేపట్టిన ఈ గణింపు కార్యక్రమం కూడా సాఫీగా జరగకుండా కేంద్రం, సంఘ పరివార్ శక్తులు అనేక అడ్డంకులు కల్పించాయి. అసలు కుల గణన చేసే అధికారం రాష్ట్రాలకు లేదని కోర్టులో వాదించి నిలువరించే ప్రయత్నం చేసిన ఆ శక్తులు ఓడిపోయినవి.

**రాష్ట్రంలో కులగణనకు జిఒ జారీ :**

తెలంగాణలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కులగణన చేపడతామని, ముఖ్యంగా బిసిలకు దామాషా పద్ధతిలో అన్ని రంగాల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చి పది మాసాలు అవుతున్నప్పటికీ,.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో రాష్ట్ర జనాభాలో మెజార్టీ ఉన్న బిసిలకు న్యాయం చేయాలని కోరుతూ బిసి సంఘాలు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి మాసంలో జరిగిన అసెంబ్లీ లోనే బిసిల జన గణన చేపడతామని తీర్మానించింది. దీనికి అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లపై అధ్యయం చేసే బాధ్యతను జీవో 47ను జారీ చేస్తూ గణంకాల సేకరణకు విధివిధానాలు జారీ చేసింది.

**బిసి కమిషన్ ఏర్పాటు:**

రాష్ట్రంలో బిసిల కులగణన కొరకు ఎన్. నిరంజన్ చైర్మన్ గా బిసి కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ వారు రాష్ట్రంలో జిల్లాలలో పర్యటిస్తూ వివిధ వర్గాలనుండి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. బిసిల కులగణన పై ఇప్పటికే మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో చేపట్టిన కులగణనపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులను పంపించి రిపోర్ట్ తెప్పించుకుంది. వీటిపై ఇప్పటికే హైకోర్టులోను, సుప్రీంకోర్టులలోను ఇచ్చిన తీర్పులను కూడా పరిగణనలోకి తీసుకొని రాష్ట్రంలో ప్రతీస్టాత్మకంగా' సమగ్ర కుటుంబ సర్వే' చేపట్టాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. సమగ్ర సర్వేకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాపితంగా సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ తదితర అంశాలను చేర్చి 75 ప్రశ్నలతో సమగ్ర సర్వే చేపట్టుటకు నిర్ణయించింది. ఈ సర్వేలు 100 శాతం కచ్చితత్వంతో సమగ్రంగా ఉండే విధంగా ఫార్మేట్స్‌ను తయారు చేసి ఎనిమరేటర్స్‌కు శిక్షణ ఇచ్చింది. ఈ కార్యక్రమములో నెల రోజులపాటు రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలకు బాధ్యతలు అప్పగించింది.

**సర్వే వివరాలన్నీ గోప్యం :** సర్వేలో సేకరించనున్న ప్రతి కుటుంబ వివరాలు గోప్యంగా ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేపట్టనున్నారు. సమగ్ర కుటుంబ సర్వే కొత్తగా నిర్వహిస్తున్నందున ఇండ్లు, కుటుంబాలు, వ్యక్తుల వివరాలను సేకరించేందుకు 2011లో జనాభా లెక్కలు, రేషన్ కార్డులు, రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, విద్యుత్తు కనెక్షన్ల యజమానుల డేటాలను వివరాలను సేకరిస్తున్నారు. డేటాలో లేని వ్యక్తుల వివరాలను ఆధార్ కార్డుల ఆధారంగా నమోదు చేయనున్నారు. ఈ సరికొత్త విధానంలో చేపట్టబోయే సర్వే సమగ్ర కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదు.. ఇది మెగా హెల్త్ చెకప్ లాంటిది. ప్రభుత్వ ఆదాయాన్ని, సామాజిక న్యాయం ప్రకారం ప్రజలకు పంచడమే కాంగ్రెస్ విధానం'అని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రకటించారు.

**బిసి కులగణనకు డెడికేటెడ్ కమిషన్ :**

రాజ్యాంగంలోని అధికరణ 340, సుప్రీం కోర్టు తీర్పులు రాజకీయాల్లో బిసిలకు రిజర్వేషన్ల కల్పన నిమిత్తం ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని తెలిపాయి. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల నిమిత్తం జనగణనకు ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని అక్టోబర్ 30న ఆదేశించింది. ఈ నెల 6 నుండి సమగ్ర సర్వే చేపడుతున్న నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 'బీసీ డెడికేటెడ్ కమీషన్' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సర్వేను స్వాగతిద్దాం! సామాజిక వర్గాలకు రాజకీయ న్యాయం జరగాలని కోరుకుందాం!

# ఝార్ఖండ్‌లో ఆదివాసీ ఓట్లకోసం బిజెపి మల్లగుల్లాలు

**అమిత్ భెలారి, రాంచీ**

ఝార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీకి నవంబరు 13–20 తేదీలలో రెండు దశల్లో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రెండు జాతీయ స్థాయి ప్రధాన కూటములు 'ఇండియా' బ్లాక్ – ఎన్‌డిఎ మధ్య ప్రత్యక్ష పోరు జరుగుతున్నది. బంగ్లాదేశీయుల చొరబాట్లు, అధికారపార్టీపై అవినీతి ఆరోపణలు, నెలవారీ పథకాల నగదు బదిలీపై ముఖాముఖీ విమర్శ లు ఈ ఎన్నిక్లల్లో ప్రధాన సమస్యలుగా తెరమీదకు వచ్చాయి. ఝార్ఖండ్ రాష్ట్రం బిజెపికి బల




మైన అధికార కేంద్రంగా ఉన్నప్పటికీ దానిపట్టు సడలిపోతున్నది. ఆదివాసీ, గిరిజన ఓటర్లను తిరిగి తన గుప్పెట్లో బంధించేందుకు బిజెపి ఈ ఎన్నికల్లో మల్లగుల్లాలు పడుతున్నది. రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఝార్ఖండ్ అధికార జెఎంఎం (ఝార్ఖండ్ ముక్తిమోర్చా) నాయకత్వంలో ఉన్న భారత జాతీయ ప్రజాస్వా మ్య, సమ్మిళిత కూటమి ''ఇండియా''కు భారతీయజనతాపార్టీ నాయకత్వంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) ఓటర్లను ఆకర్షించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. బరిలోకి దిగిన అన్ని రాజకీయపార్టీలూ తమ తమ అభ్యర్థులను ప్రకటించి నామినేషన్ల ప్రక్రియ పూర్తిచేయడంతో ఎన్నికల ప్రచారం తీవ్రస్థాయిలో ప్రారంభమైంది. సీట్ల పంపిణీలో భాగంగా, ఎన్‌డిఎలో భారతీయ జనతాపార్టీ 68 నియోజకవర్గాలలో పోటీ చేస్తుండగా, అఖిల ఝార్ఖండ్ విద్యార్థి సంఘం (ఎజెఎస్‌యు) పదిస్థానాలలో పోటీ చేస్తున్నది. జనతాదళ్ (యు) రెండు నియోజకవర్గాలలో, లోక్ జనశక్తిపార్టీ (రామ్ విలాస్) అభ్యర్థి ఒక నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. ''ఇండియా'' కూటమిలో జెఎంఎం అత్యధికంగా 41 నియోజకవర్గాలలో అభ్యర్థులను నిలబెట్టింది. కాంగ్రెస్‌పార్టీ 30స్థానా ల్లో పోటీ చేస్తుండగా, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)పార్టీ ఆరు నియోజకవర్గాలలో, భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) నాలుగుచోట పోటీ చేస్తున్నది. మొదటిదశ పోలింగ్ జరిగే 43 నియోజకవర్గాలలో మొత్తం 683 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెండోదశ పోలింగ్ జరిగే నియోజకవర్గాలలో మొత్తం 528మంది పోటీ చేస్తున్నారు.

**పోటీలో ఉన్న ప్రముఖులు**

నవంబరు 13వ తేదీన మొదటిదశ పోలింగ్‌లో పలు ప్రముఖ నియోజకవర్గాలు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి చంపాసోరెన్ మొదటిసారి బిజెపి అభ్యర్థిగా సరైకెలా నియోజకవర్గం నుండి పోటీకి దిగారు. జమ్‌షెడ్‌పూర్ వెస్ట్ నియోజకవర్గంలో జెడి(యు) అభ్యర్థి సార్యూ రాయ్ పోటీలో ఉన్నారు. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘుబార్‌దాస్ కోడలు పూర్ణిమా దాస్ సాహూ పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఐదుసార్లు శాసనసభ్యుడుగా పనిచేసిన సి.పి.సింగ్ ఝార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీ నియోజకవర్గం నుండి ఆరోసారి పోటీ చేస్తున్నారు. అధికార జెఎంఎం రాజ్యసభ సభ్యురాలు మహుయా మాజీ కూడా రాంచీ నుండి ఎన్నికల బరిలోకి దిగారు. ఓటర్లు ఈనెల 13నే వారి భవితవ్యాన్ని నిర్దేశిస్తారు. ఇక ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ (బర్హైత్ నియోజకవర్గం), ఆయన సతీమణి కల్పనా సోరెన్ (గండే నియోజకవర్గం), ముఖ్యమంత్రి సోదరుడు బసంత్ సోరెన్ (దుమ్కా నియోజకవర్గం), బిజెపి ఝార్ఖండ్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ (ధన్వర్), అమర్ కుమార్ బౌరి (చందన్‌కియారి), సీతా సోరెన్ (జమ్తారా), షిబు ఓసరెన్ కోడలు, ఎజెఎస్‌యు అధ్యక్షురాలు సుధేశ్ మహతో (సిల్లీ నియోజకవర్గం) వంటి అభ్యర్థులందరి భవితవ్యం రెండోదశ పోలింగ్‌లో తేలనున్నది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 అసెంబ్లీ నియోజక వర్గాలలో 28 స్థానాలను షెడ్యూల్డు తెగలకు, తొమ్మిది నియోజకవర్గాలను షెడ్యూల్డు కులాలకు కేటాయించారు. జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడిలతో కూడిన కూటమి 47 స్థానాలను ఆనాడు గెలుచుకుంది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 37 స్థానాలు గెలుచుకు న్న బిజెపి బలం 2019 ఎన్నికలలో 25 స్థానాలకు తగ్గిపోయింది.

**ఝార్ఖండ్‌లో ప్రధాన సమస్యలివే**

ఝార్ఖండ్‌రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలున్నాయి. బంగ్లాదేశీయుల చొరబాట్ల సమస్యతోపాటు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు ఉండగా, జెఎంఎం –బిజెపి మధ్య నెలవారీ నగదుబదిలీ పథకాలకు సంబంధించిన వివాదాలు కూడా ఎన్నికల ప్రచారంలో ప్రముఖంగా చోటుచేసుకున్నాయి. బిజెపి తరపున ఝార్ఖండ్ ఎన్నికల నిర్వహణకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు ఈ ఎన్నికలకు కో–ఇన్‌ఛార్జిగా ఉన్న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తరచు ఝార్ఖండ్‌లో పర్యటిస్తూ ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగాలు చేస్తున్నారు.2000 సంవత్సరంలో ఝార్ఖండ్ రాష్ట్రం ఆవిర్భవించినప్పటినుండీ 13 సంవత్సరాలుగా బిజెపికి ఆ రాష్ట్రం ఒక బలమైన అధికారకేంద్రంగా ఉంది. ఇటీవలికాలంలో గిరిజనుల ఓట్లు తిరిగి సంపాదించేందుకు బిజెపి పోరా టం చేస్తున్నది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 28 రిజర్వుడు నియోజకవర్గాలకుగాను రెండుస్థానాలను మాత్రమే బిజెపి గెలుచుకుని అంతకుముందు గెలుచుకున్న తొమ్మిదిస్థానాల ను కోల్పోయింది. 2014లో బిజెపి 11 రిజర్వు డు నియోజకవర్గాలలో విజయం సాధించింది.

**ప్రధానమంత్రి ప్రచార ర్యాలీలు**

సోమవారం నవంబరు నాలుగోతారీకు నుండీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఝార్ఖండ్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలలో ప్రసంగించడం ప్రారంభించారు. ఛైబా సా, గర్హాలలో జరిగిన బహిరంగసభల్లో ఆయన ప్రసంగించారు. కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా కూడా ఆదివారం నవంబరు మూడో తేదీన ధల్‌భూమ్‌గఢ్, సిమరియా, బర్కథలలో జరిగిన సభల్లో ప్రసంగించారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో మొత్తం 2.59 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1.31 కోట్లమంది పురు ష ఓటర్లు ఉండగా, మరో 1.28 కోట్లమంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 11.05 లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో మొదటిసారి తమ ఓటుహక్కు ఉపయోగించుకుంటున్నారు. వీరంతా 18 – 19 మధ్య వయసుగలవారే. మొత్తం ఓటర్లలో 1.14 లక్షలమంది వృద్ధులు ఉన్నారు. వీరంతా 85 ఏళ్ళు పైబడినవారే. మరో 3.64 లక్షలమంది దివ్యాంగులు కూడా ఓటర్ల జాబితాలో ఉన్నారు.

85 ఏళ్ళు పైబడిన వృద్ధు లూ, దివ్యాంగులూ ఇంటినుండే ఓటు వేసేందుకు రాష్ట్రంలో మొదటిసారి ఈ ఎన్నికల్లో సౌకర్యం ప్రారంభమైంది. ఐతే వారం తా 12 డి ఫారాన్ని పూర్తిచేయవలసి ఉంటుంది. రాష్ట్రం లో 20,276 ప్రాంతాలలో మొత్తం 29,562 పోలింగ్ కేంద్రా లు ఏర్పాటు చేశారు. వీటిల్లో 24,520 పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. మరో 5,042 పోలింగ్ కేంద్రాలు పట్ట ప్రాంతాలలో ఉన్నాయి. సగటున 872 మంది ఓటర్లకు ఒక్కొక్క పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

(ది హిందూ సౌజన్యంతో)

### రెండు కూటముల బలాబలాలు

ఈ క్రింది పట్టికలో 2024 నవంబరు ఎన్నికల్లో ఎన్‌డిఎ–'ఇండియా' కూటమి పార్టీలు పోటీ చేసే సీట్లసంఖ్య, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు గెలిచిన సీట్ల సంఖ్య వివరాలు ఉన్నాయి.

| 'ఇండియా' కూటమి | 2024లో పోటీచేసే సీట్లసంఖ్య | 2019లో గెలిచిన సీట్ల సంఖ్య |
|---|---|---|
| ఝార్ఖండ్ ముక్తిమోర్చా | 41 | 30 |
| భారత జాతీయ కాంగ్రెస్ | 30 | 16 |
| రాష్ట్రీయ జనతాదళ్ | 6 | 1 |
| సిపిఐ(మార్క్సిస్టు–లెనినిస్టు)లిబరేషన్ పార్టీ | 4 | 1 |
| **జాతీయ ప్రజాస్వామ్య కూటమి** | | |
| భారతీయ జనతాపార్టీ | 68 | 25 |
| అఖిల ఝార్ఖండ్ విద్యార్థి సంఘం | 10 | 2 |
| జనతాదళ్ (యునైటెడ్) | 2 | – |
| లోక్‌జనశక్తిపార్టీ (రామ్‌విలాస్) | 1 | – |
| **ఇతరులు** | | |
| నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ | టిబిడి | 1 |
| భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) | 15 | 0 |

### ప్రజాపోరాటాల విప్లవ కెరటం...

# 'నల్ల నర్సింహులు'



నవంబర్ 5న కామ్రేడ్ నల్ల నరసింహులు వర్ధంతి

ప్రపంచ ప్రజలకు ఒక గొప్ప వెలుగు బాటను చూపి దేశానికే ఒక మహత్తరమైన విప్లవ సంప్రదాయాన్ని నేర్పింది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. దోపిడీ వర్గాలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం. నైజాం పాలకులు రజాకార్లు అనే సొంత సైన్యాన్ని పెంచి పోషించి, వారిని ప్రజలపైకి ఎగద్రోలారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూనియన్ సేనలు చేత త్రొక్కించిం ది. తేడా వేరైనా ఆచరణలో అడవి మృగాలవలె సంచరించడంలో ఒకరికొకరు తీసిపోలేదు. అత్యాచారాలు, హత్యలు చేస్తూ, అడవి మృగాలవలె ప్రజలను చిత్రహింసలకు గురిచేసేవారు. అలాంటి పరిస్థితుల్లో భూమి కొరకు, భుక్తికొరకు వెట్టిచాకిరి, బానిసత్వం నుండి విముక్తి కొరకు ప్రజలు ఉవ్వెతుగా లేచి పోరాటం చేశారు. ఆ పోరాటం నుంచి వచ్చిన విప్లవ కెరట మే 'నల్ల నరసింహులు'. నల్ల నరసింహులు ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుత జనగామ జిల్లా) లోని దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామం లో అక్టోబర్ 2, 1926వ సంవత్సరంలో చేనేత కుటుంబీకులైన నల్ల లచ్చమ్మ, లచ్చయ్య దంపతులకు జన్మించాడు. ఇదే గ్రామం లో ఏడవ తరగతి వరకు ఉర్దూ మీడియంలో విద్యాభ్యాసం చేశారు. 1944 భువనగిరిలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 11వ ఆంధ్రమహాసభకు ఉత్తేజితుడై తన సహ ధర్మచారిణి వజ్రమ్మ సహా కడివెండి యువకులైన దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమురయ్య, పైండ్ల యాదగిరి, చంపా లింగయ్య, బోళ్ళ రోశయ్య లాంటివారిని సమీకరించి, ఆంధ్ర మహాసభ ఏర్పాటుచేసి విప్లవ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ప్రజలపై అమానవీయ అకృత్యాలకు పాల్పడుతూ కడివెండిలో నివసిస్తూ ప్రజల చేత కొరివి దెయ్యంగా పిలువబడే విస్నూర్ దేశ్‌ముఖ్ తల్లి జానమ్మ దొరసానికి ముచ్చెమటలు పట్టించాడు. 1946–51 మధ్యకాలంలో తెలంగాణ ప్రజా పోరాట చరిత్రలో 'పొద్దుపొడుపును సూచించే వేగుచుక్క'నరసింహులు అని చెప్పవచ్చు.

రెండో ప్రపంచయుద్ధ కాలంలో లెవీధాన్యం పేరుతో పేద రైతుల నుండి జరుగుతున్న బలవంతపు ధాన్య సేకరణను అడ్డుకొని జానమ్మ దొరసాని అక్రమంగా నిల్వ చేసుకున్న 100పుట్ల ధాన్యాన్ని ప్రజలకు పంచి తొలి విజయాన్ని నమోదు చేశాడు. నరసింహులు ఉద్యమ పనుల కోసం హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ప్రతీకారేచ్ఛతో ఉన్న దేశ్‌ముఖ్ గుండా లు, పోలీసులు కడవెండి ఆంధ్ర మహాసభ కార్యకర్తలపై దాడి చేశారు. ఈ సంఘటనను గ్రామ ప్రజలు వీరోచితంగా ప్రతిఘటించారు. ఈ క్రమంలో గుండాల తూటాలకు దొడ్డి కొమురయ్య నేలకొరిగి వీరమరణం చెందాడు. ఈ సంఘటనతో నర్సింహులు పీడకులపై కసితో, పీడితులపై ప్రేమతో అగ్నిశిఖలా ప్రజ్వరిల్లి 60మందితో సాయుధ దళాన్ని ఏర్పాటు చేశాడు. జనగామ పరిసర ప్రాంతాల్లోని సుమారు 200గ్రామాలలో ఉద్యమాన్ని సృష్టించాడు. శత్రువు ఆయుధా గారాలే తమ ఆయుధాలుగా భావించి గెరిల్లా యుద్ధ తంత్రం తో, ప్రజల సహకారంతో జఫర్‌గడ్, కొడకండ్ల, మద్దూరు, నారాయణగిరి, ఆలేరు, పెంబర్తి గ్రామాల్లో సైనిక క్యాంపులపై దాడిచేసి శత్రువులను తుదముట్టించి, ఆయుధాలను చేజిక్కించుకున్నాడు. అప్పు పత్రాల ను కాలబెట్టి వెట్టిచాకిరి నుండి విముక్తి చేశాడు. రైతన్న పోరాటంతో పాటు, చేనేత కార్మికుల రక్షణకోసం పోరాటాలు చేశాడు. స్వపరిపాలన కోసం గ్రామరాజ్య కమిటీలను వేశాడు. సుమారు మూడువేల గ్రామా ల విముక్తికి 10 లక్షల ఎకరాల భూ పంపిణీ చేయుటకు నర్సింహులు చేసిన పోరాటమే కారణంగా చెప్పవచ్చు. తెలంగాణ సాయుధ పోరాటంలో అనేకసార్లు శత్రు దాడులకు లోనైనా, ధైర్యం చెడక అకుంఠిత దీక్షతో పోరాటరంగంలో కొనసాగాడు. నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్న నిర్ణయాలవల్ల, హైదరాబాద్ సంస్థానం, భారత సైన్యాలకు లొంగి పోయిం ది. ఆ క్రమంలోనే హైదరాబాద్ సంస్థానం భారత్ లో విలీనమైంది. నిజాం రాచరిక వ్యవస్థను కూలదోసిన పోరాట యోధులను గౌరవించకుండా, సంప్రదింపులు చేయకుండా సైనిక ప్రభుత్వం తిరిగి గ్రామాలపై, ఉద్యమకారులపై అమానుష దాడులకు పాల్పడింది. ప్రజలు సాధించుకున్న భూములు కాపాడుకోవడానికి పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పోరాట క్షేత్రంలో కొనసాగాడు. నల్గొండ, మానుకోట, నల్లమల ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు అండగా నిలిచాడు. మూడుసార్లు అరెస్టులు, జైలు శిక్షకు లోనయ్యాడు. వివిధ కేసుల్లో 3 ఉరిశిక్షలు ఖరారైనప్పుడు, జైల్లో కూడా జంగ సైరన్ మోగించి తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 1955 సం.లో వడ్లకొండలో అరెస్ట్ అయిన నల్ల నరసింహులుకు అప్పటి ప్రభుత్వం మళ్లీ ఉరిశిక్షను ఖరారు చేసింది. అలాంటి సందర్భంలో జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రజాందోళన లు ప్రారంభమ య్యాయి. ఫలితంగా శిక్ష రద్దు అయి 1959 లో నల్ల నరసింహులు విడుదలయ్యాడు. ఈ సంఘటన నాటి బూర్జువా ప్రభుత్వానికి చెంపపెట్టు అయింది. తన అద్వితీయ దార్శనిక పోరాటాలతో, శత్రు సైన్యంపై తిరగబడి 'తెలంగాణ టైగర్'గా పిలువబడ్డాడు కామ్రేడ్ నల్ల నరసింహులు. నవంబరు 5,1993న మరణించేవరకు కూడా సకల జనులకు మద్దతుగా ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచాడు. అలాంటి పోరాటయోధుల చరిత్రను మరవకుండా, వారి పోరాట స్ఫూర్తిని, నేటితరం యువతకు, పాఠ్యపుస్తకాల్లో పొందుపరిచవలసిన అవసరం ఉంది. ప్రజల కోసం, మన ఉన్నతికోసం పోరాటం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకుందాం.

**కామిడి సతీశ్ రెడ్డి,** జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9848445134

## బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రూ.2.50 కోట్ల నిధులు

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎస్.ఈ.సరిత



ప్రజాపక్షం/నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ. 2.50 కోట్లను మంజూరు చేసి నట్లు తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎస్.ఈ. సరిత పేర్కొ న్నారు. మండల కేంద్రం లోని భౌద్ధక్షేత్రాన్ని సోమవారం సందర్శించారు. బౌద్ధక్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధి కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, సంస్థ ఏఈ నాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారుల డుమ్మా




ప్రజాపక్షం/బోనకల్ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొడుతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమా నికి కొందరు మండల అధికారులు విధిగా గైర్హాజరయ్యారు. ఇలా మండల అధికారులు ప్రజావాణి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు కొందరు అధికారులు ఇదే తంతు కొనసాగి స్తున్నారు. సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజా సమస్యల పరిష్కా రానికి చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి మంత్రి పొంగులేటి భరోసా



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ కాంగ్రెస్ పార్టీని, తనను నమ్ముకుని రాజకీయాల్లో చురుగ్గా పనిచేసిన కార్యకర్త చింతల సుజాత కుటుం బానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుజాత కుటుం బాన్ని సోమవారం ఎంపి రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. సుజాత కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సుజాత పిల్లల భవిష్యత్తుకు తాము అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మూడవ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించి ఓదార్చారు.

## పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/మధిర : ఇటీవల కురుసిన వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చెసిందే తప్పా ఇంతవరకు ఎక్కడ కూడా పత్తిని కొనుగోలు చేయలేదని విమర్శించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగంణంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లా డుతూ అరకొర పండిన పం టలను తక్కువ రేట్లకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్వింటాకు మద్దతు ధర రూ.15వేలు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు, పాపినేని రామనర్సయ్య, శీలం నర్సింహారావు, మురళీ, తేలప్రోలు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



ప్రజాపక్షం/కల్లూరు : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని కొనుగోలు కేంద్రా లలో సన్న రకంకు 500 లు బోనస్‌గా ఇస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. సోమ వారం కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామంలో కొనుగోలు కేంద్ర మును ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు నాణ్య మైన ధాన్యాన్ని తరలించి, అధిక ధరలను పొందాలని రైతులను కోరారు. రైతు క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా చేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ, చెన్నూరు సొసైటీ పరిధిలోని వాచ్యనాయక తండా,చంద్రుపట్ల,చెన్నూరు, లింగాల, ఎరబోయినపల్లి గ్రామాలకు చెందిన రై తులు, సొసైటీ కార్యదర్శి మురళి డైరెక్టర్లు, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. వినతులు, ఫిర్యాదులను సేకరించారు.

## బిసి కమిషన్ బహిరంగ విచారణ వాయిదా

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం తెలంగాణ బిసి కమిషన్ నిర్వహిం చనున్న ఉమ్మడి ఖమ్మంజిల్లా బహిరంగ విచారణ వాయిదాపడినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. తెలంగాణ బిసి కమిషన్ నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల బహిరంగ విచారణ అనివార్య పరిస్థితుల కారణంగాప్రభుత్వం వాయిదా వేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిన తర్వాత అట్టి విషయాన్ని తెలపబడునని ఉమ్మడి జిల్లాలోని ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ తెలిపారు.

## రూ.3 కోట్ల గంజాయి దహనం

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1186 కేజీల రూ.3 కోట్ల గంజాయిని సోమవారం దహనం చేశారు. ఖమ్మం డిప్యూటీ కమీషనర్ జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ గణేష్, భద్రాద్రి కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిఐ రహీమ్ ఉన్నీసా బేగం సమక్ష్యంలో తల్లాడ మండలంలోని ఏడబ్ల్యూఎస్ కన్సటింగ్ లిమిటెడ్ గోపాల్‌పేట వద్ద దహనం చేశారు.

### 30 కేజీల గంజాయి పట్టివేత

అక్రమంగా తరలించుకుపోతున్న గంజాయిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం స్థానిక కూనవరం రోడ్‌లో సాధారణ వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టణ మహిళా ఎస్ఐ విజయలక్ష్మి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమానంగా తారసపడిన స్కోడా కార్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 30 కేజీల గంజాయి లభ్యమైంది. నిషేధిత గంజాయిని ఒడిస్సాలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించుకుపోతున్నట్లు తెలిసింది. వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు వాహనంతో పాటు గంజాయిని స్వాదీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

### నాలుగు దశల్లో ఐదు లక్షలు అందజేత

### అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన








ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం/కూసుమంచి : అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్ర భుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 59వ డివిజన్ దాన వాయిగూడెంలో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి ఎస్‌డి ఆర్ఎఫ్ నిధులు రూ. 25 లక్షలతో చేపట్టనున్న సిసి డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నేడు పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రతి గ్రామంలో అర్హులైన పేద వారికి గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరిట మంజూరు చేస్తామని 400 చదరపు అడుగులతో ఇల్లు నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సహాయాన్ని నాలుగు దశల్లో లబ్దిదారులకు నేరుగా అందించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు గ్రీన్ చానెల్ ద్వారా నిధుల విడుదల ఉంటుందని నవంబరు నెలాఖరు నాటికి అర్హుల జాబితాను తయారు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే నాలుగేళ్ల కాలంలో 20 లక్షల ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, మున్సిపల్ కార్పోరేషన్ ఈఈ కృష్ణలాల్, డిఈ మాధవిదేవి, కార్పొరేటర్ లలితారాణి, ఏఈ కుమార స్వామి, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళిఖకాబద్ధంగా పనులను చేపట్టాలి

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రణాళిక బద్ధంగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇటీవల కాలంలో భారీ వరదలకు కొట్టుకు పోయిన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో తిరుమలాయ పాలెం అధికారులతో మండల ప్రజా ప్రతినిధులతో వివిధ పార్టీ నాయకులతో మండల స్థాయి లో ఉన్న పెండింగ్ పనులను అభివృద్ధి పనులను సమీక్షించారు. గ్రామాల వారిగా అధికారుల సమక్షంలో స్థానిక ప్రజలతో అక్కడి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించేందుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద వారికి ప్రభుత్వ ఫలాలు అందించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువలో ఉండి ఉత్తమ సేవలు అందించాలని ఆయన కోరారు. అతి త్వరలో గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ కమిటీల ద్వారా సొంత ఇంటి స్థలం ఉన్న వారికి అర్హులైన వారిని ఎంపిక చేసి ఇంద్రమ్మ ఇండ్లు కట్టించబోతున్నామని తెలిపారు. డిసెంబర్ చివరిలోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని అన్నారు. ఇటీవల భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లను ఇంచు వదలకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, తహాశీల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధి కారి సీతారామరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి శ్రీని వాస్, తిరుమలాయపాలెం వైద్యాధికారి డాక్టర్ అలివేలు మంగ, సుబ్లేడ్ వైద్యాధికారి డాక్టర్ వసుంధర, ఏపీఎం అలివేలు మంగ, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివ రామకృష్ణ, రామ సహాయం నరేష్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, గంద్ర గోపాలరావు, మాజీ ఎంపీపీ బోడ మంగీలా ల్ నాయక్, కొప్పుల అశోక్, మిర్యాల విక్రమ్ రెడ్డి, అన్నం వెంకటరెడ్డి, బుద్ధ కనకయ్య, కటుకూరి శ్రీనివాస్ రెడ్డి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### రేషన్‌కార్డు లేకున్నా ఇందిరమ్మ ఇండ్లు

రేషన్ కార్డు లేకపోయినా మొదటి విడతలో పేదోళ్లు, బహు పేదోళ్లు ఇలా కేటగిరిల వారీగా పరిశీలించి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. రెండో విడత నుంచి రేషన్ కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు పొందేందుకు అర్హులవుతారని స్పష్టం చేశారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుమలాయపాలెం మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలతో మంత్రి పొంగులేటి సోమవారం సమావేశమైయ్యారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై సంబంధిత అధికారులు, నాయకులతో సమీక్షించారు గ్రామ కార్యదర్శులపై ఎంపిడిఒల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచిం చారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై నిర్ధాక్ష ణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులకు ఎంతమందికి ఇవ్వడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పొర పాటున ఒక అనర్హుడికి ఇచ్చినా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాబోవు ఏడాదిలోపు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్య తీరుతుందని.. అత్యవసరమైనవి తన దృష్టికి తెస్తే తక్షణమే నిర్మాణం చేపట్టేలా చూస్తానని పేర్కొన్నారు.

## రైతుకు తప్పని ఇక్కట్లు

### మార్కెటింగ్ లేక అవస్థలు
### మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు
### పత్తి కొనుగోళ్లలో సిసిఐ విఫలం



ప్రజాపక్షం/ఖమ్మం : పంట పండించడం ఒక ఎత్తయితే దానిని విక్రయించడం మరో ఎత్తుగా మారింది. పం డించడానికి నానా కష్టాలు పడినట్లే వ్యవసాయోత్పత్తులు విక్రయించడానికి అదే పరిస్థితి ఎదురవుతుండడంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. పాలకుల మాటలు ఆచరణ రూపం తీసుకోవడం లేదు. ధాన్యం కొను గోలుకు సంబంధించి కనీస మద్దతు ధర మొదటి రకానికి క్వింటా రూ.2320, రెండవ రకానికి రూ. 2300గా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం కొనుగోళ్లపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని చెపుతున్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఆశించిన రీతిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గోనె సంచుల కొరత తీవ్రంగా ఉందని ధాన్యం ఎగుమతికి ఇది ప్రధాన ఆటంకంగా మారిందని తెలుస్తుంది. ధాన్యం తరలింపులోను తీవ్ర జాప్యం జరుగుతుంది. గతంలో సిఎంఆర్ విషయంలో జరిగిన అవినీతి, తప్పిదాలు మరో సారి జరగకూడదన్న ఆలో చనలో అధికార యంత్రాంగం ఉండడంతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని తీసుకునే విషయంలో కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. అందుకే ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుందని మొత్తంగా కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి రైతులను ఇబ్బందిపెట్టేవిధంగా ఉందని ఆరోపణలు వినవస్తున్నాయి. సిసిఐ వ్యవహారం గమనించి ప్రైవేటు వ్యాపారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. రైతుల వద్ద నుంచి కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరక్వింటా రూ.7521, రెండవ రకానికి క్వింటా రూ. 7121 చెల్లించాల్సి ఉండగా ప్రైవేటు వ్యాపారులు మాత్రం నాలుగు వేల నుంచి ఐదువేలకు మించి క్వింటా పత్తిని కొనుగోలు చేయడం లేదని రైతులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయో త్పత్తుల కొనుగోళ్లు రైతులకు ఇబ్బందులు జరగని విధంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతుంది. ఇదిలా ఉండగా వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, గిట్టుబాటు ధర ఇతర వ్యవహారాలకు సంబంధించి రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రత్యేక ప్రాధాన్యం



కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నేలకొండపల్లి మండలం మంద్రాజుపల్లి గ్రామానికి చెందిన కొమ్మరాజు ప్రేమలత తాను మానసిక వికలాంగురాలినని తల్లిదండ్రులు చనిపోయారని డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వైరా మండలం మాటూరు పేటకు చెందిన పానెం స్పందన తాను బిటెక్ చేసినట్లు సత్తుపల్లి మైనార్టీ కళాశాల, హాస్టల్ నందు అవుట్‌సోర్సింగ్ జాబ్స్ ఉన్నాయని నోటిఫికేషన్ వచ్చిందని అందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన వెంకటసత్యనారాయణ ఎన్‌హెచ్ 365 విస్తరణలో తనకు చెందిన సర్వే నెం. 571లో గల ఇంటిని కోల్పోయినట్లు సగం మాత్రమే నష్టపరిహారం ఇచ్చారని మిగిలినది కూడా ఇప్పించాలని దరఖాస్తు చేశారు. తల్లాడకు చెందిన ఎస్. రమ్యశ్రీ తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. కూసుమంచి, కల్లూరు మండలం తదితర దరఖాస్తులను పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వ హించారు.వచ్చే శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగినులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం, అందరు ఉద్యోగులకు ఎథిక్స్‌పై అవగాహన కల్పించి ప్రజలతో అధికారులు, సిబ్బంది ప్రవర్తనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, డిఆర్‌డివో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వంచించారు...న్యాయం చేయండి

### వైద్యం వికటించడంతో లక్షల ఖర్చు

### బాధితులపైనే పోలీస్ కేసు



ప్రజాపక్షం/ ఖమ్మం : వైద్యం పేరుతో వంచించారని వైద్యం వికటించడంతో తాము తీవ్రంగా నష్టపోయామని తమకు న్యాయం చేయాలని ఓ కుటుంబం వేడుకుంటుంది. ఇదేమని ప్రశ్నించిన తమపైనే పోలీస్ కేసు నమోదు చేశారని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి చెందిన బాల నాగన్న భార్య నాగమణి గత నెల ఎనిమిదిన కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థల కారణంగా పురుగుల మందుతాగింది. ఆమెను ఖమ్మం తరలించగా స్థానిక ఆర్ఎంపి సాయంతో వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. సిఎంఆర్ఎఫ్ వర్తిస్తుందని నాగమణిని ఆసుపత్రిలో చేర్చుకున్నారు. మూడు రోజుల పాటు వైద్యం అందించగా బాధితులు రూ.2.50లక్షలు చెల్లిం చారు. తీరా 12వ తేదీన పరిస్థితి విషమించిందని తాము ఏమి చేయలేమని హైదరాబాద్ తీసుకెళ్లమని ఆసుపత్రి యాజమాన్యం తెలపడంతో వైద్యం వికటించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. అటుపక్క ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో ఆందోళన విరమించి స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నాగమణిని హైదరాబాద్ తరలించారు. వైద్యం వికటించిన కారణంగానే నాగమణి ఆరోగ్య పరిస్థితి విషమించిందని రూ. 6.50 లక్షలు ఖర్చు అయ్యాయని తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం వేడుకుంటుంది. ఈ విషయమై ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి మొరపెట్టుకుంటామంటూ బాధితులు తెలిపారు.

**బాధితులపైనే కేసు నమోదు :** ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారని యాజమాన్య ఫిర్యాదు మేరకు స్థానిక టూటౌన్ పోలీసులు గత నెల 12వ తేదీన కేసు నమోదు చేశారు. 26వ తేదీన టూటౌన్ పోలీసులు ఫోన్ చేసి మీపై కేసు నమోదైందని ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ పిలవడంతో బాధితులు లబోదిబోమన్నారు. ఆందోళన సమయంలోనే ఆసుపత్రి యాజమాన్యం పోలీసులు మా చేతుల్లో ఉన్నారు మీరు ఆందో ళన విరమించకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారని అనుకున్నట్లుగానే పోలీసులు ఫోన్ చేయడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తాము ఇచ్చిన ఫిర్యాదు ఏమైందని ప్రశ్నించడంతో ఎట్టకేలకు ఆసుపత్రి యజమానిగా ఉన్న లక్ష్మణ్‌రావుతో పాటు డాక్టర్ ప్రమోద్, ఆర్ఎంపిపైన పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఏనుగు దాడిలో జవాన్ మృతి



ప్రజాపక్షం/భద్రాచలం : ఇండియన్ ఆర్మీలో జ వాన్‌గా విధులు నిర్వహిస్తున్న భద్రాచలంకు చెందిన కొంగా సాయి చంద్రరావు అస్సాం రాష్ట్రం లో ఏనుగు దాడిలో మృతి చెందా డు. వివరాల ప్రకారం పట్టణానికి చెందిన జవాన్ గద పదేళ్లుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా ప్రస్తుతం అస్సాం రాష్ట్రంలో ఆదివారం మధ్యాహ్నం నాన్‌గావ్ టిఎస్టేట్ రెండవ ఆర్మీ కంటోన్మెంట్ నుండి ఆయన తన తోటి సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలోని ఆంరీ బారీలో నడుస్తున్నాడు. ఒక్కసారిగా వీరిపైకి ఏనుగుల గుంపుదూసుకుని వచ్చిదాడికి ప్రయత్నించాయి. ఈ క్రమంలో వాటి భారి నుండి తప్పించుకునేందుకు అంతా పరుగు లు తీశారు. ఈ క్రమంలో జవాన్ చంద్రరావు పరుగెత్తుతూఅదుపుతప్పి క్రిందపడిపోయా డు. దీంతో ఆయన వద్దకు చేరుకున్న ఏనుగుబలంగా కాళ్లతో తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని భద్రాచలంలో ఉండే తన కుటుంబ సభ్యులకు ఆర్మీఅధికారులు సమాచారం ఇచ్చా రు.దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని సోమవారం రాత్రికి భద్రాచలంలోని ఆయన స్వగృహానికి ఆర్మీ అధికారులు చేర్చనున్నారు.పట్టణానికి చెందిన సాయి చంద్రరావు చిన్ననాటి నుండి క్రమశిక్షణ గల యువకునికి పేరు తెచ్చుకున్నాడు.

## బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు మరమ్మతులు చేపట్టరా?

### రైతులు, పలు రాజకీయ పార్టీ నాయకులు నిరసన




ప్రజాపక్షం/బోనకల్ : బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు మరమ్మతులు తక్షణమే చేపట్టాలని రైతులు, పలు రాజకీయ పార్టీ నాయకులు ఎన్ఎస్‌పి కార్యాలయం వద్ద నిరసన కార్యాక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానీమియా, సిపిఎం గ్రామ నాయకులు దూబ శ్రీనివాసరావు, టిఆర్ఎస్ గ్రామ నాయకులు దొప్ప ప్రసాద్‌లు మాట్లాడుతూ.. ముష్టికుంట్ల సమీపంలోని బ్రాంచ్ కెనాల్‌పై ఉన్న డ్రాప్‌ను మూడవ లైను పనుల సౌకర్యార్థం రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు రైతులను, ఎన్ఎస్పీ అధికారులను సంప్రదించకుండా ఇష్టారాజ్యంగా కూలగొట్టారని ఆరో పిం చారు. ఇప్పటికే ముష్టికుంట్ల, నాగులవంచ, రామాపురం గ్రామాల వ్యవసాయ భూములలో మొక్కజోన్న సాగు కు రైతులు సన్నద్ధమయ్యారన్నారు. కెనాల్ డ్రాప్ ద్వారా 800 ఎకరాల భూమి సాగు ఆధారపడి ఉందని, నీరు అందకపోతే 500 మంది రైతులు నష్టాల పాలవుతారన్నారు.సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనియెడల రైతు సంఘాలు, రాజకీయ పార్టీలతో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి పోరాటాలుచేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, కాంగ్రెస్ మండల నాయకులు షేక్ ముస్తాఫా, సిపిఎం నాయకులు షేక్ ఖాసీం, కాంగ్రెస్ యూత్ నాయకులు షేక్ చాంద్‌పాషా, రైతులు బంధం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## సారూ..ఇదేం తీరు?

### దొంగలను వదిలిన పోలీసులు
### తప్పించిన అధికారి ఎవరు
### బాధితులకు స్టేషన్‌లో అవమానం





ప్రజాపక్షం/ఖమ్మం : కొందరి పోలీసుల తీరు ఆశ్చర్యపరుస్తుంది. బాధితులే పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా నేరస్తులను చూసినట్లుగా చూసి అవమానించడం అలవాటుగా మారింది. బాధితులకు బాసటగా నిలిచి న్యాయం చేయాల్సిన వారే ఈవిధంగా వ్యవహరించడం మొత్తం పోలీస్ వ్యవస్థకు చెడ్డ పేరు తెచ్చిపెడుతుంది. ఖమ్మం నగరం మమత రోడ్డు సమీపంలోని ఎస్‌బిఐటి వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం నుంచి తరచూ విలువైన వస్తువులను దొంగిలిస్తున్నారు. దీనిపై ఆగస్టు 29న ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కనీస విచారణ కూడా చేపట్టకపోవడంతో భవన నిర్మాణదారులు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకుని వారే కాపలా కాసుకుంటూ వస్తువులను కాపా డుకుంటున్నారు. అంతకు ముందు పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు, విలువైన సామాగ్రిని దొంగిలించారు. ఈ నేపథ్యంలో గత నెల 31న మరోమారు చోరీకి వచ్చిన దొంగలను నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించిన పనివారు, వాచ్‌మెన్ కలిసి పట్టుకుని బంధించి ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై ఎం.రామకృష్ణ అనే వ్యక్తి స్వయంగా ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత ఎన్ని సార్లు సిఐని కలిసేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కనీసం బాధితుని మొర అలకించేందుకు కూడా ఒక నిమిషం సమయం కేటాయించలేదని బాధితుడు వాపోయాడు. పైగా బాధితున్నే నేరస్తుడిగా అవమానించడంతో స్టేషన్ నుంచి బయటకు వచ్చాడు. ఇంతలో ఓ ఎఎస్ఐ జోక్యం చేసుకుని ఓ మీరు పట్టుకొచ్చింది ఈ దొంగనా మాకు తెలుసు. ఇతను ద్విచక్ర వాహనాలను కూడా దొంగిలించాడంటూ మొత్తం దొంగతనం నుంచి ఆ వ్యక్తిని తప్పించేందుకు ప్రయత్నించడం అక్కడి వారిని ఆశ్చర్యచకితులను చేసింది. ఒక స్కూటిని దొంగిలించి మీ ఇంటి వద్దకు వచ్చాడని ఆయన చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. స్కూటి దొంగతనంతో పాటు నిర్మాణంలో ఉన్న ఇంటి నుంచి వస్తువులను దొంగించేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులకు అప్పగించిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. హవేలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది వ్యవహరించిన తీరుపై బాధితులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ మొత్తం ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఫ్రెండ్లీ పోలీస్ అంటే బాధితులను అవమానించడమా అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దొంగను తప్పించడానికి ప్రయత్నించడమే కాకుండా ఈ దొంగ మాకు తెలుసంటూ బహిరంగంగా వ్యాఖ్యానించిన ఏఎస్ఐ పైన విచారణ జరపాలని బాధితులు కోరుతున్నారు. ఒకవేళ దొంగపై చర్యలు తీసుకుంటే తమను ఎందుకు సంప్రదించలేదని, తమ ఫిర్యాదును ఎందుకు తిరస్కరించారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మా వద్ద నుంచి ఫిర్యాదు తీసుకుని దానిని మార్చి రాయాలంటూ ఎందుకు ఒత్తిడి తెచ్చారని దీనిపై ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని బాధితులు తెలిపారు. ఈ విషయమై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ సిఐకి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్పందించ లేదని తెలిపారు.

# ప్రజాసమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్

## జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తుల్ని పరిష్కరించడంతో వివిధ శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రతివారం వచ్చే వినతులను ఎప్పటికప్పుడు ప్రాధాన్యత క్రమంలో సత్వర పరిష్కారం చూపాలన్నారు. తమ సమస్యలపై పైన ఎవరిని సంప్రదించాలి, ఏ చట్టం ప్రకారం తమకు న్యాయం జరుగుతుందో తెలియని ప్రజలకు ప్రతి నెల చివరి వారం జరిగే సీవిల్ రైట్స్ డే కార్యక్రమంలో వివిధ చట్టాలపై అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి మాట్లాడుతూ అన్ని మండల తహసీల్దార్లు వెంటనే మండల పరిధిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రిపోర్టును అందించాలన్నారు. దాదాపు అన్ని కేంద్రాలు ప్రారంభం అయ్యాయని, ఇంకా ఎక్కడ అయిన ప్రారంభం కాకపోతే వెంటనే ఓపెన్ అయ్యేలా చూడాలన్నారు. సోమవారం అత్యధికంగా 88 వినతులు రాగా వాటిని క్షుణంగా పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సు హాసిని, ఆర్డిఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**స్వీప్ కార్యక్రమాన్ని కొనసాగించాలి :** భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న స్వీప్ కార్యక్రమాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. స్వీప్ ద్వారా ప్రజలకు అవగాహనకల్పించడం జరుగుఈతుంద(నాను. 2025 జరవరి 1 వరకు 18 ఏండ్లు నిండే వారు తప్పక ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించి వారిన చేర్పించాలని సూచించారు.

**అవగాహన తోనే సర్వే వేగవంతం :**

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వే పూర్తి స్థాయి అవగాహన తోనే నిర్వయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం జనగామ మున్సిపాల్టీ పరిధిలో ఎన్యుమరేటర్ల శి క్షణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ముఖ్యఅతిధిగా పా ల్గొని మాట్లాడారు. కోడ్ 19 మున్సిల్ కోడ్ జీరో ఒకటి గా తెలియజే వారు.ఈ శిక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సు హాసని, స్టేషన్ ఘనపూర్ ఆర్‌డిఓ వెంకన్న, మున్సిపల్ క మిషనర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ అధికారస్వరూప, తహసీల్దార్‌వెంకటేశ్వర్లు, ఎంపిడిఓజయశ్రీ పాల్గొన్నారు.

## పిడిఎస్‌యు ఆవిర్భావ సభకు మంత్రి సీతక్కకు ఆహ్వానం



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** పిడిఎస్‌యు 50వసంతాల సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో నవంబర్ 17న విద్యార్థి అమరవీరుల యాది సభ ఆహ్వానం సభ కరపత్రాన్ని మంత్రి సీతక్క ములుగు క్యాంప్ కార్యాలయంలో పూర్వ పిడిఎస్‌యు ములుగు జిల్లా కమిటీ నాయకులు సోమవారం అందించారు. అనంతరం పూర్వ పిడిఎస్‌యు ములుగు జిల్లా అధ్యక్షులు ముంజల భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ మంత్రి సీతక్క చదువుకునే రోజుల్లో హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిర్వహించారని, చదువుకునే రోజులలో పిడిఎస్‌యులో పనిచేశారని, విద్యార్థి ఉద్యమ నాయకత్వ స్థాయి నుండి ఈ రోజు మంత్రి కావడం జరిగిందన్నారు. అందుకే పూర్వ పిడిఎస్‌యు విద్యార్థి నాయకురాలు కాబట్టి నవంబర్ 17న ములుగు జిల్లా కేంద్రంలో పిడిఎస్‌యు 50 వసంతాల సందర్భంగా విద్యార్థి అమరవీరుల యాది సభకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. మంత్రి సీతక్క చదువుకునే రోజులలో రామన్నగూడెం ప్రాంతంలో వరద బాధితుల సహాయం కోసం పెద్దయెత్తున విరాళాలు సేకరించి ఆ రోజుల్లో సహాయ సహకారాలు విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలో సేకరించడం జరిగిందని తెలిపారు. పిడిఎస్‌యు నాయకులు ఎండి మౌలానా, సీనియర్ నాయకులు పావురాల భిక్షపతి, పూర్వ ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకులు ఉమ్మడి జిల్లా నాయకులు పెండెం రాజేందర్, సానబోయిన అశోక్, వైనాల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ప్రదాయిని కర్రపెండలం

### జిల్లా ఉద్యావనశాఖ అధికారి సుష్మిత



**ప్రజాపక్షం / వేలేరు :** కర్రపెండలం దుంపజాతికి చెందిన కూరగాయ దీనిని చాలాతక్కువమంది వంటల్లో వాడుతారు. దీనివలన ఆరోగ్యానికి అధికంగా లాభాలు ఉండడమేకాకుండా ఆరోగ్యప్రదాయినిగా ఉంటుందని జిల్లా ఉద్యావనశాఖ అధికారి సుష్మిత అన్నారు. సోమవారం వేలేరు మండలంలోని సోడశపల్లి గ్రామ శివారులోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రముఖ వ్యాపారవేత్త గడ్డి రవి వ్యవసాయ క్షేత్రంలో కర్రపెండలం పెంపకం గూర్చి క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యావనశాఖ అధికారి సుష్మిత మాట్లాడుతూ కర్రపెండలం ఇది దుంపజాతికి చెందిన కూరగాయ ఈదుంపలో అనేకరకాల కేలరీలు, ప్రోటీన్స్, కొవ్వు,కార్బోహైడ్రేట్స్, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ బి, విటమిన్6, పొటాషియం, మెగ్నీషియం, నియాసిన్‌లు లాంటివి పుష్కలంగా ఉన్నాయని, అంతేకాకుండా యాంటీయాక్సిడెంట్‌గా పనిచేయడమే కాకుండా దీనివలన కొల్లాజెన్ ఉత్పత్తి జరుగుతుందని, ఇది ఇమ్యూనిటి పవర్‌ను పెంచుతుందని ఇందులో ఐరన్ జీవక్రియ శారీరక పనులకు సహాయపడుతుందని అన్నారు. అలగే బ్లడ్ ప్రెజర్ తగ్గి , రక్తపోటును పెంచేసోడియం లెవల్స్ బ్యాలెన్స్ అవ్వడమేగాకుండా, కొలెస్ట్రాల్ తగ్గడం, అధికబరువును కంట్రోల్ చేస్తుందని ఇంకా హెల్దీగట్ బ్యాక్టీరియాను ప్రోత్సహించే ఫైబర్, రెసిస్టెంట్ స్టార్చ్‌ను అందించి పేగులోని విషపదార్థాలను గ్రహించి జీర్ణవ్యవస్థను పెంచి జీర్ణ సమస్యల్ని తగ్గించడమేకాకుండా రక్తంలోని షుగర్ లెవల్స్ కంట్రోలై ఊబకాయం, బెల్లీఫ్యాట్, షుగర్, గుండెసమస్యలు తగ్గుతాయని అన్నారు ఇది ఎక్కువగా తమిలనాడు ప్రాంతంలోని నామకల్, సేలం, ఈరోడ్, ధర్మపురి, క్రిష్ణగిరిలాంటి ప్రదేశాలలో పండుతుందని, మన తెలంగాణ ప్రాంతంలో దాదాపుగా రైతులు ఎక్కువగా దీనిపై శ్రద్ధకనబరచడంలేదని అన్నారు. ఎవ్వరైన రైతులు ఈ కర్రపెండలం పంటను పండిస్తే జిల్లా అధికారులతో మాట్లాడి సరఫరా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి రవి, ఉద్యావనశాఖ అధికారి సుష్మిత, ఎఇఒ రాజశేఖర్, బిఆర్ఎస్ స్టేట్ సెక్రెటరి ఉప్పల వెంటరమణ, బుట్టి శ్రీను, రవి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగించరూ

### సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానందం



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని పటేల్ గూడెం కుందారానికి గ్రామానికి వెళ్లే కాసోనుకుంట కట్ట వద్ద, మూలమలుపు ఉండడంతో, రోడ్డుకు ఇరువైపుల వేపుగా చెట్లు పెరిగి, రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానందం ఆరోపించారు. ఈ రోడ్డుపై నుండి, పాలకుర్తికి వెళ్లే ప్రయాణికులు, రాత్రి వేళల్లో, ఇబ్బందులకు ప్రమాదాలు జరిగి, ప్రాణాలు, కోల్పోయారని వారు అన్నారు. అధికారులు స్పందించి, రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు ప్రజలకు, ఇబ్బందులు కలగకుండా, చెట్లను తొలగించి, అధికారులు ప్రమాదాలు జరగకుండా, చొరవ తీసుకోవాలని, ఆయన అన్నారు. గొరిగే సందీప్, ఎడ్ల కృష్ణ, సోమయ్య, నర్సయ్య, హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల అరెస్టులను ఖండించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మాజీ సర్పంచ్‌ల ను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 11నెలలు గడిచినా అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా వారిని అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు న్యాయమన్నారు. మాజీ సర్పంచ్‌లను ప్రభుత్వం అరెస్టు చేయడం ముమ్మాటికి సిగ్గుమాలిన చర్య అన్నారు. వెంటనే అరెస్టు చేసిన మాజీ సర్పంచ్‌లను విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో ఏపేస్ బాపిస్ట్ వారి ఆధ్వర్యంలో ప్రగతి సేవా సమితి వారి సహకారంతో నూతనంగా సోమవారం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నీ వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామస్తుల కోరిక మేరకు ఈ వాటర్ ప్లాంట్ ను నా సొంత నిధులతో బోర్ వేపిస్తా అని అలాగే మీకు ఏ సహాయ సహకారాలు కావాలన్న అందిస్తానని తెలిపారు. ప్రభుత్వం తరపున వచ్చే పథకాలను పేదల ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాపిస్ట్ చర్చ్ కి భవన నిర్మాణం కోసం ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్లి మంజూరు చేస్తాననిహామీ ఇచ్చారు.

## త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారం

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి వేదిక అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదికగా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గత వారం సమర్పించిన దరఖాస్తులలో ఎక్కువ మొత్తం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, పరిష్కరించుటకు వీలుగాని దరఖాస్తులను దరఖాస్తుదారునికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రజావాణికి మొత్తం దరఖాస్తులు 87 రాగా అందులో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై 34, కలెక్టరేట్ సంబంధించిన సమస్యలపై 10, డిఆర్డిఒ 8, జిడబ్ల్యుఎంసి 9 దరఖాస్తులు, మిగతావి వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని వాటిని వారం వ్యవధిలో పూర్తి చేయాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ (ఇన్చార్జ్ అడిషనల్ కలెక్టర్) విజయలక్ష్మి, ఆర్‌డిఒ శ్రీపాల్ రెడ్డి, డిఆర్‌డిఒ కౌసల్య దేవి, జెడ్పి సిఇఒ రామ్ రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించే వరకూ పోరాటాలు ఆగవు




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** ఫీజు బకాయిల విడుదల చేసే వరకు పోరాటాలు ఆగవని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రం శివనగర్ తమేర భవన్‌లోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో సోమవారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థుల చదువులు కొనసాగేది ఎట్లా అనిప్రశ్నించారు. గతంలో ఫీజు బకాయిలపై ఎన్నికల సమయంలో సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు నేడు చేస్తున్న వాటికి ఎటువంటి పొంతన లేదని, సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడకూడదని, వారిపట్ల వివక్ష చూపకుండా తక్షణమే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా తయారైందని, గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టించిందని, విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయడంలో వైఫల్యం చెందిన విషయాలను కాంగ్రెస్ పార్టీ ఆసరాగా తీసుకొని ఎన్నికల సమయంలో, వివిధ సందర్భాల్లో మేము అధికారంలోకి వస్తే సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం అని కాంగ్రెస్ నాయకులు చెప్పడం జరిగిందని, దీంతో విద్యార్థి, యువత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్ర కృషి చేశారని, ఎట్టకేలకు కాంగ్రెస్ అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నప్పటికి సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తి అవుతున్న కూడా విద్యారంగంలో ఉన్న సమస్యలపై ఇంతవరకు ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించని పరిస్థితిలో ఉన్నారని, సాక్ష్యాత్తు విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉండటం వలన రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని అందరూ భావించారు, నేడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు అనేక సమస్యలతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారని, గురుకులాల్లో ఉన్న విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురైతున్నారన్నారు. అద్దెభవనాలలో కొనసాగుతున్న వాటికి ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో వారు వాటికి తాళాలు వేయడం జరిగిందని, విద్యార్థులు స్వచ్ఛందంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్న అధికారుల్లో చలనం కూడా లేదని, సాంఘిక, సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చూపకపోవడం, నాణ్యతతో కూడిన భోజనం పెట్టకపోవడంతో అనేక మంది విద్యార్థులు అనారోగ్యబారిన పడుతున్నారన్నారు. ఇవన్ని సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు రూ. 7,800 కోట్లు బకాయిలు మూడు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదన గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థ సారథి, ల్యాదల్ల శరత్, నాయకులు అభిరామ్, రాకేష్, శ్రీధర్, శివకుమార్, సంతోష్, రాజు, ఖలీల్, ప్రభాస్, సోను, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంటకు ధర ఎక్కువ రావాలంటే రైతు చేతుల్లోనే..

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/నెక్కొండ:** రైతు కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన అధికారియటు రావాలంటే అది రైతు చేతుల్లోనే ఉందని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని భవాని కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని ఎండబెట్టి క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ప్లాస్టిక్ సంచులు పరదాలు ఎరువుల కాలి బస్తాలలో ఎండబెట్టకూడదని తట్టు బస్తాలలో ఆరబెట్టాలని ప్రతిరోజు ఏరిన పత్తిని బస్తాలలో కాకుండా విడిగానే నిలువ చేసుకోవాలని ఆయన అన్నారు. అలాగే రైతు మార్కెట్‌కు బస్తాలలో పత్తిని అమ్మడానికి తీసుకెళ్లకూడదని విధిపత్తిని తీసుకెళ్లాలని మార్కెట్‌కు తీసుకుపోయే క్రమంలో పత్తిని బాగా ఎండబెట్టి తేమశాతం ఎనిమిది వచ్చేలా చూసుకోవాలని అలా చేస్తే ప్రభుత్వం మద్దతు ధర వస్తుందని రైతులు ఇది గమనించాలని ఆయన అన్నారు. మార్కెట్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు మార్కెట్ కార్యదర్శి ప్రతిరోజు సిసిఐ కొనుగోల కేంద్రాలను గమనించారని మధ్యతరాలు దళారులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఖరీదుదారులపై అధికారులపై అలాగే పత్రికా విలేకరులపై కూడా ఉందని ఆయన గుర్తు చేశారు. డెమో శాతం చూసుకోకుండా రైతు మార్కెట్‌కు తీసుకెళ్లకూడదని ఈ సంవత్సర వాతావరణ దృశ్య ఏడ నుంచి ఎనిమిది పండే అవకాశం ఉందని ఈమశానం తక్కువ తీసుకెళ్తే ఒక కింటాకు 100 నుండి 200 రూపాయలు తగ్గుతుందని తద్వారా ఎకరానికి 3000 పైన నష్టం వస్తుందని ఆయన అన్నారు. ఖరీదు దారులను హమాలీలను శాసన సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఆర్డెడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పత్తి అమ్మకానికి తెచ్చిన ప్రతి రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్కు, బ్యాంక్ అకౌంట్, ఈ మూడు జిరాక్స్ తేవాల్సిన బాధ్యత మీపై ఉందని అలా అయితేనే సరైన సమయంలో డబ్బులు మీ ఖాతాలోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారులు డిడిఎం పద్మావతి, డిఎంఓ సురేఖ, సిసిఐ అధికారి సుశీల్, తహసీల్దార్ వేముల రాజకుమార్, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బక్కి అశోక్, రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి ,మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్, మార్కెట్ వైస్ చైర్మన్ డైరెక్టర్లు దొడ్డ విజయ్, రావుల మహిపాల్ రెడ్డి,, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రైతులు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## పరమ పవిత్రం కార్తీక మాసం

### అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/గణపురం:** కార్తీక మాసం నెల రోజులు ఎంతో పవిత్ర దినాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం ఆమె స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి నందీశ్వరునికి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలతో కలిసి దీప దానాలు చేశారు. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో ఉదయం నుండే ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం రద్దీగా మారింది. క్యూలైన్ లో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట ఎంపిడిఒ ఎల్ భాస్కర్, పంచాయతి కార్యదర్శి ఉమ్మల్ల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం: కడియం

### రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** రైతులు పండించిన ధాన్యాన్ని చివరిగింజవరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని కూనూరు గ్రామంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని తీగారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మొసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించుకోవాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రేడ్‌వన్ వడ్లకు రూ.2320, సాధారణ వడ్లకు రూ.2300, సన్న వడ్లకు రూ.500 బోనస్‌గా చెల్లించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 23లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని స్పష్టం చేశారు. పనలేని, పనిచేయని కొన్ని రాజకీయ పార్టీలు పనికట్టుకుని ప్రభుత్వంపైన దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి మాటలు నమ్మొద్దని ప్రజలకు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఈగల కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటి చైర్మన్ లావణ్య, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ గుజ్జారి రాజు, అన్నబోయిన బిక్షపతి, మార్కెట్ డైరెక్టర్ సురేష్‌బాబు, డిపిఎం వరలక్ష్మి , ఎపిఎం కెరవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 23 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/హనుకొండ టౌన్ :** హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్, మెదక్ కేంద్రంగా జరుగుతున్న అండర్ 23 లీగ్‌కంనాకౌట్ క్రికెట్ పోటీల్లో భాగంగా, పూల్ బి విభాగంలో మ్యాచ్‌లని హన్మకొండలోని రెడ్డిపురంలో గల టివి విఎస్ క్రికెట్ మైదానంలో సోమవారం హన్మకొండ ఎసిపి దేవేందర్‌రెడ్డి పాల్గొని ప్రారంభం కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడలతో యువతకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అనడానికి తానే ఉదాహరణ అని క్రీడల పాల్గొనడం వల్లనే తనకి ఉద్యోగం పొందానని క్రీడాకారులు క్రీడా కోటని సద్వినియోగం చేసుకోవాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ గౌడ్, వరంగల్ రంజీ ప్లేయర్ సుఖంత్ తదితరులు పాల్గొన్నారు. తొలి మ్యాచ్‌లో భాగంగా వరంగల్, ఖమ్మంల మధ్య జరుగగా, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు నిర్ణీత 50 ఓవర్లుకిగాను 35.1ఓవర్లు ఎదుర్కొని 113పరుగులకి అల్ అయిట్ అయింది, వరంగల్ ఓపెన్నింగ్ బ్యాట్సన్ పార్దిపన్ ఇక్కడే రాణించి 44 పరుగులు చేయ్యగా, మిగిలిన బ్యాట్స్మెన్ అందరూ విఫలం అయ్యారు, ఖమ్మం బౌలర్లు సాయి చంద్ 4 వికెట్లు తియ్యగా,వంశి, బిన్నీ తాలా 2వికెట్లు తీసి ఖమ్మం బౌలర్లు వరంగల్ బ్యాటింగ్ జట్టును కట్టడి చేశారు. 114లక్ష చేదనాలో బ్యాటింగ్ బరిలోకి దిగిన ఖమ్మం జట్టు కేవలం 20.1ఓవర్లు ఎదుర్కొని 2 వికెట్ల నష్టానికి 114 పరుగులు సాధించి 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఖమ్మం జట్టు బ్యాట్స్మెన్ డివిన్ ఒక్కడే 69 పరుగులు సాధించి విజయంలో కీలపాత్ర పోషించారు.

**3వికెట్ల తేడాతో గెలిచిన అదిలాబాద్:** మొగిలిచర్ల క్రీడా మైదానంలో మహబూబ్ నగర్, అదిలాబాద్ జట్ల మధ్య జరిగిన మరొక లీగ్ మ్యాచ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్ నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకి గాను 47.1 ఓవర్లు ఎదుర్కొన్ 191 పరుగులు చేసి అల్ ఔట్ అయింది.

## ప్రజాస్వామిక విప్లవానికి పోరాడుదాం



**ప్రజాపక్షం/నెక్కొండ:** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం పోరాడుతూ భారత విప్లవోద్యమంలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవ వీరుల పోరాట స్పూర్తితో ఉద్యమించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 1 నుండి 9 వరకు భారత విప్లవోద్యమ వీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నెక్కొండ మండల కేంద్రంలో, సీతారాంపురం గ్రామంలో డివిజన్ నాయకులు కత్తుల కొమురయ్య ఎర్రజెండాలను ఎగురవేసి అమరవీరులను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ దేశంలో గత 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ సామ్రాజ్యవాద పెట్టుబడిదారి కంపెనీలకు కట్టబెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు దేశంలో 78 సంవత్సరాల పార్లమెంటరీ పాలనలో పేదలకు ఉచిత విద్య, వైద్యం, భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో అలాగే పేదరికం, నిరుద్యోగం, కుల, మత ఆర్థిక అసమానతలు రూపుమాపడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. దేశంలో ప్రజల సంక్షేమాన్ని, ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా దేశాన్ని మతోన్మాద ఫాసిజం వైపు తీసుకెళ్తు, దేశ లౌకిక వ్యవస్థ విచ్ఛన్నానికి పాల్పడుతున్నారు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, దార లింగన్న, గడి కొప్పుల రవి ,వీరారెడ్డి, సాంబయ్య, మురళి, మనోహర చారి, జవహర్ లాల్, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోరంచపల్లి ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు

### సిఎంకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చాడ రఘునాథ్ రెడ్డి కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న మోరేంచపల్లి ఎత్తిపోతల పథకానికి తక్షణ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.34.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పరకాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చాడ రఘునాథ్ రెడ్డి తెలిపారు. అడిగిన వెంటనే రైతు కష్టాలు విన్న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, నిధులు రావడానికి ప్రత్యేక చొరవ చూపిన భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు రఘునాథ్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, వెంటనే మరమత్తులు చేయడానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.

## పొలంలోనే రైతు మృతి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** పొలం వద్ద యువ రైతు పంగ శ్రీనివాస్ యాదవ్ (39) మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం శ్రీనివాస్ పొలం దగ్గరకు వెళ్ళాడని అన్నారు. కూలీలను తీసుకొని భార్య, తల్లి పొలం వద్దకు వెళ్ళగా అప్పటికే శ్రీనివాస్ పొలం వద్ద మృతి చెంది ఉన్నాడని అన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## వాడవాడలా సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వంద సంవత్సరాల సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహిద్దామని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సీనియర్ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో మామిడి వెంకయ్య అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవ వేడుక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల పక్షాన పోరాడుతూ సిపిఐ విజయవంతంగా 100 సంవత్సరాలు పూర్తిచేసుకోబోతుందని తెలిపారు. దేశ చరిత్రలో కమ్యూనిస్టులు లేకుండా ఏ పోరాటం జరగలేదని, ప్రజా సమస్యలే అజెండాగా పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. తెలంగాణలో సిపిఐది మొదటి నుండి క్రియాశీలకమైన పాత్ర అని తెలిపారు. సిపిఐ 100 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 9న హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, సిపిఐ హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి దొంతగాని సత్యనారాయణ, గుండా రమేష్, జక్కుల రమేష్, సోమగాని కృష్ణ, జడ వెంకన్న, పొనుగుపాటి వాసుదేవరావు, సుందరి పద్మ, బత్తిని మల్లయ్య పాల్గొన్నారు.

## 12నుంచి ఎఐటియుసి జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని జయశ్రీ గార్డెన్స్‌లో ఈనెల 12వ తేదీన జరిగే ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ పిలుపునిచ్చారు. సోమవారం బొమ్మలరామారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఇమ్రాన్ మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబై మహానగరంలో ఆవిర్భావించిన భారతదేశ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. నాటి నుండి నేటి వరకు కార్మికుల కోసం అనేక సంక్షేమ చట్టాలు సాధించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. బ్రిటిష్ కాలం నాటి నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వాటిని మార్చేసి 4 లేబర్ కోడ్‌లుగా మర్చి కార్మికుల పైన దాడి చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని కార్మిక నాయకులకు, కార్యకర్తలకు కార్మిక చట్టాలతో పాటు హక్కులు, బాధ్యతలు పై రాజకీయ చైతన్యం పెంచడానికై ఈ నెల 12.11.2024 మంగళవారం జయశ్రీ గార్డెన్స్‌లో జరిగే శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్, బిసి హక్కుల సాధన సమితి అధ్యక్షులు కైరంకొండ ఆనంద్, ఏఐటీయూసీ నాయకులు ఉట్ల కృష్ణ, గుండు వెంకటేష్, యట మౌనిక, బొమ్మ రం సంధ్య, ఎం.రాజు, పి.మల్లేష్, జె.బాల్ రాజ్, ఎం.మహేష్ పాల్గొన్నారు.

## రెండు దశల్లో సమగ్ర సర్వే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ పట్టణాలు, గ్రామాల్లో సమగ్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల సర్వే రెండు దశల్లో నిర్వహిస్తున్నామని సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి ఒక బ్లాక్‌లోని ఇండ్లను గుర్తించి ఈనెల 9 నుంచి ఇంటింటికి తిరిగి సర్వే చేస్తారని అన్నారు. ప్రజా పంపిణి వ్యవస్థ కింద సుమారు 30 చౌకధరల దుకాణాలకు డీలర్ల నియామకం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేస్తామన్నారు. నియామకానికి ఆయా కేటగిరి వాళ్లు నేటి నుంచి 18 సాయంత్రం వరకు సంబంధిత తహసీల్దార్లకు దరఖాస్తులు చేసుకోవాలనుకునేవారు రూ.250 డీడీని రెవెన్యూ డివిజన్ మిర్యాలగూడ పేరున తీసిన డిడీ ప్రతిని, నివాస, కుల, విద్యార్హత ధృవీకరణ పత్రాలు జతపరిచి ఎ కేటగిరి కింద దరఖాస్తు చేసుకున్నారో పేర్కొనాలన్నారు. వ్రాత పరీక్ష పట్టణంలో నిర్వహిస్తారని, 80 మార్కులు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు ఉంటాయని తెలిపారు. కనీసం 32 మార్కులు సాధించిన వారిని 1:5 నిష్పత్తిలో నియమిస్తామని తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో రూ. 60లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొండ గ్రామంలో రూ.300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంతో పాటు రైతుల రుణమాఫీ కోసం రూ. 400 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. తాటిపాముల గ్రామాన్ని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లాజర్, ఎంపిఓ భీంసింగ్ నాయక్, కార్యదర్శి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వై నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, నాయకులు కృష్ణ, వీరేశం, సజన్, యాదగిరి, సుదర్శన్, నరసింహ పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలుకు రూ. 20వేల కోట్లు

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా 7500 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో దిగుబడి అవుతున్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20వేల కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 7500 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సన్నధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లిస్తామన్నారు. 2.20 కోట్ల లబ్దిదారులకు ఉచిత బియ్యం ఇవ్వడానికే బియ్యం నాణ్యతను పెంచామని, సంక్రాంతి తర్వాత సన్నబియ్యం అందిస్తామన్నారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో మిల్లర్లకు ఇబ్బంది లేకుండా ధరలు పెంచుతూ, కేంద్ర ప్రభుత్వ నిబంధనలను కలెక్టర్లకు అందిస్తూ కొనుగోలును వేగవంతం చేస్తామన్నారు. ఆయన వెంట అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పిలు రవి, శ్రీధర్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి వేణారెడ్డి ఉన్నారు.

### పోలీసుల సేవలు అభినందనీయం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



పోలీసుల సేవలు అభినందనీయమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పోలీస్ హౌజింగ్ నిధులు రూ. 70లక్షలు, పంచాయతీరాజ్ నిధులు రూ. 20లక్షల వ్యయంతో నిర్మించిన నూతన డిఎస్‌పి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటల పాటు శ్రమిస్తూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలీస్ శాఖ క్రమశిక్షణ గల శాఖ అని, విధి నిర్వహణలో అనేక మంది ముందున్నారని చెప్పారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన అనంతగిరి, చింతలపాలెం, మద్దిరాల, పాలకవీడు, నాగారం పోలీస్ స్టేషన్‌లకు నూతన భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. రాష్ట్రంలో పోలీస్ భవనాల నిర్మాణానికి పోలీస్ హౌజింగ్ సొసైటి కృషి చేస్తుందన్నారు. అనంతరం కార్యాలయంలో డిఎస్‌పి రవిని కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, మల్టీజోన్2 ఐజి సత్యనారాయణ, ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్, పోలీస్ హౌజింగ్ ఐజి రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డి, కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



## అదనపు కోర్సులతో విద్యా ప్రమాణాలు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో గల మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కాజా అల్తా హుస్సేన్ అన్ని శాఖ అధిపతులు, బిఓఎస్‌లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విధిగా హాజరు ప్రమాణాలు పాటిస్తూ, ఆల్మనాక్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. నైపుణ్యాల పెంపునకు ప్రతి విభాగం నుండి అదనపు కోర్సులను అందించే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి 6 గంటల వరకు అదనంగా ఈ నైపుణ్య శిక్షణలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య అలువాల రవి, ఓఎస్‌డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆచార్య ఆకుల రవి, డా మిరియాల రమేష్, డా ఉపేందర్ రెడ్డి, డా శ్రీదేవి, కె అరుణ ప్రియ, సుధారాణి,మాధురి, రూప, తిరుమల, దోమల రమేష్, రామచందర్ గౌడ్, హరీష్ కుమార్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# త్వరితగతిన 'ముక్త్యాల, జాన్‌పాడ్ లిఫ్టు' పనులు

వేసవికాలం వరకు మొదలుపెట్టిన కార్యక్రమాలు చేపట్టకపోతే చర్యలు

శాంతినగర్ పద్మావతి ఎత్తిపోతల పథకంపై అసంతృప్తి

కోదాడ, హుజూర్‌నగర్ అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్, ఎంఎల్‌ఏ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** వేసవికాలం వరకు మొదలు పెట్టిన కార్యక్రమాలు పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను సూచించారు. సోమవారం కోదాడలోని మేళ్లచెరువు కాశీనాథం పంక్షన్ హాల్‌లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అధికారుల సమీక్ష సమావేశంలో కోదాడ ఎంఎల్‌ఏ పద్మావతిరెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ముక్త్యాల, జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి కావాలని అధికారులకు సూచించారు. శాంతినగర్ పద్మావతి ఎత్తిపోతల పథకంపై అసంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం అధికారులపై మండిపడ్డారు. ఆర్9 లిఫ్టు ఒక నీళ్ల పంపు టైట్ అవుతుందని ఓ రైతు తెలపగా అధికారులతో చర్చించి త్వరగా పైపు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. శ్రీరాంసాగర్ నీళ్లు మోతె, మునగాల, నడిగూడెంకు రావాలని రైతులు విన్నవించుకోవడంతో నీళ్లు వచ్చే విధంగా అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత 25 సంవత్సరాలుగా లిఫ్టు ఇరిగేషన్‌లో కాంట్రాక్టర్ బేసిక్‌లో పనిచేసిన వారిని తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లెఫ్ట్ కెనాల్, ఇరిగేషన్ అధికారులను త్వరితగతిన పనులు పూర్తి కావాలని తెలిపారు. వ్యవసాయ అధికారులను నాణ్యతమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలని సూచించారు. అర్అండ్‌బి అధికారులను రోడ్లు అన్ని లోటుపాట్లు లేకుండా మరమ్మతులు చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో ఏ పదవిలో ఉన్న ప్రజల కోసమే నిరంతరం కృషి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్, ఎంఎల్‌ఏ పద్మావతిరెడ్డి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, టిపిసిసి డెలిగెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు పెండింగ్ ఉండొద్దు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 48 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 24, మున్సిపాలిటీ 5, జిల్లా పంచాయతీ అధికారి 5, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 3, సర్వే ల్యాండ్ రికార్డ్ 2, ఎక్సైజ్ శాఖ, సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, మైనింగ్ శాఖ, వైద్య శాఖ, హౌసింగ్, ఆర్.డబ్ల్యూ.ఎస్, పోలీస్ శాఖ, ఆర్టీసీ కు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శోభారాణి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల స్థితిగతులను చెప్పాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల స్థితిగతులను సంబంధిత శాఖల అధికారులు వచ్చేవారం ప్రజావాణిలో చెప్పాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రవాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలపై 16, డిడబ్ల్యూఓ 4, డిఆర్‌డిఓ 6, డిపిఓ 1, డిఏఓ 7తో పాటు ఇతర శాఖలకు 24 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి అప్పారావు, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నర్సింహ్మారావు, సంక్షేమ అధికారులు శంకర్, లత, అనసూర్య, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సీతారాం నాయక్, డిసిఓ పద్మజ, డిపిఓ నారాయణరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై దృష్టి కేంద్రీకరణ

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ ప్రాధాన్య పథకాలపై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టే నూతన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై జిల్లా అధికారులు మొదలుకొని, గ్రామస్థాయి వరకు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందని , సంబంధిత శాఖల అధికారులు రైతులకు, మిల్లర్లకు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా పద్ధతి ప్రకారం ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మరో కార్యక్రమం సామాజిక, ఆర్థిక , విద్య,రాజకీయ మరియు కుల సర్వే అతిముఖ్యమైందని, ఈ సర్వే కేవలం సమాచార సేకరణకు మాత్రమే ఉద్దేశించిందని ఆమె స్పష్టం చేశారు. ఈ సర్వేలో భాగంగా ఈ నెల 6 నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకుగాను జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. కాగా ఈ సోమవారం 45 మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను సమర్పించారు. ఎప్పటిలాగే ఈ సోమవారం సైతం పింఛ న్లు, విద్య ,ఉపాది,వ్యక్తిగత అంశాలు, తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ఈ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ఉన్నారు.

# ఖరీదైన బైకులే లక్ష్యంగా...

రూ. 25లక్షల విలువైన 27 బైకులు స్వాధీనం

ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఖరీదైన బైకులను లక్ష్యంగా చేసుకోని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వారి నుండి రూ. 25లక్షల విలువైన 6 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు, 7 యూనికార్న్ బైకులు, 10 పల్సర్ బైకులు, 2హెచ్‌ఎఫ్ డీలక్స్, 1 గ్రామర్ బైక్‌తో పాటు మరోక షైన్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ కోదాడ, మునగాల పోలస్ స్టేషన్ పరిధిలోని మోటార్ సైకిళ్ళ దొంగతనాల కేసు వివరాలను వెల్లడించారు. కోదాడ పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులోని ప్లైఓవర్ సమీపంలో పట్టణ సిఐ రాము సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వాహనాలపై వస్తున్న ఐదుగురిని అనుమానితులుగా గుర్తించి అదుపులో తీసుకోని విచారించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన బారి నాగరాజు అలియాస్ గుంటూరు నాగరాజు, గుంజి రామాంజనేయులు, షెక్ కాసినపల్లి బాష, గుంజి కృష్ణ, తమ్మిశెట్టి వెంకటేష్, గోగుల గోపాలకృష్ణలుగా గుర్తించినట్లు తెలిపారు. బారి నాగరాజు అనే వ్యక్తి సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి గ్రామంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆంధ్రాప్రాంతం తంగెడ గ్రామానికి చెందిన గుంజి రామాంజనేయులు, బాష, గుంజి కృష్ణలు నాగరాజు షాపులో మోటార్ సైకిళ్ళ రిపేర్ల కోసం రావడంతో వీరి పరిచయం ఏర్పడింది. వీరందరు ముఠాగా ఏర్పడి ఖరీదైన బైకులను దొంగలించారు. గతంలో నాగరాజుపై హైద్రాబాదులో 5 కేసులు ఉన్నాయి. నిందితుల నుండి 21 బైకులు సీజ్ చేయగా ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. మరోకరు ఫరారిలో ఉన్నట్లు తెలిపారు.

**మునగాలలో ఆరు బైకులు సీజ్**

మునగాల మండల పరిధిలోని ముకుందాపురం బస్టాండ్ సమీపంలో ఎస్ఐ ప్రవీణ్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోదాడ నుండి సూర్యాపేటకు ఒక మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులను అదుపులో తీసుకోని విచారించారు. ఎపి రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండల కేంద్రానికి చెందిన మెచ్చర్ల శ్రీను, తరుణ్, చిన్నులుగా గుర్తించారు. వీరి నుండి రూ. 3.10లక్షల విలువైన ఆరు బైకులు స్వా ధీనం చేసుకున్నారు. ఎనిమిది మం ది దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కేసును చేధించిన సిసిఎస్ సిఐ శివకుమార్, సిసిఎస్ ఎస్ ఐ శ్రీకాంత్, డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి, కోదా డ సిఐ రాము, మునగాల సిఐ రామకృష్ణా రెడ్డి, టెక్నికల్ టీం సభ్యులు, మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, యల్లారెడ్డి, సతీష్‌లను అభినందించి రివార్డులను అందజేశారు.

# తేమశాతం వల్ల ధాన్యం ఆలస్యం



కలెక్టర్ ఆదేశాలతో జెట్ స్పీడ్‌తో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలతో మండల వ్యాప్తంగా ఉన్న పిఎసిఎస్ ఐకెపి ధాన్యపు మార్కెట్ యార్డుల్లో కొనుగోళ్ల ప్రక్రియ సూపర్ స్పీడ్ తో కొనసాగుతున్నాయి. తూకం వేసిన ధాన్యపు బస్తాలను రైస్ మిల్లులకు వెను వెంటనే తరలిస్తూ ముందస్తుగా లారీలను అందుబాటులో ఉంచారు. ఆదివారం ఆయన పోచంపల్లి పిఎసిఎస్ పరిధిలోని ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వ్యవసాయ అధికారులకు అనుబంధ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన దరిమిలా అధికారులు సోమవారం నుండి కొనుగోళ్లను మరింత వేగవంతం చేశారు. పోచంపల్లి పరిధిలో 16 పిఎసిఎస్ సెంటర్లు, జూలూరు గ్రామ పరిధిలో 8, ఐకెపి సెంటర్లు 6 కలిపి మొత్తం 30 వరి ధాన్యం సేకరణ కేంద్రాలలో ప్రతి రైతు కష్టార్జిత చివరి చెమట బొట్టు చిందించి పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తేమ 17 శాతం కంటే తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని ఆదేశించారు. ఒక్క పోలీస్ స్టేషన్ ప్రక్కనే ఉన్న మార్కెట్ యార్డులో 191 ధాన్యపు కుప్పలు ఉన్నందున తేమశాతం పరీక్షించే డిజిటల్ మీటర్లను మరికొన్ని అందుబాటులో ఉంచాలని ఏఓను ఆదేశించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇన్ఫ్రాస్ట్రక్చర్కు సంబంధించి ఏ విధమైన ఇబ్బందులు లేవని సరిపడా గోనే సంచులు ఉన్నాయని రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ యజమానులు కూడా పూర్తిగా సహకరిస్తూ ఇచ్చిన సమయంలోనే కొనుగోళ్ళను పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. హమాలీలు పూర్తిగా సహకరిస్తే రాత్రిళ్ళు సైతం విద్యుత్తు లైట్ల వెలుతురులో ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలును పూర్తి చేస్తామని అన్నారు. జిల్లావ్యాప్తంగా 51 రైస్ మిల్లులను కేటాయించినట్లు తెలిపారు. కాగా పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ ను ఆయన తనిఖీ చేసి విద్యార్థుల వివరాలు ఆహార మెనూ తీసుకుంటున్న జాగ్రత్త లను అడిగి తెలుసుకున్నారు.ఆర్డీవో శేఖర్ రెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారిణి వనజాత ఎమ్మార్వో మహేందర్ రెడ్డి ఏడిఏ వెంకటేశ్వర్లు ఏవో శైలజ డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు ఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి పిఏసిఎస్ సీఈవో బాల్రెడ్డి ఎఈఓ ప్రియాంక ఎస్డబ్ల్యూఓ చంద్రకళ పిట్టే శ్రీనివాస్ రెడ్డి రామచంద్రారెడ్డి రైతులు పాల్గొన్నారు.



## వివిధ సమస్యలపై 46 అర్జీలు

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం జిల్లా కార్యాలయం సముదాయ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ కలసి కలెక్టర్ వినతులను స్వీకరించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వార అందచేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వివిధ సమస్యలపై కలెక్టర్‌కు 46 దరఖాస్తులను అందచేశారు.

## టెన్నిస్ పోటీలకు ఐపిఎస్ విద్యార్థులు



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపిక అయ్యారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ టెన్నిస్ క్రీడల్లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి సత్తా చాటారు. జగిత్యాల జిల్లాలోఉమ్మడిజిల్లాఎస్జీఎఫ్ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ పోటీలలో అండర్ 14 బాలుర విభాగంలో మొదటి బహుమతి,అండర్ 14 బాలికల విభాగంలో రెండవ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.అలాగే సుల్తానాబాద్ సెయింట్ మేరీ పాఠశాలలో జరిగిన పెద్దపెల్లి జిల్లా స్థాయి ఖో ఖో పోటీలలో అండర్ 17 బాలికలు మొదటి బహుమతి గెలుపొందారు.పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్‌కృష్ణ ప్రియా విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు,వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థిని



**ప్రజాపక్షం /గొల్లపల్లి :** జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆదివారం జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జిఎఫ్ (ఇంటర్నెట్ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్) కబడ్డీ పోటీలలో 8 వ తరగతికి చెందిన ఏ. వర్షిత అండర్ 19 విభాగంలో జూనియర్ కబడ్డీ పోటీలు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుంకరి రవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటల పోటీలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు, విద్యార్థిలో సర్వతో అభివృద్ధి పెంపొందించడానికి తగిన ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులలో మరింత ఎక్కువ మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. విద్యార్థినిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రవి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, పిడి రజిత, ఉపాధ్యాయులు అభినందించారు.

## మహాధర్నా అడ్డుకోవడం దుర్మార్గం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** సర్పంచ్‌ల మహాధర్నాను అడ్డుకోవడం ప్రజా పాలన విరుద్ధమని మాజీ సర్పంచ్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచ్ ల అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ పిలుపుమేరకు సర్పంచుల మహాధర్నాకు హైదరాబాదు బయలుదేరిన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులను సోమవారం గొల్లపల్లి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మాజీ సర్పంచులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని అభివృద్ధి కోసం ఖర్చు చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని పలుమార్లు ప్రభుత్వానికి తెలియజేసిన పట్టించుకోలేదన్నారు. మాజీ సర్పంచుల బాధలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం ద్వారా కష్టాలు చెప్పుకునే హక్కు కూడా లేదా అని అన్నారు. రాపల్లి మాజీ సర్పంచ్ నల్ల శ్యామ్, బొంకూర్ మాజీ సర్పంచ్ కందుకూరి సత్తయ్య, రాఘవపట్నం మాజీ సర్పంచ్ రాగం శంకరయ్య, మాజీ సర్పంచ్ తిరుపతి తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే ధాన్యానికి మద్దతు ధర



**ప్రజాపక్షం/రామగిరి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని తాసిల్దార్ వాసంతి అన్నారు.కమాన్ పూర్ మండలంలోని కమాన్ పూర్, సిద్దిపల్లె, ములకలపల్లి, రాజాపూర్, గుండారం, పేరపల్లిల్లో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ వాసంతి ప్రారంభించారు.తహసిల్దార్ మాట్లాడారు. 202425 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కనీసమద్దతు ధర క్వింటాకు గ్రేడ్ ఏ రకానికి రూ, 2320 లుగా, సాదారణ రకానికి రూ.2300లుగా మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ప్రజాపక్షం/ముత్తారం :**ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాదర్ల హరీష్ గౌడ్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. హరీష్‌కి గత నెల 11నమైదంబండ గ్రామంలోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడం, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడం, అప్పటినుండి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. హరీష్ త్వరగా కోలుకోవాలని పలువురు నాయకులు తో పాటు అతని సోదరులు ఆర్థిక సహాయాన్ని సైతం అందించారు. కానీ చికిత్స పొందుతున్న హరీష్ గౌడ్ ఆదివారం మృతి చెందడం పట్ల అడవి శ్రీరాంపూర్ గ్రామంలో విషాదం నెలకొంది.మృతుడికి భార్య సౌజన్యం ఉన్నారు.

# సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలెప్పుడు?

### కొన్నేళ్లుగా అద్దె భవనాల్లోనే బోధనలు

### కరీంనగర్ కలెక్టర్‌కు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్, బాలికల హాస్టల్స్ నూతన భవనాలు నిర్మించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారావు వెంకటేష్, మచ్చ రమేష్ లు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లకు పక్క భావనలు లేకపోవడం వల్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని దీని వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. హాస్టల్లో మౌలిక వసతులు లేకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సంక్షేమ హాస్టళ్లల్లో చదివే విద్యార్థులంతా నిరుపేద కుటుంబలకు చెందినవారని వారు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని చాలి కాలం ప్రారంభమైంది విద్యార్థులకు అందించాల్సిన దుపట్లు వంటి సామాగ్రిని తక్షణమే అందించాలని కోరారు. వెంటనే మంత్రి కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ బీసీ ఎస్సీ బాలుర మరియు బాలికల హాస్టల్లను సమీక్ష నిర్వహినిర్వహించి హాస్టళ్లకు నూతన భావనలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షకార్యదర్శులు మామిడిపల్లి హేమంత్, కేశబోయిన రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకనుండి సక్రమంగా పౌష్టికాహారం



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** హుజురాబాద్ మండలం ఇందిరానగర్‌లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్(బాలికలు) పాఠశాలలో ఘనంగా సియం రేవంత్ రెడ్డి చిత్రపటానికి విద్యార్థులతో పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు ప్రశాంత్ యాదవ్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం, ఇంటిని మరిపించేలా కొత్త డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంపు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, మహిళా సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇక నుండి ప్రజాపాలనలో నాణ్యమైన పౌష్టికాహారం అందనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు పంజాల అరవింద్, పట్టణ అధ్యక్షులు మొరె అజయ్, బొంకూరి కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు మేకల రాజ్ కుమార్, బాబాజీ, నాగరాజు, శనివారం తరుణ్, నాయకులు రామ్మోహన్, సంపత్, నిఖిల్, రాజేష్, అఖిలేష్, కార్యకర్తలుపాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా కాంటాలు, తూకం!

### మోసపోతున్న పత్తి రైతులు

### మద్దతు ధర కన్నా తక్కువ రేటుకు దళారులు కొనుగోలు

**ప్రజాపక్షం/ గొల్లపల్లి :** జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో చిల్వకోడూర్, చెందోలి, లక్ష్మి పూర్, దమ్మనపేట గ్రామాల్లో ఉన్న దళారులు మహారాష్ట్ర నుంచి వస్తున్న విక్రదారులు కుమ్మక్కైమై గ్రామాల్లో అమయకా రైతుల నుంచి దళారులు ఇష్టం వచ్చిన రేటుకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని. దళారులు విక్రదారులు కలిసి నిబంధనలకు విరుద్ధంగా తూకం చేసే కంట మాత్రం చిబ్బలు లేకుండా ఒక ప్రక్క బాట్లుకు తల్లు కట్టి మరో ప్రక్క గొనె సంచులు కట్టి తూకం చేస్తున్నారు.అయితే 60 కిలోల పత్తి 50 కిలోలు మాత్రమే అయితున్నాదని దళారులు మోసం చేస్తున్నారని ఎలాటి లైసెన్సు లేకుండా విక్రయిస్తున్నరాని పలువురు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ శాఖ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం వలన ఇది దళారులకు కలిసివస్తోందని పలువురు రైతులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ పత్తికి ఏడు వేల ఐదువందలు మద్దతు ధర నిర్ణయించినప్పటికీ అంతకు తక్కువ ధరకే రైతుల నుంచి దళారులు ఆరువేల మూడువందల లోపు మాత్రమే ధర చెల్లిస్తున్నారు. దళారులు పత్తిని సేకరిస్తున్నారు.రైతులు క్వింటాలకు వెయ్యి రూపాయల వరకు పైగా నష్టపోతున్నారు. కనీసం పంది నుంచి పన్నెండు క్వింటాళ్ల పత్తి దిగుబడి అవుతుండగా మద్దతు ధరలభించని కారణంగా ఎకరాకు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు రైతులు నష్టపోతున్నారని. పలువురు పత్తి రైతులకు నష్టం కలుగుతోందని అంటున్నారు. అయితే చాలామంది రైతులు తప్పనిసరి పరిస్థితిలో గత్యంతరం లేక దళారులకు పత్తి విక్రయించాల్సి వస్తోందని చెప్పుతువున్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి సేకరణ సీసీఐ ద్వారా నిర్వహిచాలని పత్తి రైతులు కోరుతున్నారు.

## నాణ్యమైన పత్తికే మద్దతు ధర

### అదనపుకలెక్టర్ అబ్దుల్ హమీద్



**ప్రజాపక్షం/ సిద్దిపేటప్రతినిధి:** సిద్దిపేట మార్కెట్‌యార్డు, కొండపాద మండలం దుద్దేడ స్వాతి జిన్నింగ్ మిల్లులో ప్రతి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ పత్తి పండించిన రైతులందరు దళారులను ఆశ్రయించకుండ నేరుగా ప్రభుత్వ నిబంధనల మేరకు పత్తిని ఇంటివద్దనే ఆరబెట్టి తేమ శాతం 8 నుండి 12 శాతం లోపు చూసుకొని మిల్లు వద్దకు వచ్చి సిసిఐ వారికి విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. తేమ శాతం 8 వుంటే 7521 రూపాయలు, 9శాతం ఉంటే 7445 రూపాయలు, 10 శాతం ఉంటే 7370 రూ, 11 శాతం ఉంటే 7925 రూ, 12 శాతం ఉంటే రూ.7220 చొప్పున ప్రభుత్వ మద్దతు ధర పొందవచ్చునన్నారు. పత్తి రైతులు పత్తిని అమ్మకానికి తెచ్చే ముందు విధిగా పట్టదారు పుస్తకం, జిరాక్స్‌కాపి, ఆదార్ కార్డు జిరాక్స్ కాఫీలను వెంట తీసుకోని రావాలన్నారు. మీ బ్యాంక్ ఆకౌంట్ ఆదార్ లింక్ ఉన్న అకౌంట్‌ను మాత్రమే పత్తి అమ్మకం డబ్బులు నేరుగా ఖాతాలో చేరుకోబడుతాయన్నారు. పత్తిరైతులు ఈ సూచనలు పాటించి మీ పత్తిని మద్దతు ధరకు అమ్ముకొని లాభాలు ఆర్జించాలన్నారు. పత్తి పంట వివరాలు తెలుసుకునేందుకు వ్యవసాయ మార్కెట్ శాఖ రైతుల సౌకర్యార్థం పత్తి వివరాలు అందించేందుకు వాట్సాఫ్ నెంబర్ 8897281111పొందుపర్చినట్లు తెలిపారు. దీంతో రైతుల పత్తి అమ్మకం, అర్హత తక్‌పట్టి వివరాలు చెల్లింపు స్థితి, సిసిఐ సెంటర్‌లో వేచియుండే సమయం మొదలగు వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు. రైతులు ఈ నెంబర్‌ను సేవ్ చేసుకొని వాట్సాప్ ద్వారా వినియోగించుకోవాలని సూచించారు.

## ఎస్‌జిటిలపై పనిభారం తగ్గించాలి

**ప్రజాపక్షం/అక్కన్నపేటః** అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)పై పని భారం పెరిగిపోతుందని,దీన్నీ తగ్గించాలని ఎస్‌జీటీ యూనియన్ మండలాధ్యక్ష,కార్యదర్శులు ధరావత్ మొగిళి,గజివెళ్ళి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో సమగ్ర సర్వేపై నిర్వహించిన శిక్షణ సదస్సులో ఎంపిడివో,ఎమ్మార్వోలకు పని భారం తగ్గించాలని ఎస్‌జీటీ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ప్రాథమిక పాఠశాలల్లో పనివేళలు గంట భోజన విరామం సమయం కలుపుకొని ఏడు గంటల పనివేళలు మాత్రమే ఉండాలని విద్యాశాఖ చట్టం సూచిస్తోందన్నారు. సమగ్ర సర్వేను యూనియన్ స్వాగతిస్తోందన్నారు.కాగా ఈ సర్వేను ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులతో కాకుండా జిల్లా పరిషత్ స్థాయి ఉపాధ్యాయులతో చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పారదర్శకంగా ఇంటింటి సర్వే

**ప్రజాపక్షం/అక్కన్నపేటః** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను గ్రామాల్లో పారదర్శకంగా చేపట్టాలని తహశీల్దార్ అనంతరెడ్డి, ఎంపిడివో జయరాం నాయక్ అన్నారు. మండలంలో ఈ నెల 6 నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేపై స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎన్యుమరేటర్స్,పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ, కుల సర్వేను విజయవంతం చేయాలన్నారు.ప్రతీ గ్రామంలో 150 ఇళ్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని,సర్వేపై కార్యదర్శులు,ఎన్యుమరేటర్స్ పూర్తి స్థాయిలో అవగాహన కల్గి వుండాలన్నారు.గ్రామాల్లో నిర్వహించే ఈ సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త చేపట్టాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో గుగులోతు రంగానాయక్,సీడీపీవో జయమ్మ,గిర్ధావర్లు యాదగిరి,సయ్యద్ జాహీద్,ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను బకాయి రూ.3.74లక్షలు వసూలు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం రామగుండం లోని సదానందం సినిమ థియేటర్ యజమాని నుంచి 3 లక్షల 74 వేల 703 రూపాయలను వసూలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రామగుండం కార్పొరేషన్ లో ఉన్న సదానందం సినిమా థియేటర్ ఆస్తి పన్ను గత 5 సంవత్సరాల నుండి చెల్లించని కారణంగా రామగుండం మున్సిపల్ కమిషనర్ ద్వారా వచ్చిన దరఖాస్తుకురామగుండం తహసీల్దార్ కుమార స్వామి ద్వారా సంబంధిత సినిమా థియేటర్ ప్రతినిధులకు నోటీసులు జారీ చేసి, ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో రెవెన్యూ శాఖ ఆస్తి నీ స్వాధీనం చేసుకుని వేలం నిర్వహిస్తుందని నోటీసులు జారీ చేయడంతో సినిమా థియేటర్ ప్రతినిధులు బకాయిలో ఉన్న ఆస్తి పన్ను 3లక్షల 74వేల 703రూపాయలను సోమవారం చెల్లించడం జరిగింది. ఇదే విదంగా ఇంకో (8) మంది రామగుండం కార్పొరేషన్ కి ఆస్తి పన్ను బకాయి ఉన్నారని వారికి కూడ తహసీల్దార్ రామగుండం నోటీసులు జారీ చేశారని వారు కూడ చెల్లించని పక్షం లో చట్టప్రకారం వారి ఆస్తులను రెవిన్యూ శాఖ ద్వారా స్వాధీన పర్చుకుని వేలం ద్వారా బకాయిలు వసూలు చెయ్యడము జరుగుతుంది. అని ఈ 8 మంది లో ఒక సినిమా థియేటర్ యజమాని హైకోర్టునూ ఆశ్రయించి స్టే పొందేందుకు ప్రయత్నం చేసినప్పటికీ సకాలంలో తహసిల్దార్ రామగుండం హై కోర్టు లో కౌంటర్ దాఖలు పర్చి వారికి స్టే రాకుండా కూడా అడ్డుకోవడం జరిగిందని అన్నారు.వారి వివరాలు 1.దేవప్ప కవిత టాకీస్ వారు 3448763, ఆస్తి పన్ను, 2.లోటస్ ఎంబీఏ కళాశాల వారు 1467845 రూపాయల ఆస్తి పన్ను, 3.నారాయణ సురేందర్ రెడ్డి రామిరెడ్డి గురువారెడ్డి 2407960 4. వీరాంజనేయ ఇండస్ట్రీస్ 1840006 రూపాయలు, 5.ఫణి జూ నియర్ కళాశాల 900013, 6. ముక్క నరసింహమూర్తి 2543229,7. శివారెడ్డి 1167350 రూపాయల, 8. కాసరి పాపయ్య 258546రూపాయల ఆస్తి పన్ను దీర్ఘ కాలికంగా జిల్లాలో వివిధ స్థానిక సంస్థలకు ఆస్తి పన్ను బకాయి ఉన్నాయన్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారు వీలైనంత త్వరగా చెల్లించగరని లేనిచో అందరి పై ఇలాగే రెవిన్యూ రికవరీ చట్టం ద్వారా పన్ను భాఖాయిలని వసూలు చేసేందుకు తహసిల్దార్‌లను రంగంలోకిదించుతానని కలెక్టర్ హెచ్చ రించారు.

## పాఠశాలల నిర్వహణపై హెడ్‌మాస్టర్లు దృష్టి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించేందుకు హెడ్ మాస్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం శ్రీ హర్ష పెద్దపెల్లి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని సమస్త స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు,మండల విద్య అధికారులకు, నోడల్ అధికారులకు ఎన్టిపిసిలో నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించే దిశగా పాటించాల్సిన పద్ధతులు , టీ.ఎల్.ఎం విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల సమర్థ నిర్వహణ స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుల పటిష్ఠ పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. పాఠశాలల్లో గుణాత్మక విద్య మెరుగుపరచడానికి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణ గురించి కీలకమైన సూచనలు కలెక్టర్ అందించారు. రాబోయే మూడు నెలల కాలంలో జిల్లాలో 80 శాతం మందికి పైగా విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి,జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేయండి



**ప్రజాపక్షం/గంభీరావుపేట :** వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్ రికార్డ్స్, వర్టికల్స్ అమలు తీరు, స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బం ది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సి.డి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏస్పీ మాట్లాడుతూ. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీస్‌ఆధికారులు తమకు కేటాయించిన గ్రామాలపైపూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరుచు పర్యటిస్తు ప్రజలతో సత్సంబంధాలుకలిగి ఉండాలని ఏదైనా సంఘటన జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. డిఎస్పీ చంద్రశేకర్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ శివకుమార్ సిబ్బంది ఉన్నారు.

## బకాయి చెల్లించి పరిశ్రమను ప్రారంభించాల్సిందే



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వస్త్ర పరిశ్రమకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించి పరిశ్రమను ప్రారంభించాలని చేనేత పవర్లూమ్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి అన్నారు. సోమవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన చేనేత పవర్లూమ్ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలోమాట్లాడారు. సిరిసిల్ల పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ అనేక రకాల కారణాలతో గత పది మాసాలుగా పరిశ్రమ పూర్తిగా బంధుపడి ఉపాధి లేని కారణంగా కార్మికులు వారి కుటుంబాలను పోషించుకోలేక గత్య ంతరం లేక సుపారు ఇప్పటికే 14 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇలాంటివి పునరావృతం కాకుండా పరిష్కారం కోరుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు ఆసాములు యజమానులు జే.ఏ.సీ.గా ఏర్పడి అన్ని రకాల ఆందోళనలు పోరాటాలు చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఒక్కొక్కటిగా అన్నిరకాల సమస్యలు పరిష్కారంచేస్తుందని, దానిలో పరిశ్రమకు 50శాతం విద్యుత్ సబ్సిడీ కూడా 25 హెచ్.పీలు ఇవ్వడానికి సానుకూలంగాప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్లనియోజకవర్గఇన్చార్జికేకే మహేందర్‌రెడ్డి తెలిపారన్నారు. చేనేతపవర్‌లోమ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రమౌళి, నాయకులు కొంక విజయ్, జంగం జనార్ధన్, రాజు, సోమ నాగరాజు, లింగం, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# శ్రమదోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలేవి?




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** హమాలీ కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఐటియుసి హమాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ అధికారిని రజితకి వినతి పత్రం అందజేశారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, నాయకులు సోమ నాగరాజు బచ్చుపల్లి శంకర్ మాట్లాడుతూ గతంలో ఐకెపి సొసైటీలలో లారీ లోడ్ చేసి తాడు కడితే తాడు మాముల పేరుతో ప్రతి టన్నుకు ప్రభుత్వమే నేరుగా హమాలీ కార్మికులకు 40 రూపాయలు చెల్లించేదని ప్రస్తుతం ఆ స్థానంలో కాంట్రాక్టర్లను తీసుకురావడం ద్వారా కాంట్రాక్టర్లు ఇప్పటివరకు హమలి కార్మికులకు ఎటువంటి తాడుమాముల ఇస్తలేదని ప్రభుత్వం నుండి మాత్రం కాంట్రాక్టర్లు తాడమాముల పేరుతో ప్రభుత్వం నుండి టెండర్లు వేసి కోట్లాది రూపాయల ప్రజాధనం ఎగదొబ్బుతున్నారని, కానీ కాంట్రాక్టర్లు వచ్చినప్పటి నుండి హమాలీ కార్మికులకు ఎటువంటి నయా పైసా తాడుమాముల చెల్లించడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు ఈ విషయంపై జోక్యం చేసుకొని ఈ దఫా నుండి తాడుమాముల వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని లేని యెడల ఇకముందు జిల్లాలోని హమాలి కార్మికులు ఎవరు కూడా తాడు తాడు కట్టరని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బట్టు రాయమల్లు, దేవేందర్, ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## నేషనల్ హైవే 365 బిసి మార్చాలి

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల నుండి వస్తున్న నేషనల్ హైవే 365 బిసి మార్చాలని భూ నిర్వాసిత బాధితులు సోమవారం కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి లను కలిసి వినతపత్రం అందజేసారు. వారు మాట్లాడుతూ గతంలో సిరిసిల్ల మొదటి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా తాము విలువైన భూములు కోల్పోవడం జరిగిందని, మళ్లీ ఇప్పుడు రెండవసారి నేషనల్ హైవే 365 బి రోడ్డు ఏర్పాటులో భాగంగా గృహ సముదాయాలను, భూములను భారీ స్థాయిలో కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు అతి ముఖ్యమైన కలెక్టర్ ఆఫీస్, ఎస్పీ ఆఫీస్, నర్సింగ్ కాలేజ్, సబ్ రిజిస్టర్ ఆఫీస్ మొదలగు కార్యాలయాలు నూతనంగా నిర్మించబోవు నేషనల్ హైవే 365 బి రోడ్డుకు అవతల వైపుకు వెళ్ళడంతో ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంటుందన్నారు. శివారుప్రాంతాలనుండి నేషనల్ హైవే 365బి రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంటు మార్చి సిరిసిల్ల పట్టణ ప్రజలకు మరియు భూ నిర్వాసితులకు తోడ్పాటునందించాలని కొరారు. ఈ సందర్భంగ కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి నేషనల్ హైవే 365 బి అలైన్మెంట్ మార్పు విషయంలో తగిన సహాయక చర్యలు అందిస్తామని భూ నిర్వాసితులకు తెలిపారు.

## సహకార సంఘం భవనాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ్మ



**ప్రజాపక్షం/మెదక్/కౌడిపల్లి:** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని మహమ్మద్ నగర్ గేటు సమీపాన నూతనంగా రూ.54 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని సోమవారం సొసైటీ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన భవన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ ముఖ్యఅతిథిగా హాజరై మెదక్ ఎంపి రఘునందన్‌రావు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మీరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ కరుణ, జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, తాలుకా ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, ఏడిఏ పుణ్యవతి, రాష్ట్ర నాయకులు చిలుముల శేష సాయి రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ వాళ్దాస్ మల్లేష్ గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ చిలుముల చిన్నంరెడ్డి, మాజీ ఎంపిపి రాజు నాయక్, మాజీ వైస్ ఎంపిపి నవీన్ కుమార్ గుప్తా, ఎంపీడీవో శ్రీనివాస్ తాసిల్దార్ ఆంజనేయులు ఆర్ఐ శ్రీహరి, ఏవో స్వప్న, ఏ ఈ కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సారారామగౌడ్, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కాజీపేట రాకేష్, నాయకులు బాన్సువాడ మహిపాల్‌రెడ్డి, ఎల్లం, గుంజరి ప్రవీణ్, వీరయ్య, సొసైటీ సీఈవో దుర్గగౌడ్, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

## సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**ప్రజాపక్షం/గజ్వేల్:** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్ లోని ఈశ్వర సాయి, గొల్లపల్లి లోని శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీలలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ ంవటేరు యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, మహంకాళి శ్రీనివాస్ గుప్త, నర్సింహారెడ్డి, హరినాథ్ గుప్త, రామా గౌడ్, యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందాలని కోరారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నట్లు వివరించారు.

## మున్సిపల్ ట్యాక్స్ సకాలంలో వసూలు చేయాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మున్సిపల్ శాఖలో రెవెన్యూ పెంచేలా కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులు ఎస్పై బిల్ కలెక్టర్లతో డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ సమక్షంలో సమావేశం నిర్వహించి రోజువారి రెవెన్యూపై అడిగి తెలుసుకున్నారు. ట్యాక్స్‌లు రోజు ఎంతవరకు వసూలు చేస్తున్నారు మున్సిపల్‌లో రోజువారిగా ఎంత డిమాండ్ ఉందనే విషయాలపై చర్చించారు. డిమాండ్ మేరకు ట్యాక్స్‌లను వసూలు చేయాలని ట్యాక్స్ వసూలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు.

## గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ షురూ...



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ శివారులో గల గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాలరావు, సీడీసీ చైర్మెన్ షాదుల్లా, సభ్యులు అనితాసింగ్, భాస్కర్‌రెడ్డిలు గానుగకు ప్రత్యేక పూజలు నిర్వహించి చెరుకు క్రషింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ చెరుకు పండించిన రైతుల సౌకర్యార్థం ఈ యేడు చెరుకు క్రషింగ్‌ను ప్రారంభించామని, ఈ యేడు 4 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్‌ను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేన్ జనరల్ మేనేజర్ వెంగల్‌రెడ్డి, జీఎం ఇంజనీరింగ్ సెక్షన్ రాజాబాబు, సుబ్బారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సుగుణ, భూషణ్‌రావు, ముత్యాల నాయుడు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## చదువు కోసం ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/బోథ్:** బోథ్ మండల కేంద్రానికి చెందిన మౌనిక ఇటీవల విడుదలైన బీఎస్సీ నర్సింగ్ ఫలితాలలో ఆర్మూర్ లోని ప్రైవేటు కళాశాలలో సీటు సాధించింది. కానీ విద్యను అభ్యసించేందుకు రూపాయి కూడా పెట్టలేని స్థితిలో ఉన్న ఆమెకు తండ్రి కానీ అన్నదమ్ములు కానీ లేరు. తల్లి రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న వారికీ బోథ్ గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ వారు ఆమె చదువుకు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఆమె చదువుకు ఉపయోగపడే విధంగా రూపాయలు 10 వేలను బొడ్డు రాజు, నీళ్ళ లింగారెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది. వారికి అన్నలా తోడుంటామని భరోసా ఇచ్చారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని అనుకున్నది సాధించాలని అభినందించారు.

# మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది పుస్తకమే

## చరిత్ర సంస్కృతిని చెప్పేది గ్రంథాలయం

ప్రతిఒక్కరికీ పుస్తకం విలువ తెలవాలి

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి దామోదర రాజనర్సింహ్మ



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** సమాజంలో ఒక వ్యక్తిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది పుస్తకమేనని, ప్రతి ఒక్కరికి పుస్తకం యొక్క విలువ తెలవాలని, గత చరిత్ర, సంస్కృతి తెలిపేది గ్రంథాలయమేనని, మన లైబ్రరీ మన సరస్వతీ మాత అని గౌరవించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ వెల్లడించారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా చిలుముల సుహాసిని రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ, ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, శేషాసాయిరెడ్డిలు హాజరయ్యారు. ముందుగా గ్రంథాలయ చైర్మన్ గా చిలుముల సుహాసిని రెడ్డి మంత్రి సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. పుష్పగుచ్ఛాలతో శాలువాలతో మంత్రి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సుహాసిని రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ్మ మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమ సమయంలో సామాజిక చైతన్యానికి, ప్రజల మార్పుకు గ్రంథాలయాలు ఉపయోగపడ్డాయన్నారు. ఐదు శాతం అక్షరాస్యత ఉన్న సమయంలో న్యాయం, ధర్మం గెలిచిందంటే ఒక చదువుతోనే సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరిలో మన అనే భావన కంటే నేను అనే భావననే ఎక్కువైందని, స్వార్థం, ద్వేషం, ఈర్ష మొదలయ్యాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సంస్కృతి, సంస్కారం, మంచి విద్యను అందించాలని సూచించారు. పిల్లలకు పూర్వీకుల చరిత్ర, త్యాగధనుల చరిత్ర, మన చరిత్ర చెప్పేది పుస్తకాలేనని తల్లిదండ్రులు తెలియజేయలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రంథాలయల అభివృద్ధి కృషి చేస్తుందని, మెదక్ జిల్లాలో ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అంతకుముందు రాష్ట్ర గ్రంథాలయల సంస్థ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో గ్రంథాలయాలకు నిధులు లేక మూలన పడ్డాయన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ గ్రంథాలయాలకు పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళల పట్ల చిత్త శుద్ధితో ఉందని, అందుకే గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి నియమించిందన్నారు. మెదక్‌జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, యువత చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ్మ అండదండతో గ్రంథాలయాన్ని సుహాసినిరెడ్డి అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావ్, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌లు మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు బాటలు వేసేవి గ్రంథాలయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

**జ్ఞాన తెలంగాణకు ముఖ్యమంత్రి కృషి**

32 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మరిపురాని రోజు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి అస్తవ్యస్తంగా తయారైన తెలంగాణ రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు, యువతకు బంగారు బాటలు వేసేందుకు, విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని జ్ఞాన తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి తెలిపారు. 32 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మరుపురాని రోజని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ పదవీ రావడానికి కృషిచేసిన మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండ సురేఖ, సిఎం రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావుకు సుహాసిని రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నార్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/మెదక్/నిజాంపేట్:** నిజాంపేట మండలంలోని నార్లాపూర్ గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, మెదక్ ఎమ్మెల్యే మైనాంపల్లి రోహిత్ రావు సోమవారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల చేతిలో రైతులు మోసపోవద్దని లక్ష్యంతో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని ప్రజలు తప్పనిసరిగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమర్ సేనా రెడ్డి, మారుతి, పంజా మహేందర్, నసిరుద్దీన్, శ్యామలమహేష్, కొమ్మాట సత్యనారాయణ, రాజేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి,నాగరాజు ఏపీఎం రాములు లక్ష్మి విఓఏ లు ఓబి లు గ్రామ మహిళలు రైతులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి ఈ నెల ఆరవ తేదీ నుండి ప్రారంభమయ్యే సర్వే కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, పంచాయితీ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సర్వే నిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన మాత్రం ధర్మాబాయి తన భర్త పేరిట ఆర్ ఒఎఫ్ఆర్ పట్టా భూమి ఉందని, ఆయన మరణించినందున తన పేరిట మార్పు చేయాలని, సిర్పూర్ టి మండలం చిలపెల్లి గ్రామానికి చెందిన యాదగిరి గోపాల్ తనకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ఉల్లిపెట్ట డోర్లీ గ్రామానికి చెందిన బొర్కుటి అనుష్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి తన టిసి, మెమో ఇప్పించాలని కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ విటి అబ్రహం

# ఆశయాలను కొనసాగిద్దాం



**ప్రజాపక్షం/మంచిర్యాల/మందమర్రి:** కామ్రేడ్ వి.టి అబ్రహం 41వ వర్ధంతిని కార్మికుల సమక్షంలో ఎఐటియుసి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ ఏరియా జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ మాట్లాడుతూ కామ్రేడ్ విటి. అబ్రహం ఆశయాలను కార్మిక వర్గం కొనసాగించాలని కార్మిక హక్కులను కాపాడుకోవాలని అన్నారు. కామ్రేడ్ విటి. అబ్రహం చిత్రపటానికి సీనియర్ ఎలక్ట్రిషియన్లు అప్పాని నాగయ్య కొట్టే వెంకటస్వామి పూలమాల సమర్పించారు. ఏరియా కార్యదర్శి శర్మ అధ్యక్షతన ఏరియా వర్క్ షాప్ లో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దపల్లి బానయ్య తిరుపతి పారిపల్లి రాజేశం, ఆంటోనీ దినేష్,వెంకటేష్, బైరిపోషం పాల్గొన్నారు.

## జిఎంను సన్మానించిన

# ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/మంచిర్యాల/శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ ను సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం కార్మికుల సమస్య అంశాల పరిష్కారం, శ్రీరాంపూర్ ఏరియాలో రక్షణతో కూడిన ఉత్పత్తిని నిర్దేశించిన బొగ్గు లక్ష్యాలు, ఏరియాలో వివిధ గనుల జీవితకాలం, వాటి పెంపు కోసం తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, ఏరియా కార్యదర్శిలు సంపత్, ప్రసాద్ రెడ్డి, నాగభూషణం, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజన్స్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మురళీ చౌదరి, లక్ష్మ ణ్, సదానందం, నరసింహారావు, సదానందం, రామచందర్, విజయల, తిరుపతి, మైనింగ్ స్టాప్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ పాల్గొన్నారు.

## సమస్యల వలయంలో సర్కార్ పాఠశాల విద్యారులు

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వానికి కమీషన్లపై కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై లేదని ప్రభుత్వం పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని కోటగల్లీ ప్రభుత్వ బాలికల పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మాట్లాడారు. పెండింగ్‌లోని మధ్యాహ్న భోజన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రభుత్వ పాఠశాలల దుస్థితి మారడం లేదని, నిజామాబాద్ కోటగల్లీ బాలికల పాఠశాల అంటే ఒకప్పుడు మంచి పేరుండేదని ఇప్పుడు పాఠశాలలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు.తరగతి గదులకు కిటికీలు లేనందున కోతుల బెడద ఉన్నట్లు విద్యార్థులు తెలిపారని గతంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఒక విద్యార్థిని చనిపోయిందని ప్రస్తుతం కూడా కరెంట్ వైర్లు వేలాడటంపై అధికారులపై మండిపడ్డారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ఇష్టరాజ్యంగా సెలవులు తీసుకోవడం, తరగతి గదుల్లో లేకపోవటం పిల్లల హాజరు పట్టిక రెండు రోజుల నుండి హాజరు వేయకపోవటంపై మండిపడ్డారు. ప్రభుత్వానికి కాంట్రాక్టర్లపై అధికార పార్టీ నాయకులపై ఉన్న ప్రేమ పేద విద్యార్థుల పట్ల లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ంఎఈఓ సాయరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీ నారాయణ, నాయకులు మఠం పవన్, మాయావర్ కృష్ణ, బాబీసింగ్, పల్నాటి కార్తీక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు అతిథి అధ్యాపకులు వినతి

**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న అధ్యాపకులకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఎమ్మెల్యే వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో 22 మంది అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నామని కనీస వేతనం అమలు చేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, అధ్యాపకులకు కనీస వేతనం అమలు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరగా సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్ రెడ్డి, వినోషన్, భీమయ్య, రమేష్, అనిల్, మనోహర్, సిద్దలక్ష్మి, ఫాతిమా, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఇందల్వాయి మండలం సిర్నాపల్లి, ధర్పల్లి మండల కేంద్రంతో పాటు హోన్నాజీపేట్, సీతాయిపేట్, సిరికొండ, పెద్దవాల్గోట్, గడ్కోల్ ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సోమవారం సందర్శించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటాదివెంట లారీలలో లోడ్ చేయించి కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. రైతులు ధాన్యం తీసుకవచ్చిన వెంటనే తూకం జరిపించాలని నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకవచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ సాయగౌడ్ తదితరలుఉన్నారు.

## నేటి ప్రజావాణికి 45 పిర్యాదులు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి ఐఐసి జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించడింది. ఈ కార్యక్రమానికి 46 పిర్యాదులు అందాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ డిఆర్ఓ పద్మజా రాణి లకు విన్నవించారు. తమ సమస్యలపై తక్షణ పరిష్కారాలు చూపాలని ఆర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమానిక పెద్ద సంఖ్యలో పిర్యాదుదారులు హాజరైయ్యారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలను వివరంగా వినిపించిన ప్రతి పిర్యాదుదారునివారి అర్జీలను ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం పిర్యాదులు ఆన్‌లైన్ లో నమోదు ఏయడం వాటిని పర్యవేక్షించడం సకాలంలో పరిష్కరించడం తప్పని సరి అని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన పిర్యాదులను ప్రతి శాఖల పరంగా వారికి చెందిన ప్రతినిదులైన అధికారులు తప్పని సరిగా అప్‌డేట్ చేయాలని పెండింగ్ పిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా పిర్యాదుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఆర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఏ శాఖ అయినా తమకు సంబందించిన సమస్యలపై సత్వరమే స్పందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రోహిత్ ఔట్.. కెప్టెన్‌గా బుమ్రా!



**సొం**తగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసిన టీమిండియా.. మరో రసవత్తర సిరీస్‌కు సిద్ధమవుతోంది. కివీస్‌తో వరుసగా మూడు టెస్ట్‌ల్లో ఓడి క్లీన్ స్వీప్ గురై ఘోర అవమానాన్ని మూటగట్టుకున్న రోహిత్ సేన.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఆస్ట్రేలియా వర్సెస్ భారత్ ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి తెరలేవనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) 2025 ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్ గెలవడం ఇరు జట్లకు కీలకం. ప్రస్తుతం డబ్ల్యుటిసి పాయింట్స్ ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కివీస్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు 70+ విజయాల శాతంతో అగ్రస్థానంలో ఉన్న టీమిండియా హ్యాట్రిక్ పరాజయాలతో 58.33 శాతంతో రెండో స్థానానికి పడిపోయింది. ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కించుకోవాలంటే ఆసీస్ గడ్డపై టీమిండియా 4 మ్యాచ్‌లు గెలవాలి. ఆసీస్ గడ్డపై ఆ జట్టును నాలుగు మ్యాచ్‌ల్లో ఓడించడం చాలా కష్టం. కాకపోతే గత రెండు ఆసీస్ పర్యటనల్లో భారత్ విజేతగా నిలిచింది. మరోసారి అలానే సమష్టిగా రాణించి.. ఆసీస్ గడ్డపై భారత్ విజయం సాధించాల్సిన అవసరం ఉంది.

**రోహిత్ శర్మ ఔట్..**

న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాభావాన్ని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చాలా సీరియస్‌గా తీసుకున్నాడు. తప్పిదాలపై సీరియస్‌గా ఫోకస్ పెట్టాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. వ్యక్తిగత పనులతో తొలి మ్యాచ్ ఆడలేనని ఇప్పటికే రోహిత్ శర్మ.. బిసిసిఐకి సమాచారమిచ్చినట్లు వార్తలు వచ్చాయి. అతని గైర్హాజరీలో జస్‌ప్రీత్ బుమ్రా టీమిండియాను నడిపించనున్నాడు. రోహిత్ శర్మ స్థానంలో అభిమన్యు ఈశ్వరన్.. యశస్వి జైస్వాల్‌తో కలిసి ఓపెనింగ్ చేయనున్నాడు. శుభ్‌మన్ గిల్ మూడో స్థానంలో ఆడనున్నాడు. గత ఆసీస్ పర్యటనలో శుభ్‌మన్ గిల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 51 సగటుతో 259 పరుగులు చేశాడు. మరోసారి అతను సత్తా చాటాల్సిన అవసరం ఉంది.

**కోహ్లీ బ్యాటింగ్ కీలకం..**

ఆసీస్ గడ్డపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలకం కానున్నాడు. ప్రస్తుతం అతను పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నా.. ఆసీస్ గడ్డపై మెరుగైన రికార్డ్ ఉంది. మళ్లీ ఫామ్ అందుకునేందుకు అతనికి ఈ సిరీస్ ఉపయోగపడనుంది. నాలుగో స్థానంలో కోహ్లీ బ్యాటింగ్ చేయనున్నాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమై.. తుది జట్టులో చోటు కోల్పోయిన కేఎల్ రాహుల్‌కు ఆసీస్ గడ్డపై అవకాశం దక్కనుంది. అతని స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సర్ఫరాజ్ ఖాన్ దారుణంగా విఫలమయ్యాడు. దాంతో అతని స్థానంలో అనుభవం కలిగిన రాహుల్‌కు మళ్లీ అవకాశం ఇవ్వనున్నారు. రాహుల్ ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది.

**పంత్ చెలరేగితే..**

న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన రిషభ్ పంత్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం అతను అప్‌ది ఆర్డర్‌లో కూడా ఆడొచ్చు. గత ఆసీస్ పర్యటనలో పంత్ మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు. గబ్బా వేదికగా జరిగిన మ్యాచ్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఐదు టెస్ట్‌ల్లో ఒక సెంచరీతో పాటు 99, మరో రెండు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ అసాధారణ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అశ్విన్ స్థానంలో సుందర్‌కు తుది జట్టులో చోటు దక్కనుంది. రవీంద్ర జడేజాతో కలిసి అతను స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా.. మహమ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్‌లతో కలిసి పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

**ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్ ఆడే భారత తుది జట్టు(అంచనా):**

**యశస్వి జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, మహమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్.**

# ఓడిపోయే మ్యాచ్‌ను గెలిపించిన సన్‌రైజర్స్ కెప్టెన్!



**స**న్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్, ఆస్ట్రేలియా సారథి ప్యాట్ కమిన్స్ మరోసారి సంచలన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. సొంతగడ్డపై పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో అసాధారణ బ్యాటింగ్‌తో ఆసీస్‌కు శుభారంభం అందించాడు. ఈ సిరీస్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో లోయరార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ప్యాట్ కమిన్స్ 31 బంతుల్లో 4 ఫోర్లతో 32 పరుగులతో అజేయంగా నిలిచి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 46.4 ఓవర్లలో 203 పరుగులకు కుప్పకూలింది. బాబర్ ఆజామ్(37), మహమ్మద్ రిజ్వాన్(44), నసీమ్ షా(40) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, ఆడమ్ జంపా రెండేసి వికెట్లు పడగొట్టారు. సీన్ అబాట్, మార్నస్ లబుషేన్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా 33.3 ఓవర్లలో 8 వికెట్లకు 204 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ప్యాట్ కమిన్స్(32 నాటౌట్)తో పాటు స్టీవ్ స్మిత్(44), జోష్ ఇంగ్లిస్(49) టాప్ స్కోరర్లుగా నిలిచారు. పాక్ బౌలర్లలో హ్యారీస్ రౌఫ్ మూడు వికెట్లు తీయగా.. షాహీన్ షా అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టాడు. నసీమ్ షా, మహమ్మద్ హస్నైన్ తలో వికెట్ తీసారు. లక్ష్యఛేదనకు దిగిన ఆసీస్.. పాకిస్థాన్ బౌలర్ల ధాటికి తడబడింది. 185 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. ఈ పరిస్థితుల్లో మిచెల్ స్టార్క్‌తో కలిసి ప్యాట్ కమిన్స్ పోరాడాడు. తీవ్ర ఒత్తిడిలో అసాధారణ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. స్ట్రైకింగ్ ఎక్కువగా తీసుకొని విజయానికి కావాల్సిన 19 పరుగులు జోడించి గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు. ప్యాట్ కమిన్స్ సంచలన బ్యాటింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఖుషి అవుతున్నారు. ఐపిఎల్ 2025 మెగా వేలం నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్యాట్ కమిన్స్‌తో పాటు హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ నితీష్ కుమార్ రెడ్డిలను రిటైన్ చేసుకున్న విషయం తెలిసిందే. క్లాసెన్‌ను రూ. 23 కోట్లకు అట్టిపెట్టుకున్న సన్‌రైజర్స్ ప్యాట్ కమిన్స్‌ను రూ. 18 కోట్లకు రిటైన్ చేసుకుంది. అభిషేక్ వర్మ, ట్రావిస్ హెడ్‌లను రూ. 14 కోట్లకు తీసుకుంది. నితీష్ కుమార్ రెడ్డిని రూ. 6 కోట్లకు అట్టిపెట్టుకుంది.




## ముంబైలో 'రామాయణ్' షూటింగ్

**బా**లీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ రాముడిగా, హీరోయిన్ సాయి పల్లవి సీతగా బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ రామాయణ్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్ యాక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాలో సన్నీ డియోల్, రకుల్, లారా దత్తా వంటి ప్రముఖ నటీనటులు కూడా నటిస్తున్నారు. ఐతే, ఈ సినిమా షూటింగ్ మొదలైన కొద్దిరోజుల్లోనే ఫోటోస్ లీక్ అయ్యాయి. దీంతో, మేకర్స్ ప్రస్తుతం ముంబైలో ఇండోర్ షూటింగ్ చేస్తున్నారు. ఐతే, ఈ నెల నాలుగో వారం నుంచి జరగబోయే కొత్త షెడ్యూల్ లో సాయి పల్లవి పై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. ఈ సన్నివేశాలు సినిమాలోనే కీలకం అని, ముఖ్యంగా సాయి పల్లవి నటనను ఎలివేట్ చేసే ఈ సీన్స్ తో ఆమె నటన స్థాయి మరో మెట్టుకు ఎదుగుతుందని తెలుస్తోంది. అన్నట్టు కన్నడ స్టార్ హీరో యష్ ఈ మూవీ ప్రొడక్షన్ లో కూడా భాగమయ్యారు. ఆయన సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. పవిత్ర ఇతిహాసం రామాయణం ఆధారంగా రాబోతుంది.



## విజయ్ దేవరకొండ సినిమాలో హాలీవుడ్ నటుడు?

**శ్యా**మ్ సింగ రాయ్ ఫేమ్ 'రాహుల్ సంకృత్యాన్' దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో హాలీవుడ్ సినిమా 'ది మమ్మీ'తో పాపులరైన ఆర్నాల్డ్ వోస్లూ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. 1854 78 మధ్య కాలంలో జరిగే ఈ కథలో విజయ్ దేవరకొండ పాత్ర తర్వాత ఆయన క్యారెక్టర్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని టాక్. ఆర్నాల్డ్ వోస్లూ లాంటి స్టార్ విజయ్ దేవరకొండ సినిమాలో నటిస్తే కచ్చితంగా ఈ సినిమాకి చాలా బాగా ప్లస్ అవుతుంది. కాగా ఈ మూవీ షూటింగ్ 2025 జనవరి నుంచి స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. 'రాహుల్ సంకృత్యాన్' దర్శకత్వంలో న్యాచురల్ స్టార్ నాని హీరోగా వచ్చిన శ్యామ్ సింగ రాయ్ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దీంతో, విజయ్ దేవరకొండ సినిమా పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.




## నితిన్ 'తమ్ముడు' రిలీజ్ .. ఎప్పుడంటే?

**టా**లీవుడ్ హీరో నితిన్ ప్రస్తుతం వరుస సినిమాలను తెరకెక్కిస్తూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే దర్శకుడు వెంకీ కుడుముల డైరెక్షన్‌లో 'రాబిన్‌హుడ్ అనే సినిమాను తెరకెక్కిస్తున్నాడు నితిన్. ఈ సినిమాను డిసెంబర్‌లో రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. ఇక ఈ సినిమాతో పాటు మరో డైరెక్టర్ శ్రీరామ్ వేణు దర్శకత్వంలోనూ నితిన్ 'తమ్ముడు' అనే సినిమాలో నటిస్తున్నాడు. అయితే, తాజాగా 'తమ్ముడు' సినిమా నుండి ఓ సాలిడ్ అప్డేట్‌ను మేకర్స్ వెల్లడించారు. 'తమ్ముడు' సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ లాక్ చేశారు. ఈ సినిమాను మహాశివరాత్రి కానుకగా రిలీజ్ చేయబోతున్నట్లుగా చిత్ర యూనిట్ తెలిపింది. ఈ మేరకు ఓ పోస్టర్‌ను కూడా వారు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌తో 'తమ్ముడు' మూవీపై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అవుతోంది. ఇక ఈ సినిమాలో లయ నితిన్ సోదరి పాత్రలో నటిస్తోంది. దీంతో ఈ సినిమాలో ఎమోషన్ ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయమని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో వర్ష బొల్లమ్మ హీరోయిన్‌గా నటిస్తుండగా దిల్ రాజు ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# నేడు హైదరాబాద్‌కి రాహుల్ గాంధీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుల గణన అంశంపై జరిగే సమావేశంలో పాల్గొనేందుకు ఏఐసిసి అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లి లోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగే 'కుల గణన, కుటుంబ సర్వే' సమావేశంలో రాహుల్ పాల్గొననున్నారు. ఈ సమావేశంలో సుమారు ఒక గంట పాటు మేధావులతో, కుల సంఘాలు, విద్యార్థి, సంఘాల నాయకులతో ఆయన చర్చించనున్నారు. కుల గణనపై మేధావులు, ప్రముఖుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటారు. అలాగే కుల గణన ద్వారా జరిగే ప్రయోజనాలను, దీనిపైన కాంగ్రెస్ పార్టీ వైఖరి తదితర అంశాలను కూడా రాహుల్ వివరిస్తారు. ఈ సమావేశంలో కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, సలహాదారులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, తదితరులు సుమారు నాలుగు వందల మంది ప్రతినిధులు పాల్గొననున్నట్టు టిపిసిసి తెలియజేసింది.

**రాహుల్ షెడ్యూల్ ఇదే :** రాహుల్‌గాంధీ ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రం 4:45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బోయినపల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రానికి వస్తారు. సాయంత్రం 5:30గంటలకు సమావేశాన్ని నిర్వహించి, సమగ్ర కులగణనపై పలువురి అభిప్రాయాలను తీసుకోనున్నారు. అనంతరం రాత్రి 7:10 గంటలకు రాహుల్‌గాంధీ తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు.

**గాంధీ ఐడియాలజీ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన మహేష్ కుమార్**

రాహుల్‌గాంధీ పర్యటన నేపథ్యంలో బోయిన్‌పల్లి లోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో ఏర్పాట్లను టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం, పి సిసి అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ నియమితులైన తర్వాత రాహుల్‌గాం ధీ మొదటి సారి హైదరాబాద్‌కు రానున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తు న ఏర్పాట్లు చేసింది. బేగంపేట నుంచి బోయిన్‌పల్లి వరకు సుమారు 8 కిలోమీటర్ల వరకు భారీ కటౌట్లను, వాల్‌పోస్టర్లను, ఫ్లెక్సీలను, స్వాగత తోరణాల ను ఏర్పాటు చేశారు. ఏర్పాట్ల అంశంపైన ఇది వరకే సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెంది న కాంగ్రెస్ నాయకులతో సమావేశమై తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# కుప్పకూలిన మిగ్-29 విమానం

**ఆగ్రా:** ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో మిగ్-29 యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అప్రమత్తమైన పైలట్ కిందకు సురక్షితంగా బయట పడ్డారు. విన్యాసాల కోసం పంజాబ్‌లోని అదంపూర్ నుంచి బయల్దేరిన ఈ ఫైటర్ జెట్ ఆగ్రా వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కుప్పకూలిన చోట విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. మిగ్-29 విమానం ఇలా కుప్పకూలిన ఘటనలు గతంలోనూ జరిగాయి. సెప్టెంబర్ 2న రాజస్థాన్‌లోని బార్మేర్‌లో శిక్షణ నేపథ్యంలో మిగ్- 29 ఫైటర్ జెట్ కుప్పకూలింది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్ ఆ విమానం కూలడానికి ముందే సురక్షితంగా బయటపడ్డారు.

## ఆదాయం పెంపుపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

పాటు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దుదిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ జాయింట్ వెంచర్స్‌లో విలువైన ఆస్తులు ఉన్నాయని ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్లి వివాదాలు సృష్టిస్తున్నారని, ఈ అంశంపై నలుగురు ఉన్నతాధికారులతో కమిటి ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, లా సెక్రటరీలతో కమిటి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటి సమావేశమై వారంలోగా సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. కాలుష్యం సమస్య ఉన్న పరిశ్రమల నిర్వాహకులు తాము నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని సబ్ కమిటికి విజ్ఞప్తులు చేశారు. పరిశ్రమల యజమానుల విజ్ఞప్తులు పరిశీలించి వారు ఓఆర్ఆర్ బయట పరిశ్రమలు స్థాపించి ముందుకు వెళ్లేలా సహకరించండి, పరిశ్రమలను ప్రోత్సహించాలని హైదరాబాద్ నగరం లో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ అధికారులను సబ్ కమిటి సభ్యులు ఆదేశించారు. మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెగ్యులర్‌గా జరుగుతున్న ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియపై సబ్ కమిటి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. ముందుగా కొంత బాగాన్ని వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు గరిష్ట ఆదాయం సమకూరేలా ముందుకు వెళ్లాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. కాగా రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల స్థితిగతులను సబ్ కమిటి ఈ సందర్భంగా సమీక్షించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటి ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ అవకాశాలతో పాటు ఆర్థిక చేయూత లభిస్తుందని అధికారులకు వివరించారు. సబ్ కమిటి సమావేశంలో చర్చించిన అంశాలు మినిట్స్ రూపంలో నమోదు చేయాలని, మరో వారంలో జరిగే సమావేశానికి అధికారులు యాక్షన్ □క్షన్ రిపోర్టుతో సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె. రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, సిసిఎల్ఎ చీఫ్ సెక్రెటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హౌసింగ్ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## అదుపుతప్పి లోయలోకి..

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. బస్సు శిథిలాల నుంచి సహాయక సిబ్బంది క్షతగాత్రులను వెలికి తీసే దృశ్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఘటనపై మేజిస్టీరియల్ దర్యాప్తునకు ఆదేశించారు. పూరి, అల్మోరా అసిస్టెంట్ రీజినల్ ట్రాన్స్‌పోర్టు అధికారులను సస్పెండ్ చేశారు. కాగా, ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని ఆమె ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు కూడా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని మోదీ ప్రకటించారు. సహాయక చర్యలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించాలని స్థానిక అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షలు, గాయబడిన వారికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. క్షతగాత్రులను రామ్‌నగ్‌లో సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. నలుగురు పరిస్థితి విషమంగా ఉంది. అందులో ముగ్గురిని హెలికాప్టర్ ద్వారా రిషికేషన్‌లో ఎయిమ్స్‌కు తరలించారు. మరొకరిని హల్ద్‌వాని లోని సుశీల్ తివారి ఆసుపత్రికి తరలించినట్లు అల్మోరా జిల్లా విపత్తు నిర్వహణ అధికారి వనీత్‌పాల్ తెలిపారు. 43 సీట్లు ఉన్న బస్సులో 60 మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండటంతో వాహనం ప్రమాదానికి గురైందన్నారు. ఓవర్‌లోడ్ వల్లే విషాదం జరిగిందన్నారు. కాగా, ఘటనాస్థలి వద్ద పోలీసు, జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు. దీపావళి పండుగను జరుపుకునేందుకు వారం క్రితం తమ స్వస్థలాలకు చేరిన వారు పండుగ తరువాత తిరిగి పనులకు వెళ్తుండగా మృత్యువు కబళించినట్లు ఓ అధికారి పేర్కొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com